thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 265 కరీంనగర్ మంగళవారం, 2 డిసెంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## దేశ యువశక్తికి 'స్కైరూట్ ఇన్ఫినిటీ' క్యాంపస్ ప్రతిబింబం

### 'మన్ కీ బాత్'లో హైదరాబాద్ స్టార్టప్‌పై మోదీ ప్రశంసలు

న్యూఢిల్లీ : భారతదేశ అంతరిక్ష పర్యావరణ వ్యవస్థకు.. హైదరాబాద్ స్టార్టప్ 'స్కైరూట్ ఏరోస్పేస'కు చెందిన ఇన్ఫి నిటీ క్యాంపస్ కొత్త ఉత్సాహాన్ని ఇస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. ఈ కేంద్రం దేశంలోని నవీన ఆలోచన, ఆవిష్కరణ, యువశక్తికి ప్రతిబింబంగా నిలిచిందని కొనియా డారు. 128వ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ఆయన.. హైదరాబాద్‌కు చెంది న ఈ స్టార్టప్ సంస్థపై ప్రసశంసలు కురిపించారు. అలాగే.. ప్రపంచంలోనే అతిపెద్ద లీప్ ఇంజిన్ 'మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్‌హాల్ (ఎంఆర్‌వో)' సౌకర్యాన్ని ఇటీవలే హైదరాబాద్‌లో ప్రారంభించినట్టు వెల్లడించారు. విమాన నిర్వహణ, మరమ్మత్తు, పునఃపరిశీలన రంగంలో మనదేశం కీలక ముందడుగు వేసిందన్నారు. అలాగే.. 'వోకల్ ఫర్-లోకల్'ను ప్రోత్సహించే క్రమంలో.. పలు దేశాల ప్రధానులకు కరీంనగర్ సిల్వర్ ఫిలిగ్రీ నైపుణ్యాన్ని పరిచయం చేశానని, వివిధ కళాకృతులను వారికి బహూకరించానని వెల్లడించారు.



# అడ్డంకులను అడిగమిస్తూనే...
# అభివృద్ధి చేస్తున్నాం!

## దేశానికి, రాష్ట్రానికి పాలమూరును ఆదర్శంగా మారుస్తాం

### మక్తల్‌లో నిర్వహించిన ప్రజాపాలన - ప్రజా విజయోత్సవాల బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి

నారాయణపేట్, డిసెంబరు1 : ప్రజాప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తికావొస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రెండేళ్ల విజయోత్సవ సభ మొదట మక్తల్‌లో జరుపుకోవడం సంతోషకరమని పేర్కొన్నారు. ఇవాళ(సోమవారం) మక్తల్ నియోజకవర్గంలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటించారు. వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రసంగించారు సీఎం రేవంత్‌రెడ్డి. ఉమ్మడి రాష్ట్రంలో, ప్రత్యేక తెలంగాణ సిద్ధించిన తర్వాత కూడా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నిర్లక్ష్యానికి గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను పట్టించుకోలేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలనలో జిల్లాకు తీరని అన్యాయం చేశారని ధ్వజమెత్తారు.

**ఆటోడ్రైవర్లను రెచ్చగొడుతున్నారు..** మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తే.. ఆటోడ్రైవర్లను మాజీ మంత్రి కేటీఆర్ అండ్ కో రెచ్చగొట్టి తమ మీదకు పంపుతున్నారని ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు సీఎం. తమ ప్రభుత్వంలో పేదలకు కూడా సన్నబియ్యం ఇస్తున్నామని గుర్తుచేశారు. మహిళలను వ్యాపార వేత్తలుగా మార్చేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. దేశానికి, రాష్ట్రానికి పాలమూరును ఆదర్శంగా మారుస్తామని వివరించారు. ఎన్ని నిధులు కావాలన్నా ఇచ్చేందుకు సిద్ధమని చెప్పుకొచ్చారు. తమ ప్రభుత్వంలో ఇరిగేషన్‌తో పాటు ఎడ్యుకేషన్‌కు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రతి పేద బిడ్డకు చదువు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అన్ని నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా స్కూళ్లు ప్రారంభించామని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

**పాలమూరు గడ్డ ప్రేమిస్తే ప్రాణం ఇస్తుంది...** 'గత పాలకుల నిర్లక్ష్యానికి బలైన మక్తల్ నుంచి ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు ప్రారంభించడం నాకు చాలా సంతోషంగా ఉంది. ఇప్పటిదాకా మక్తల్ నారాయణపేట కొడంగల్‌కు సాగునీరు ఇవ్వాలని ఎవ్వరికీ అనిపించలేదు. కానీ 12 మందిని మీరు ఆశీర్వదించి పంపిస్తే నాకు ఇక్కడి ప్రజలకు సేవ చేసే అవకాశం వచ్చింది. మన కష్టాలను తీర్చేందుకు ఎవ్వరూ బాధ్యత తీసుకోలేదు. కానీ మీ సోదరుడిగా.. మీతో పాటు పెరిగిన బిడ్డగా సీఎంగా వచ్చాను. పాలమూరు గడ్డ ప్రేమిస్తే ప్రాణం ఇస్తుంది. కానీ మోసగిస్తే పాతాళానికి తొక్కింది.. ఇది కేసీఆర్ విషయంలో జరిగింది. గతంలో కేసీఆర్‌ను ఎంపీగా గెలిపించి.. సీఎంగా చేస్తే.. మన జిల్లాలో ఎలాంటి ప్రాజెక్టు పూర్తి చేయలేదు. రూ.12 కోట్లు కేటాయించి సంగంబండ రిజర్వాయర్ పూర్తి చేయలేదు. అందుకే ఎవరికో పెద్దరికం ఇవ్వొద్దని.. మన బిడ్డ సీఎంగా ఉండాలని మీరు కోరుకున్నారు. మంత్రి మండలి సహకారంతో.. ఇక్కడ అన్ని ప్రాజెక్టుల పనులు పూర్తి చేస్తున్నాం.. గతంలో జీవో నెంబరు- 69 ద్వారా వచ్చిన నారాయణపేట - కొడంగల్ ప్రాజెక్టును పక్కన పెట్టారు. కానీ మేము అధికారంలోకి వచ్చిన వెంటనే పూర్తి చేస్తున్నాం. ఇప్పటికీ కొంతమంది అడ్డంకులు పెట్టారు.. కానీ మా మంత్రి వాకిటి శ్రీహరి రైతులతో మాట్లాడి.. ఎకరానికి రూ.20 లక్షల పరిహారంతో 95 శాతం మంది రైతులు భూములు ఇవ్వడానికి ఒప్పుకోవడంతో పనులు ప్రారంభించాం. ఇది నా జీవితంలో చాలా సంతోషకరమైన విషయం. రెండు సంవత్సరాల్లో ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తాం.. ఈ ప్రాజెక్టుకు ఎవరైనా అడ్డుపడితే ఊరుకోం' అని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు.

**విద్యాభివృద్ధి ముఖ్యం..** 'విద్యాభివృద్ధి కూడా ముఖ్యం. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను రూ. 200 కోట్లతో ఏర్పాటు చేశాం. మహబూబ్‌నగర్ జిల్లాలో కాంగ్రెస్ నేతలు ఇద్దరు గెలవక పోయినా 14 నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ తీసుకువస్తున్నాం.. యెన్నం శ్రీనివాస్ రెడ్డి అడిగిన వెంటనే ట్రిపుల్ ఐటీ కాలేజీ తెచ్చాం.. పాల మూరు విశ్వవిద్యాలయంలో కావాల్సిన కోర్సులన్నీ తెచ్చా.. పాలమూరు జిల్లా విద్యాపరంగా రాష్ట్రానికి మోడల్‌గా ఉండాలి. సన్నబియ్యం, ఫ్రీ కరెంట్, ఫ్రీ బస్సు అన్నీ అమలు చేస్తున్నాం.. ఇది చాలదన్నట్లు మా ఆడబిడ్డలు పెట్రోల్ బంకులు, వెయ్యి బస్సులకు యజమానులు అయ్యారు. అంబానీ, అదానీలకు సమానంగా హై టెక్ సిటీలో మా అక్కలకు స్టాల్స్ వచ్చాయి. మీరు ఒక్కసారి ఆశీర్వదిస్తే ఇవన్నీ సాధ్యమయ్యాయి. అందుకే మాకు అండగా ఉన్న పాలమూరును అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం. మా మాదిగ సోదరులు వర్గీకరణ కోసం చేయని పోరాటంలేదు.. కానీ సుప్రీంకోర్టు తీర్పు వెంటనే నేను వర్గీకరణ చేసి మాల, మాదిగ పంచాయితీ లేకుండా చేసి చూపించా. బీసీ లెక్క చేసి.. దేశానికి ఆదర్శంగా నిలిచాం. సంక్షోభం దిశలో ఉన్న రాష్ట్రాన్ని సక్కగా చేస్తున్నా. గత కేసీఆర్ ప్రభుత్వంలో రూ. 8 లక్షల కోట్ల అప్పులు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కష్టాలు పడి అప్పులు తీర్చుకుంటూ అభివృద్ధిని చేసి చూపిస్తున్నాం.

కాళ్లల్లో కట్టెలు పెట్టే వారిని సర్పంచులుగా గెలిపిస్తే.. మళ్లీ అడ్డంకులు సృష్టిస్తారు. డిసెంబరు 8, 9వ తేదీల్లో గ్లోబల్ సమ్మిట్ పెట్టుకుని.. మన తెలంగాణ రాష్ట్ర ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటుదాం. ఇన్ని చేస్తుంటే.. మీరు సర్పంచులుగా వేరే వారిని గెలిపిస్తే.. అభివృద్ధిని అడ్డుకుంటారు. పార్టీలను పదేళ్లు పక్కన పెడదాం.. మన పాలమూరును అభివృద్ధి చేసుకుందాం.

ఈ గడ్డ దేశానికి జైపాల్‌రెడ్డి లాంటి నాయకుడిని.. మనకు బూర్గుల రామకృష్ణారావు లాటి తొలి సీఎంను ఇచ్చింది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాగైతే మమ్మల్ని గెలిపించారో.. ఇప్పుడు సర్పంచులుగా కాంగ్రెస్ నేతలను ఆశీర్వదించి.. మన ప్రభుత్వ అభివృద్ధిని కొనసాగించాలి. మీ అందరి ఆశీర్వాదం తీసుకుని తెలంగాణ రాష్ట్రం మొత్తం తిరుగుతా' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.




## హిల్ట్ పాలసీపై గవర్నర్‌కు భాజపా నేతల ఫిర్యాదు

హైదరాబాద్: తెలంగాణ భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావు నేతృత్వంలో పార్టీ ప్రతినిధుల బృందం గవర్నర్‌ను కలిసింది. హిల్ట్ పాలసీ పేరుతో రూ.వేలకోట్ల కుంభకోణం జరుగుతోందని ఫిర్యాదు చేసింది. అక్రమాలు జరగకుండా చూడాలని వినతిపత్రం అందజేసింది. గవర్నర్‌ను కలిసిన వారిలో భాజపా శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరేందర్ గౌడ్, ఎన్వీ సుభాష్ తదితరులు ఉన్నారు. హైదరాబాద్ పారిశ్రామిక ప్రాంతాల్లోని భూములను బహుళ వినియోగ జోన్లుగా మార్చేందుకు ప్రభుత్వం 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్' (హిల్ట్) పాలసీని అమల్లోకి తెచ్చిన విషయం తెలిసిందే. "హిల్ట్ పాలసీ ద్వారా అక్రమాలు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.

9 వేల ఎకరాలను రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసేందుకు యత్నిస్తోంది. అప్పటి, ఇప్పటి ధరలు పోల్చి చూస్తే అక్రమాలు తెలుస్తున్నాయి. కోకాపేటలో భూముల ధర ఇటీవల ఎంత పలికిందో మనం చూశాం. ఈ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు అమలు చేస్తోంది. ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ డిసెంబర్ 7న ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహిస్తాం. జీహెచ్ఎంసీ విస్తరణలోనూ అనేక కుట్రలు ఉన్నాయి" అని నేతలు ఆరోపించారు.

## డ్రామా అంటే అది: ప్రధాని మోదీ వ్యాఖ్యలపై స్పందించిన ప్రియాంకా గాంధీ

చట్టసభల్లో డ్రామాలొద్దని, టిప్స్ ఇస్తానంటూ ప్రధాని మోదీ విసిరిన వ్యంగ్యాస్త్రాలపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా స్పందించారు. సమావేశాల్లో భాగంగా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్), దిల్లీ కాలుష్యం వంటి తీవ్రమైన అంశాలను లేవనెత్తడం డ్రామా ఎలా అవుతుందని ఆమె ప్రశ్నించారు.

"ఎన్నికల నిర్వహణలో అవకతవకలు, ఎస్ఐఆర్, కాలుష్యం వంటివి తీవ్రమైన అంశాలు. వాటిని చర్చిద్దాం. ఈ అంశాలపై చర్చ లేకపోతే పార్లమెంట్ దేనికి..? వాటి గురించి మాట్లాడటమేమీ డ్రామా కాదు. ప్రజా సమస్యలపై ప్రజాస్వామ్య చర్చలకు అనుమతించకపోవడమే డ్రామా అంటే" అని మోదీ విమర్శలకు ప్రియాంక బదులిచ్చారు. ప్రధాని మోదీ పార్లమెంట్ వేదికగా ప్రజాసమస్యలపై చర్చించడానికి బదులు మరోసారి నాటకీయ ప్రసంగం చేశారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. కాంగ్రెస్ రాజ్యాంగ విలువలకు కట్టుబడి ఉంటుందన్నారు. సోమవారం శీతాకాల సమావేశాల ప్రారంభానికి ముందు పార్లమెంట్ ఆవరణలో ప్రధాని మోదీ మీడియా మాట్లాడారు. ఆ సందర్భంగా విపక్షాలకు చురకలు పెట్టారు. "కొత్త ఎంపీలకు స్ఫూర్తి కలిగించేలా మన ప్రవర్తన ఉండాలి.



చట్టసభల్లో డ్రామాలు వద్దు. సానుకూల వాతావరణంలో చర్చలు జరగాలి. నినాదాలు చేస్తూ సభా కార్యక్రమాలకు అడ్డుతగలవద్దని కోరుతున్నాను. విపక్షాలు ఓటమి నిరాశను అధిగమించాలి. గత పదేళ్లుగా ప్రతిపక్షాలు ఆడుతున్న ఆట దేశ ప్రజలకు ఇక ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. వారు తమ వ్యూహాన్ని మార్చుకోవాలి. వారికి కొన్ని టిప్స్ ఇవ్వడానికి నేను సిద్ధంగా ఉన్నాను" అని ఎద్దేవా చేశారు.

# కగార్ దెబ్బతో పి ఎల్ జీ ఏ కకా వికలం..!

## -దక్షిణాది రాష్ట్రాల్లో 2001 నుండి వేడుక
## -ప్రతి డీసెంబర్ 2 నుండి మావోయిస్టుల సభలు, సమావేశాలు
## -ఈ సారి ప్రశ్నార్థకం,అయోమయం



చురకలు ప్రతినిధి : భారత విప్లవోద్యమ చరిత్రలో ఈ 2025 విషాద సంఘటనలు ఎన్నో జరగాయి.మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సెక్రటరీ నంబాల కేశవరావు సహా పలువురు ఆపార్టీ మూల స్తంభాలను పోలీసులు కగార్ ఆపరేషన్ ద్వారా మట్టుబెట్టారు.ఎంతో ఘనంగా జరపాల్సిన పీ.ఎల్.జీ.ఏ. 25వ వార్షికోత్సవాలను 2025 డిసెంబర్ 2 నుండి 8 వరకు దేశవ్యాప్తంగా విప్లవోత్సాహంతో జరుపుకోవాలని ఇచ్చి ముందుకు సాగలేని పరిస్థితి ఏర్పడింది.కోసా దాదా విజయ్ దాదా వికల్ప్ దాదా జార?ండ్ లో మాంజా రామచంద్ర రెడ్డి శాంతి చర్చల గణేష్ సుధాకర్ తాజాగా మావో సైనికులు హిడ్మా సహా శంకర్ ల ఎన్కౌంటర్ లో పెద్ద సంఖ్యలో ప్రాణాలు కోల్పోవడం ఆందోళన కలిగించే అంశం.. అయితే మిగిలిన వారంతా తమ వంతు గా నివాళి అర్పించడానికి సిద్ధంగా ఉన్నారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆ పార్టీ నేతలు పంపిన లేఖను అందిస్తున్నాం.. విప్లవ ప్రతిఘాతక 'కగార్' యుద్ధం నుండి పార్టీని, పీ.ఎల్.జీ.ఏ.ను, ప్రజాసంఘాలను, విప్లవోద్యమాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. కానీ ఈ మధ్య కాలంలో మావోయిస్టు ఇంత పెద్ద విషమ పరిస్థితి ఎదుర్కోలేదని సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ, భూస్వామ్య వర్గాల కూటమికి వ్యతిరేకంగా, బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు ఆర్ఎస్ఎస్-బీజేపీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా వర్గపోరాటాన్ని తీవ్రతరం చేద్దాం. పీ.ఎల్.జీ.ఏ. 25వ వార్షికోత్సవాల సందర్భంగా యావత్తు పార్టీకి, పీ.ఎల్.జీ.ఏ.కు, ప్రజా నిర్మాణాలకు, పీడిత ప్రజలకు సెంట్రల్ మిలిటరీ కమిషన్ (సీఎంసీ), సీపీఐ (మావోయిస్టు) పిలుపు! సెంట్రల్ మిలిటరీ కమిషన్ సీపీఐ (మావోయిస్టు)

పీ.ఎల్.జీ.ఏ. 25వ వార్షికోత్సవాలను 2025 డిసెంబర్ 2 నుండి 8 వరకు దేశవ్యాప్తంగా విప్లవోత్సాహంతో జరుపుకుందాం. విప్లవ ప్రతిఘాతక 'కగార్' యుద్ధం నుండి పార్టీని, పీ.ఎల్.జీ.ఏ.ను, ప్రజాసంఘాలను, విప్లవోద్యమాన్ని కాపాడుకుందాం.

సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ, భూస్వామ్య వర్గాల కూటమికి వ్యతిరేకంగా, బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు ఆర్ఎస్ఎస్-బీజేపీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా వర్గపోరాటాన్ని తీవ్రతరం చేద్దాం.

**ప్రియమైన కామ్రేడ్స్, ప్రజలారా!...**

దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవ విజయసాధన కోసం ప్రజాయుద్ధాన్ని కొనసాగిస్తున్న ప్రజావిముక్తి గెరిల్లా సైన్యానికి (పీ.ఎల్.జీ.ఏ.) ఈ డిసెంబర్ 2 నాటికి 25 ఏళ్లు నిండుతాయి. ఈ సందర్భంగా డిసెంబర్ 2 నుండి 8 వరకు పీ.ఎల్.జీ.ఏ. 25వ వార్షికోత్సవాలను దేశవ్యాప్తంగా అటవీ, మైదాన, పట్టణ ప్రాంతాల్లో విప్లవోత్సాహంతో, దృఢసంకల్పంతో జరపాల్సిందిగా యావత్తు పార్టీ కమీటీలకు, పార్టీ శ్రేణులకు, పీ.ఎల్.జీ.ఏ. కమాండ్లకు, యూనిట్లకు, ప్రజాసంఘాలకు, విప్లవ ప్రజానీకానికి సెంట్రల్ మిలిటరీ కమిషన్ (సీఎంసీ) పిలుపునిస్తోంది. "విప్లవ ప్రతిఘాతక యుద్ధం నుండి పార్టీని, పీ.ఎల్.జీ.ఏ.ను, ప్రజాసంఘాలను, విప్లవోద్యమాన్ని కాపాడుకుందాం. సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ, భూస్వామ్య వర్గాల కూటమికి వ్యతిరేకంగా, బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు ఆర్ఎస్ఎస్-బీజేపీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా వర్గపోరాటాన్ని తీవ్రతరం చేద్దామని" ఈ సందర్భంగా యావత్తు విప్లవ శిబిరానికి సీఎంసీ పిలుపునిస్తోంది. పీ.ఎల్.జీ.ఏ. 24వ వార్షికోత్సవాల సందర్భంగా యావత్తు పార్టీకి, పీ.ఎల్.జీ.ఏ.కు, ప్రజా నిర్మాణాలకు, విప్లవ ప్రజానీకానికి సీఎంసీ ఇచ్చిన కర్తవ్యాల సాధన కోసం గత సంవత్సరకాలంగా ఉత్సాహంతో, దృఢసంకల్పంతో, ధైర్యసాహసాలతో కృషిచేస్తున్న యావత్తు పార్టీ కమిటీలకు, పార్టీ శ్రేణులకు, పీ.ఎల్.జీ.ఏ. కమాండ్లకు, కమాండర్లకు-యోధులకు, ప్రజాసంఘాల నాయకులకు-కార్యకర్తలకు, ప్రజా మిలిషియా సభ్యులకు, విప్లవ ప్రజానీకానికి సీఎంసీ విప్లవాభినందనలు తెలియజేస్తోంది. గత సంవత్సర కాలంగా కొనసాగుతున్న 'కగార్' విప్లవ ప్రతిఘాతక **(మిగతా 3వ పేజీలో)**

చురకలు






## మేడారం పనుల నాణ్యతలో రాజీ పడొద్దు: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: మేడారంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సీఎం రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సమీక్ష నిర్వహించారు. నిర్మాణపనులపై అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. గద్దెల దగ్గరలో ఉన్న చెట్లను తొలగించవద్దని సీఎం సూచించారు. పనుల నాణ్యతలో ఏమాత్రం రాజీపడొద్దన్నారు. నిర్మాణంలో చిన్న విమర్శలకు కూడా తావు ఇవ్వొద్దని, గద్దెల వద్ద వరదనీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గద్దెల వద్ద నాలుగువైపులా ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. గుడి చుట్టూ పచ్చదనం కన్పించేలా అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ సమావేశానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు తదితరులు హాజరయ్యారు.




## ఫుడ్‌బాల్ దిగ్గజం మెస్సీతో మ్యాచ్ ఆడనున్న సీఎం రేవంత్

హైదరాబాద్, డిసెంబర్ 1: ప్రజాపాలనలో భాగంగా నిత్యం అధికారులతో సమీక్షలు, సమావేశాలతో బిజీగా ఉండే సీఎం రేవంత్ రెడ్డి ఫుడ్ బాల్ ప్రాక్టీస్ చేశారు. డిసెంబర్ 13న ఉప్పల్ స్టేడియంలో జరిగే ఫ్రెండ్లీ ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో సీఎం పాల్గొంటారు. ఈ మ్యాచ్‌లో ఫుడ్‌బాల్ దిగ్గజం మెస్సీ పాల్గొననున్నారు. మెస్సీతో కలిసి సీఎం ఫుట్‌బాల్ ఆడనున్నారు. దీనిలో భాగంగా ఎంసీహెచ్‌ఆర్‌డీలో ఫుట్‌బాల్ ప్రాక్టీస్ ప్రారంభించారు. ఇక గోట్ ఇండియా టూర్ 2025 లో భాగంగా స్టార్ ప్లేయర్ మెస్సీ హైదరాబాద్‌లో పర్యటించనున్న నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. హైదరాబాద్‌లో అడుగుపెట్టనున్న మెస్సీకి ప్రభుత్వం ఘన స్వాగతం పలికేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇక గోట్ ఇండియా టూర్ 2025లో డిసెంబర్ 13న ఉప్పల్ స్టేడియంలో జరిగే ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో మెస్సీతో కలిసి సీఎం రేవంత్ పోటీ పడనున్నారు. మెస్సీ టీంతో తలపడే జట్టుకు ముఖ్యమంత్రి రేవంత్ కెప్టెన్సీ వహించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ స్కూల్స్‌కు చెందిన ఫుట్ బాల్ ప్లేయర్లు రేవంత్ టీంలో ఆడనున్నట్లు సమాచారం. ఆర్‌ఆర్ 9 జెర్సీతో సీఎం బరిలోకి దిగనున్నారు. ఫుట్‌బాల్ అంటే సీఎంకు ఎంతో ఇష్టమనే విషయం తెలిసిందే. ఈక్రమంలో ఎంతో బిజీ ఉన్నప్పటికీ ఈ మ్యాచ్ కోసం సీఎం రేవంత్ ఫుట్‌బాల్ ప్రాక్టీస్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఫుట్‌బాల్ ప్రాక్టీస్ చేస్తున్న సీఎం రేవంత్ ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అలాగే ఈ ఫోటోలను కాంగ్రెస్ శ్రేణులు, రేవంత్ అభిమానులు షేర్ చేస్తున్నారు.

## ఫలించిన మంత్రి తుమ్మల చర్చలు.. పత్తి కొనుగోళ్లపై తొలగిన ప్రతిష్టంభన

హైదరాబాద్: రాష్ట్రంలో పత్తి కొనుగోళ్లపై జిన్నింగ్ మిల్లులు, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) మధ్య నెలకొన్న ప్రతిష్టంభన తొలగింది. సీసీఐ తీసుకొచ్చిన కొన్ని నిబంధనలను రాష్ట్రంలోని జిన్నింగ్ మిల్లులు వ్యతిరేకించడంతో ఇటీవల కొనుగోళ్లు నిలిచిపోయాయి. దీంతో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ సమస్యపై దృష్టి సారించి.. సీసీఐ, జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలతో పలు దఫాలుగా చర్చలు నిర్వహించారు. ఈ అంశంపై కేంద్ర మంత్రులతో పాటు సీసీఐ సీఎండీతో మాట్లాడి.. నిబంధనల్లో మార్పులు చేసేందుకు అంగీకరించేలా ఒప్పించారు. దీంతో రాష్ట్రంలో నోటిఫై చేసిన మొత్తం 330 మిల్లుల్లో పత్తి కొనుగోళు తిరిగి ప్రారంభం కానున్నాయి. రాష్ట్రంలో ఇప్పటి వరకు సీసీఐ మొత్తం 3.66 లక్షల టన్నుల పత్తిని సేకరించింది. రైతుల వద్ద నిల్వ



ఉన్న పత్తిని పూర్తి స్థాయిలో కొనుగోలు చేసేలా ఇకపై సీసీఐ, జిన్నింగ్ మిల్లులు పనిచేస్తాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

## లీజు భూములను కన్వర్షన్ చేసే అవకాశం ఇవ్వలేదు: మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్: హిల్ట్ పాలసీపై విపక్షం అవాస్తవాలు ప్రచారం చేస్తోందని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. సోమవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. లీజుకు ఇచ్చిన ప్రభుత్వ భూములను కన్వర్షన్ చేసే అవకాశం ఇవ్వలేదని స్పష్టం చేశారు. పట్టాలు ఉండి.. సొంత భూములు ఉన్నవారికే కన్వర్షన్ ఫీజు పెట్టామని తెలిపారు. గత సర్కారే ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేసే జీవో ఇచ్చిందన్నారు. "భారత రాష్ట్ర సమితి హయాంలో ప్రభుత్వ భూములపై యాజమాన్య హక్కులను పారిశ్రామికవేత్తలకు ఇచ్చే జీవో తీసుకొచ్చారు. ఖాయిలా పడిన పరిశ్రమల భూములను వినియోగం లోకి తెచ్చే ప్రయత్నమే హిల్ట్ పాలసీ. ప్రభుత్వ భూమిపై హక్కును బదిలీ చేస్తున్నామనేది అబద్ధం. హిల్ట్ పాలసీలో ఎస్ఆర్‌వో రేటు కంటే ఎక్కువ ఫీజు నిర్ణయించాం" అని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.







## తెలంగాణను సినిమా హబ్‌గా మార్చే మరో కీలక అడుగు

తెలంగాణలో గ్లోబల్ సమ్మిట్ కోసం ఏర్పాట్లు ఘనంగా జరుగుతున్నాయి. ఈ నెల 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో జరగనున్న ఈ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు కావాల్సిందిగా వివిధ రంగాలకు చెందిన మూడు వేల మంది ప్రతినిధులకు ప్రత్యేకంగా ఆహ్వానాలు పంపారు. గ్లోబల్ సమ్మిట్ కోసం ప్రత్యేక వేదికను ఫ్యూచర్ సిటీలో రూపొందిస్తున్నారు. సమ్మిట్‌లో భాగంగా మూడు వేల డ్రోన్లతో షోను ఏర్పాటు చేస్తున్నారు. హైదరాబాద్‌లో అజయ్ దేవ్‌గన్ ఫిల్మ్ సిటీ రూపొందించనున్నారు. ప్రపంచ స్థాయి ఫిల్మ్ సిటీని నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో అజయ్ దేవ్‌గన్ ఎంఓయూ కుదుర్చుకోనున్నారు. అలాగే హైదరాబాద్ నగరంలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు రిలయన్స్ గ్రూప్ ముందుకు వచ్చింది. వెంటారా కన్జర్వేటరీ నిర్మించేందుకు రిలయన్స్ ఆసక్తిగా ఉంది. వెంటారా యానిమల్ రెస్క్యూ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేయబోతోంది. వైల్డ్ లైఫ్ కన్జర్వేటరీ, నైట్ సఫారీ ప్రాజెక్ట్ పర్యాటక రంగానికి భారీ ప్రోత్సాహకం అందించనున్నాయి. %గ్లోబల్ సమ్మిట్‌కు భారీ స్పందన లభిస్తోంది. సమ్మిట్‌లో కీలక ఒప్పందాల చేసుకునేందుకు పలువురు పెట్టుబడి దారులు ముందుకు వస్తున్నారు. ఫుడ్‌లింక్ భారీ ఇన్వెస్ట్‌మెంట్ చేయబోతోంది. రూ. 3,000 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. ఫ్యూచర్ సిటీలో మూడు లగ్జరీ హోటల్స్ నిర్మాణానికి ఒప్పందం కుదుర్చుకోనుంది. ఈ గ్లోబల్ సమ్మిట్ ద్వారా ప్రభుత్వం ప్రత్యేక పాలసీని ప్రకటించనుంది.




హైదరాబాద్: తెలంగాణలోని మహిళా సంఘాల సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ఊతమిచ్చింది. మహిళా సంఘాలకు మరో 448 అద్దె బస్సులు కేటాయించింది. ఈ మేరకు ప్రభుత్వ నిర్ణయాన్ని మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. రాష్ట్రంలో మహిళాశక్తి పథకం కింద స్వయం సహాయక సంఘాల ద్వారా బస్సులను కొనుగోలు చేయించి, వాటిని ఆర్టీసీకి అద్దెకు ఇప్పించాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే మొదటి విడతలో ఉమ్మడి వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాల్లోని 150 మహిళా సంఘాలకు 150 బస్సులను కొనుగోలు చేసింది.

## తక్కువ రేట్లకే భూములు ధారాదత్తం.. సర్కార్‌పై బీజేపీ నేతల ఫైర్

హైదారాబాద్, డిసెంబర్ 1: రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన హిల్ట్ పాలసీని వ్యతిరేకిస్తూ ఈరోజు (సోమవాం) గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను బీజేపీ నేతలు కలిశారు. సర్కార్ తీసుకొచ్చిన హిల్ట్ పాలసీపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు మీడియాతో మాట్లాడుతూ.. హిల్ట్ పాలసీని వ్యతిరేకిస్తూ గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేశామని తెలిపారు. ఇండస్ట్రియల్‌కు కేటాయించిన భూములను హిల్ట్ పేరుతో రియల్ ఎస్టేట్‌గా మారుస్తూ కోట్ల రూపాయలు అవకతవకలకు తెర లేపుతున్నారని ఆరోపించారు. మార్కెట్ వాల్యూ కన్నా తక్కువ రేట్లకు ధారాదత్తం చేస్తున్నారని విమర్శించారు. 6 లక్షల 30 వేల కోట్ల విలువైన 9292 వేల ఎకరాల భూములను కేవలం 5 వేల కోట్లకు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కట్టబెడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుందా..? పరిపాలన చేస్తుందా.. అని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలు అమలు పరచడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందింది కాబట్టే ఇండస్ట్రియల్ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కట్టబెట్టి లబ్ధి పొందుతున్నారని వ్యాఖ్యలు చేశారు. హిల్ట్‌కు వ్యతిరేకంగా ఈనెల 7న ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా



చేపట్టబోతున్నామని ప్రకటించారు. హిల్ట్ పాలసీపై ప్రభుత్వంతో చర్చిస్తానని గవర్నర్ హామీ ఇచ్చారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు వెల్లడించారు. హిల్ట్‌పై గవర్నర్‌కు ఫిర్యాదు చేశామని.. ప్రభుత్వ వైఫల్యాను వ్యతిరేకంగా 7న నిరసన దీక్ష చేపట్టబోతున్నామని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రకటించారు. కాగా.. రామచందర్ రావుతో పాటు బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి వీరేందర్ గౌడ్, జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్ ఇతర నేతలు గవర్నర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

## ఆ రైతుది ఆత్మహత్య కాదు.. ప్రభుత్వ హత్యే: హరీష్ రావు




హైదరాబాద్, డిసెంబర్ 1: కౌలు రైతుల రైతు భరోసాకు సంబంధించి తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. కౌలు రైతుల బతుకులకు భరోసా లేకుండా చేస్తోందంటూ రేవంత్ సర్కార్‌పై మండిపడ్డారు. ఖమ్మం జిల్లాలో రైతు వీరన్న ఆత్మహత్యపై రియాక్ట్ అయిన మాజీ మంత్రి.. రైతు వీరన్న ఆత్మహత్యకు ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. రైతుది ఆత్మహత్య కాదని.. ప్రభుత్వ హత్యే అంటూ మాజీ మంత్రి హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

**హరీష్ ట్వీట్..** 'కౌలు రైతులకు రైతు భరోసా ఇస్తామని చెప్పి, నేడు వారి బతుకులకు భరోసా లేకుండా చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో కౌలు రైతు బానోతు వీరన్న ఆత్మహత్య అత్యంత బాధాకరం. పురుగుల మందు తాగుతూ.. పండించిన పంటకు ధర రాక, అప్పులు తీర్చే దారిలేక చనిపోతున్నా అని వీరన్న తీసుకున్న సెల్ఫీ వీడియో కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగానికి చేసిన మోసాలకు నిదర్శనం. వీరన్నది ఆత్మహత్య కాదు, ప్రభుత్వం చేసిన హత్యనే. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయని ఫలితంగా బతుకులు భారమై రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఎన్నికలకు ముందు కౌలు రైతులకు ఏడాదికి రూ. 15,000 రైతుభరోసా ఇస్తామని బాండ్లు రాసిచ్చి, తీరా అధికారంలోకి వచ్చాక మోసం చేయడం దుర్మార్గం. పండించిన పంటను కొనే దిక్కులేక, మద్దతు ధర రాక, దళారుల దోపిడీకి రైతులు బలవుతున్నారు. సెల్ఫీ వీడియోలో వీరన్న చెప్పిన మాటలకైనా ఈ ప్రభుత్వానికి చలనం వస్తుందా? ఇచ్చిన హామీ ప్రకారం కౌలు రైతులకు ఎప్పుడు రైతు భరోసా ఇస్తారు? మీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఇంకెంత మంది రైతులను బలి తీసుకుంటారు? రేపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖమ్మం జిల్లా పర్యటనలో కౌలు రైతు బానోతు వీరన్న కుటుంబాన్ని పరామర్శించాలని, ఆ కుటుంబానికి ప్రభుత్వం వెంటనే ఎక్స్ గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. రైతులెవరూ ఆత్మవిశ్వాసాన్ని కోల్పోవద్దని, ఆత్మహత్యలకు పాల్పడవద్దని చేతులు జోడించి విన్నవిస్తున్నాం. కాంగ్రెస్ మేనిఫెస్టోలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేసేదాకా పోరాటం చేద్దాం.. మీకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఉంటుంది. వచ్చేది కేసీఆర్ గారి ప్రభుత్వమే.. రైతులకు మళ్లీ మంచి రోజులు వస్తాయి... ఎవరూ అధైర్యపడకండి' అంటూ మాజీ మంత్రి హరీష్ రావు ట్వీట్ చేశారు.




సైబర్ నేరగాళ్ల ఖాతాలు ఫ్రీజ్ చేసేందుకు కృత్రిమమేధ (ఏఐ) ఎందుకు వాడట్లేదని రిజర్వ్ బ్యాంక్‌ను సోమవారం సుప్రీంకోర్టు ప్రశ్నించింది. డిజిటల్ అరెస్టు కేసుల విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ కేసుల్లో పాన్ ఇండియా స్థాయిలో ఒకేతరహాలో దర్యాప్తు ఉండాలని కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐకి సూచించింది. సీబీఐ విచారణకు సమ్మతి తెలియజేయాలని బెంగాల్, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు సూచనలు చేసింది. గత కొంతకాలంగా దేశంలో డిజిటల్ అరెస్టులు కలకలం సృష్టిస్తున్నాయి. తాము ప్రభుత్వ అధికారులమంటూ నేరగాళ్లు ఆడియో, వీడియో కాల్స్ చేసి, బాధితులను భయపెట్టి, డిజిటల్ అరెస్టు చేస్తున్నారు. బెదిరించి కోట్ల రూపాయలు కొల్లగొడుతున్నారు. డిజిటల్ అరెస్టు కారణంగా తాను రూ.కోటి కోల్పోయానని హరియాణాకు చెందిన ఓ వృద్ధ మహిళ వేసిన కేసు నేపథ్యంలో కొన్నిరోజులుగా సుప్రీంకోర్టు (%ాబజూతీవఎవ జశీబతీ%)లో విచారణ జరుగుతోంది. సైబర్ నేరాల కేసుల్లో నేరగాళ్లు ఉపయోగించే బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేయడానికి కృత్రిమ మేధ లేక మెషిన్ లెర్నింగ్ టెక్నాలజీని ఎందుకు వాడట్లేదో తెలియజేయాలని తాజాగా ఆర్‌బీఐకి సుప్రీంకోర్టు నోటీసులు ఇచ్చింది. నిందితులు ఎక్కువగా సీనియర్ సిటిజెన్లను లక్ష్యంగా చేసుకుంటున్నారని, వారు జీవితాంతం సంపాదించిన సొమ్మును దోచుకుంటున్నారని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. ఈ కేసుల దర్యాప్తులో ఐటీ అనుబంధ సంస్థల సహకారం తీసుకోవాలని సీబీఐని ఆదేశించింది. టెలికాం సంస్థలు ఒక వినియోగదారుడికి ఎక్కువ సంఖ్యలో సిమ్ కార్డులు అందకుండా చూసుకోవాలని సూచించింది. అలాగే అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ప్రాంతీయ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్లను ఏర్పాటు చేయాలని, దానిద్వారా దర్యాప్తులో సీబీఐతో సమన్వయం చేసేందుకు ఉపయోగపడుతుందని పేర్కొంది.

# కగార్ దెబ్బతో పి ఎల్ జీ ఏ కకా వికలం.!

**(మొదటి పేజీ తరువాయి)**యుద్ధాన్ని సాహసోపేతంగా ఎదుర్కొంటూ సాగుతున్న రాజకీయ, సైనిక, నిర్మాణ, సాంస్కృతిక, టెక్నికల్ కృషిలో పాల్గొంటున్న కామ్రేడ్స్ కందరికీ సీఎంసీ విప్లవాభినందనలు తెలియజేస్తోంది. దేశంలో విప్లవోద్యమ ప్రాంతాల్లో సాగిన గెరిల్లాయుద్ధ చర్యల్లో గాయపడిన కామ్రేడ్స్ త్వరగా కోలుకుని సమరోత్సాహంతో గెరిల్లాయుద్ధంలో తమవంతు బాధ్యత నిర్వహిస్తారని సీఎంసీ విశ్వసిస్తోంది. గత సంవత్సర కాలంగా సాగుతున్న కగార్ యుద్ధాన్ని సాహసోపేతంగా ప్రతిఘటిస్తూ అసువులు బాసిన వీర గెరిల్లాలకూ, చుట్టివేత దాడుల్లో (ఎన్ సర్కిల్ మెంట్ దాడుల్లో), ఎన్ కౌంటర్లలో, బూటకపు ఎన్ కౌంటర్లలో, శత్రువుపై చేసిన యుద్ధ చర్యల్లో, విద్రోహాలలో, దుర్ఘటనల్లో, అనారోగ్యంతో, ఇంకా ఇతర కారణాలతో అసువులు బాసిన అమరవీరులందరికీ సీఎంసీ తలవంచి వినమ్రంగా విప్లవ జోహార్లు అర్పిస్తోంది. 2024 జనవరి నుండి ప్రారంభమయి, గత సంవత్సర కాలంగా రోజురోజుకు మరింత భీకరంగా సాగుతున్న కగార్ యుద్ధానికి బెదరకుండా, ప్రాణమున్నంత వరకు ప్రతిఘటనే మా మార్గం అంటూ శత్రువును ప్రతిఘటిస్తూ, తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన అమరుల అసమాన ధైర్యసాహసాలు, శత్రువుకు తలవంచని వారి ధీరోదాత్తత, చావుకు వెరవని, అలుపెరగని మావోయిస్టు పోరాటశైలి, ప్రజల పట్ల వారి అంకితభావం, త్యాగనిరతి, విప్లవ విజయం పట్ల వారి అచంచల విశ్వాసం మనకు సదా ఆదర్శనీయం, అనుసరణీయం. వారి త్యాగాలను ఎత్తిపడదాం, వారి వీరోచిత ప్రతిఘటన వీరగాథలను ప్రపంచానికి చాటిచెపుదాం, వారి ఆదర్శాలను గానం చేద్దాం, వారి అడుగుజాడల్లో సడుస్తూ, వారి ఆశయ సాధనకోసం చివరి శ్వాస వరకు దృఢంగా పోరాడుదామని శపథం చేద్దాం. భారత నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసే లక్ష్యంతో విప్లవ ప్రతిఘాతక కగార్ యుద్ధాన్ని ప్రతిఘటిస్తూ గత 11 నెలల కాలంలో (డిసెంబర్ 2024 నుండి 2025 నవంబర్ వరకు) దేశవ్యాప్తంగా 320 మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. వీరిలో 183 మంది పురుష కామ్రేడ్స్, 117 మంది మహిళా కామ్రేడ్స్, వివరాలు తెలియనివారు 20 మంది ఉన్నారు. బిహార్ – ఝార?ండ్ లో 22 మంది అస్సాంలో ఒకరు డీకేలో 243 మంది ఒడిసాలో 33 మంది, ఎంఎంసీలో 7 మంది, తెలంగాణలో 8 మంది, ఏఓబీలో 6 మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. వీరిలో మనపార్టీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ బసవరాజు (బీఆర్) సహ 8 మంది కేంద్రకమిటీ సభ్యులు, 15 మంది రాష్ట్రకమిటీ స్థాయి కామ్రేడ్స్, 25 మంది జిల్లా కమిటీ స్థాయి కామ్రేడ్స్, 73 మంది ఏరియా కమిటీ స్థాయి కామ్రేడ్స్, 116 మంది పార్టీ సభ్యులు, 13 మంది పీ.ఎల్.జీ.ఏ. సభ్యులు, 33 మంది స్థానిక ప్రజా నిర్మాణాల కామ్రేడ్స్, విప్లవ ప్రజలు ఉన్నారు. వీరితో పాటు స్థాయిల వారీగా వివరాలు తెలియని వారు 37 మంది వున్నారు. వీరితో పాటుగా దేశవ్యాప్తంగా ప్రజా ఉద్యమాలలో పనిచేసే పలువురు విప్లవ, ప్రగతిశీల, ప్రజాస్వామిక సంఘాల నాయకులు, కార్యకర్తలు, మేధావులు, విప్లవ సానుభూతిపరులు, మిత్రులు కన్నుమూసారు. ఫిలిప్పీన్స్ విప్లవోద్యమంలో ఆ దేశ విప్లవ కమ్యూనిస్టు పార్టీ (సీపీపీ) కేంద్రకమిటీ సభ్యులు, నూతన ప్రజాసైన్యపు కమాండర్లు, సభ్యులు, నేషనల్ డెమోక్రటిక్ ఫ్రంట్ నాయకులు, కార్యకర్తలు కొంతమంది అమరులయ్యారు. అమెరికా దన్నుతో యూదు దురంహకార ఇజ్రాయిల్ ప్రభుత్వం పాలస్తీనాలోని గాజా ప్రజలపై గత 2 సంవత్సరాలుగా సాగిస్తున్న సరసంహార యుద్ధంలో దాదాపు 75 వేల మంది పాలస్తీనా ప్రజలు, పోరాటకారులు అమరులయ్యారు. ఈ అమరులందరికీ సీఎంసీ విప్లవ జోహార్లు అర్పిస్తోంది. కగార్ యుద్ధంలో మన పార్టీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ బసవరాజు సహ 8 మంది కేంద్రకమిటీ సభ్యులను, 15 మంది రాష్ట్రకమిటీ సభ్యులను, మొత్తంగా 320 మంది కామ్రేడ్స్ ను కోల్పోయి, విప్లవోద్యమం తీవ్రమైన నష్టాల పాలవుతున్న స్థితిలో, సోను, సతీష్ ల ముఠా శత్రువుకు ఆయుధాలు అప్పగించి, లొంగిపోయి విప్లవోద్యమానికి తీవ్రమైన నష్టం కలిగించిన స్థితిలో మనం పీ.ఎల్.జీ.ఏ. 25వ వార్షికోత్సవాలను జరుపుకుంటున్నాం. ఈ స్థితిలో విప్లవోద్యమ భవిష్యత్తు పట్ల విప్లవ శిబిరంలో తలెత్తుతున్న ప్రశ్నలకు జవాబునిస్తూ, భయాందోళనలకు గురయిన వారికి ధైర్యాన్ని కల్పిస్తూ, వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతూ, దృఢ సంకల్పంతో, అసమాన ధైర్యసాహసాలతో యావత్తు విప్లవ శిబిరాన్ని విప్లవోద్యమంలో ముందుకు నడపడమే మనపార్టీ, పీ.ఎల్.జీ.ఏ. కర్తవ్యం. ఈ కర్తవ్య సాధనలో భాగంగానే పీ.ఎల్.జీ.ఏ. వార్షికోత్సవాలను జరుపుకుందాం.

ఈ కర్తవ్య సాధన కోసం ప్రస్తుతం విప్లవోద్యమంలో జరుగుతున్న తీవ్రమైన నష్టాలకు కారణాల్ని గుర్తించి వాటిని సరిదిద్దుకుందాం. భౌతిక పరిస్థితిలో (అబ్జెక్టివ్ కండిషన్), స్వీయాత్మక పరిస్థితిలో (సబ్జెక్టివ్ కండిషన్) విప్లవోద్యమ పురోగమనానికి అనుకూలంగా పెంపొందుతున్న అంశాలను గుర్తించి వాటి ఆధారంగా పార్టీని, పీ.ఎల్.జీ.ఏ.ను, ప్రజాసంఘాలను సంఘటితం చేసుకుందాం.

కగార్ యుద్ధ ప్రారంభం నుండి మనపార్టీ, పీ.ఎల్.జీ.ఏ. బలగాలు, స్థానిక రహస్య ప్రజా నిర్మాణాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి, దెబ్బతింటున్నాయి. దీనికి కారణం మౌలికంగా మన నిర్మాణాలు, బలగాలు పాటించాల్సిన రహస్య పనివిధానాన్ని, గెరిల్లాయుద్ధ నియమాలను అమలు చేయకపోవడంతో పాటు కేంద్రకమిటీ రూపొందించిన రాజకీయ, సైనిక ఎత్తుగడలను సరిగా అమలు చేయకపోవడంలో ఉంది. మన కేంద్రకమిటీ, పొలిట్ బ్యూరోలు రూపొందించిన ఎత్తుగడల ప్రకారం మన బలగాలు చిన్న ప్రాంతాలకు పరిమితం కాకుండా, విశాల ప్రాంతాల్లో పనిచేయాలి: కేంద్రీకృతమయి కాకుండా వికేంద్రీకృత బలగాలుగా, చిన్న ఫార్మేషన్లుగా మారి పనిచేయాలి. చట్టబద్ధ-చట్టవ్యతిరేక, బహిరంగ రహస్య పోరాట, నిర్మాణ రూపాల్ని సమన్వయించి వర్గపోరాటాన్ని నడపాలి. పట్టణ, మైదాన, అటవీ ప్రాంతాల్లో కార్మిక, రైతాంగ, మధ్యతరగతి (పెటిబూర్జువా), జాతీయ పెట్టుబడిదారీ వర్గాలను, పీడిత సామాజిక సెక్షన్లను, పీడిత జాతులను విప్లవోద్యమంలో సమీకరించాలి. ఈ ఎత్తుగడలను మనం సరిగా అమలు చేయని ఫలితంగా పార్టీ, పీ.ఎల్.జీ.ఏ. బలగాలు, నాయకత్వ శక్తులు తీవ్రంగా నష్టపోయాయి, నష్టపోతున్నాయి. అలాగే 'కగార్' యుద్ధానికి ప్రధాన కేంద్రీకరణగా ఉన్న దండకారణ్య ప్రాంతం నుండి పీ.ఎల్.జీ.ఏ. బలగాలను ఇతర ప్రాంతాలకు రిడిప్లాయ్ చేయకపోవడంతో మన బలగాలు తీవ్రంగా నష్టపోయాయి. గత 22 నెలలుగా మన ఆచరణలో జరిగిన తప్పులను గుర్తించి వాటిని సరిదిద్దుకోవడం ద్వారా మన కేంద్రకమిటీ, పొలిట్ బ్యూరోలు రూపొందించిన ఎత్తుగడలను సరిగా అమలు చేయడం ద్వారా పార్టీని, పీ.ఎల్.జీ.ఏ.ను, ప్రజాసంఘాలను, విప్లవోద్యమాన్ని కాపాడుకుందాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కగార్ యుద్ధంలో విప్లవోద్యమానికి తీవ్రమైన నష్టాలను కలిగిస్తున్నప్పటికీ మనపార్టీ నాయకత్వంలో పీ.ఎల్.జీ.ఏ. బలగాలు, విప్లవ ప్రజలు చేస్తున్న ఆత్మరక్షణ యుద్ధంలో, ప్రతిఘటనలో శత్రుసాయుధ బలగాలు కూడా గణనీయంగా నష్టపోతున్నాయి. ఈ నష్టాల్ని ప్రకటిస్తే విప్లవ శిబిరం మోరల్ పెరుగుతుందనే దానితో శత్రువు వీటిని ప్రకటించడం లేదు. ఇది మానసిక యుద్ధంలో భాగం. ఈ మానసిక యుద్ధపు ప్రభావానికి విప్లవ శిబిరం గురికాకూడదు. గత సంవత్సర కాలంలో, దండకారణ్యం, బిహార్-ఝార?ండ్, తూర్పుబిహార్-ఈశాన్య ఝార?ండ్, ఒడిశా, ఎంఎంసీల్లో కేంద్ర, రాష్ట్ర సాయుధ బలగాలకు, వివిధ రకాల కమాండో బలగాలకు చెందిన 116 మంది పోలీసులు నిర్మూలించబడి, 208 మంది గాయపడ్డారు. కొంతమంది గోపనీయ సైనికులను, పోలీసు ఇన్ఫార్మర్లను, బీజేపీకి చెందిన ప్రజా శత్రువులైన రాజకీయ శక్తులను పీ.ఎల్.జీ.ఏ. బలగాలు నిర్మూలించాయి. రోడ్డు నిర్మాణ పనుల్లో వున్న కొన్ని వాహనాలను, కొన్ని మొబైల్ టవర్లను పీ.ఎల్.జీ.ఏ. బలగాలు కాల్చివేసాయి. దేశవ్యాప్తంగా దాదాపు 72 ఎన్ సర్కిల్ మెంట్ దాడుల్లో, ఎన్ కౌంటర్లలో పోలీసు, పారామిలిటరీ (కేంద్ర సాయుధ పోలీసు బలగాలు), కమాండో, భారత సైనిక బలగాలను పీ.ఎల్.జీ.ఏ. బలగాలు ప్రతిఘటించాయి. గత సంవత్సర కాలంలో 'కగార్' యుద్ధాన్ని విఫలం చేసేందుకు మన పీ.ఎల్.జీ.ఏ. బలగాలు ప్రధానంగా ఇంప్రొవైజ్డ్ ఎక్స్ ప్లోజివ్ డివైస్ (ఐఈడీ) లను అమర్చి శత్రు సాయుధ బలగాలను దెబ్బతీయడం, ఎన్ సర్కిల్ మెంట్ దాడులను, ఎన్ కౌంటర్లను సాహసోపేతంగా ప్రతిఘటించడం, ఆంబుష్ లు, పోలీసు ఇన్ఫార్మర్ల నిర్మూలన, ప్రజా శత్రువులైన బీజేపీ నాయకుల నిర్మూలన, స్నైక్ హోల్స్ అమర్చడం అనే ఎత్తుగడలను ఉపయోగించి గెరిల్లాయుద్ధాన్ని సాగించాయి. ఈ సంవత్సరం కూడా గెరిల్లాచర్యల విస్తృతి, తీవ్రత తగ్గింది. దాని ఫలితంగా పోలీసులను నిర్మూలించడం, గాయపరిచే చర్యలు తగ్గాయి. ఈ సంవత్సరం శత్రుసాయుధ బలగాల నుండి 5 ఆయుధాల్ని మాత్రమే పీ.ఎల్.జీ.ఏ. స్వాధీనం చేసుకోగలిగింది. మరోవైపు 'కగార్' యుద్ధంలో మనపార్టీ, పీ.ఎల్.జీ.ఏ. బలగాలు, ప్రజాసంఘాలు తీవ్రంగా నష్టపోయాయి. దీంతో దేశవ్యాప్తంగా విప్లవోద్యమం తీవ్రంగా నష్టపోయింది. దేశవ్యాప్త విప్లవోద్యమం తీవ్రంగా నష్టపోయినప్పటికీ దేశంలో పార్టీ యూనిట్లు వున్న ప్రతిచోటా వివిధ స్థాయిల్లో విప్లవ రాజకీయాలను ప్రజల్లోకి తీసుకెళ్లే రాజకీయ కృషి (ప్రచారం, ఆందోళన), ప్రజలను కలిపించి సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ (సీబీబీ), భూస్వామ్య వ్యతిరేక, కార్పొరేటీకరణ, సైనికీకరణ వ్యతిరేక పోరాటాలను కొనసాగిస్తుండడం, ప్రజలను వివిధ రకాల ప్రజా నిర్మాణాల్లో సంఘటితం చేయడం, ప్రజలపై, ప్రజా మిలిషియాపై ఆధారపడి పార్టీ, పీ.ఎల్.జీ.ఏ. చిన్న, వికేంద్రీకృత చర్యల రూపంలో ఆత్మరక్షణ గెరిల్లాయుద్ధాన్ని కొనసాగిస్తుండడం, కగార్ (అంతిమ యుద్ధం) పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విప్లవోద్యమ ప్రాంతాల్లో 8,50,000 పోలీసు, కేంద్ర సాయుధ పోలీసు బలగాలను, కమాండో బలగాలను, భారతసైన్యాన్ని, వాయుసైన్యాన్ని మోహరించి చుట్టివేత-నిర్మూలన దాడులు చేస్తున్నప్పటికీ ఆ దాడులను అత్యంత ధైర్యసాహసాలతో ప్రతిఘటించడం, చుట్టివేతలను గండికొట్టి బయటపడడం, ఛత్తీస్ గఢ్, మహారాష్ట్ర, ఒడిశా, తెలంగాణ, ఝార?ండ్ రాష్ట్రాల్లోని అన్నిరకాల సాయుధ బలగాలను, కేంద్ర సాయుధ బలగాలను, కమాండో బలగాలను, భారత సైన్యాన్ని, వాయు సైన్యాన్ని కలుపుకుని 50 వేలకు మించిన సంఖ్యలో సాయుధ బలగాలను మోహరించి అమెరికా, ఇజ్రాయిల్ సైనిక అధికారులు, టెక్నీషియన్ల భాగస్వామ్యంతో సాగిన కర్రిగుట్ట అభియాన్ ను విఫలం చేయడం, గత 3 సంవత్సరాలుగా ఝార?ండ్ లోని పశ్చిమ సింగ్ భూమ్ జిల్లాలో కేంద్రీకరించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దాడులు చేస్తున్నప్పటికీ వాటిని ప్రతిఘటిస్తూ శత్రు సాయుధ బలగాలకు గణనీయమైన సంఖ్యలో నష్టాలు కలిగించడం వగైరాలు మన సకారాత్మక అంశాలు. ఈ సకారాత్మక అంశాలను సంఘటితం చేసుకుంటూ తాత్కాలిక వెనకంజ నుండి విప్లవోద్యమాన్ని పురోగమింపచేద్దాం. విప్లవ ప్రతిఘాతక 'కగార్' యుద్ధం నుండి పార్టీని, పీ.ఎల్.జీ.ఏ.ను, ప్రజాసంఘాలను, విప్లవోద్యమాన్ని కాపాడుకోవడం కోసం ఎదుర్కొంటున్న రాజకీయ, నిర్మాణ, సైనిక కర్తవ్యాల సాధన కోసం కృషి చేద్దాం :

**స్వీయాత్మక బలగాల రక్షణకు ప్రాధాన్యతనిస్తూ, నష్టాల్ని నివారించుకోవాలి....** గత సంవత్సర కాలంలో దేశవ్యాప్తంగా పార్టీ, పీ.ఎల్.జీ.ఏ., ప్రజాసంఘాలకు చెందిన 320 మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. మన పార్టీ వ్యవస్థాపక నాయకుల్లో ఒకరైన కామ్రేడ్ చారుమజుందార్ అమరుడైన 53 ఏళ్ల తర్వాత మన పార్టీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ బసవరాజు అమరుడు కావడం మనపార్టీకి, విప్లవోద్యమానికి తీవ్రమైన నష్టం. ఈ సంవత్సర కాలంలో కొందరు కేంద్రకమిటీ సభ్యులు, 15 మంది రాష్ట్రకమిటీ సభ్యులు అమరులు కావడంతో మన కేంద్ర, రాష్ట్ర కమిటీలు తీవ్రంగా నష్టపోయాయి. ఈ నష్టాలు విప్లవోద్యమంపై దీర్ఘకాలం పాటు ప్రభావితం చేస్తాయి. ఈ నాయకత్వ నష్టాలతో పాటు పార్టీ, పీ.ఎల్.జీ.ఏ. బలగాలు, ప్రజాసంఘాల నాయకులు-కార్యకర్తలు, విప్లవ ప్రజలు పెద్దసంఖ్యలో అమరులయ్యారు. దీంతో పార్టీ, పీ.ఎల్.జీ.ఏ., ప్రజాసంఘాలు, విప్లవోద్యమం తీవ్రంగా నష్టపోయాయి /నష్టపోయింది. ఈ స్థితిలో కేంద్రకమిటీ, పొలిట్ బ్యూరో రూపొందించిన రాజకీయ, సైనిక ఎత్తుగడలను సరిగా అమలు చేస్తూ, ఆచరిస్తూ ఈ నష్టాలను నివారించుకోవాలి. ఈ నష్టాల నివారణ ద్వారా పార్టీని, పీ.ఎల్.జీ.ఏ.ను, ప్రజాసంఘాలను, విప్లవోద్యమాన్ని కాపాడుకుందాం, వాటిని పునర్నిర్మిద్దాం. మార్చి 31, 2026 తర్వాత కూడా విప్లవ ప్రతిఘాతక యుద్ధం కగార్ 'పేరుతోనో', మరో 'పేరుతోనో' కొనసాగుతుంది. కగార్ లక్ష్యం మావోయిస్టులను నిర్మూలించి, 'కార్పొరేట్ హిందూ దేశాన్ని' నిర్మించడం కాబట్టి. దేశంలో కార్పొరేటీకరణను, సైనికీకరణను, హిందుత్వను వ్యతిరేకించే వారందరిని మావోయిస్టులుగా, అర్బన్ మావోయిస్టులుగా ముద్రవేసి వారందరిని ఫాసిస్టు పద్ధతిలో అణిచివేయడం కోసం ఆర్ఎస్ఎస్-బీజేపీ వాటి అనుబంధ సంస్థలు, వాటి నాయకత్వంలో నడిచే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సన్నాహాలు చేస్తూనే వున్నాయి. ఈ విషయాన్ని గమనంలో వుంచుకుని స్వీయాత్మక శక్తులను రక్షించుకోవాలి. కార్పొరేటీకరణను, సైనికీకరణను, హిందుత్వను వ్యతిరేకించే వ్యక్తులను, శక్తులను, సంఘాలను, సంస్థలను, పార్టీలను కలుపుకుని సామాజిక జీవితానికి చెందిన సకల రంగాల్లో బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడడం ద్వారానే మన స్వీయాత్మక శక్తులను రక్షించుకోగలుగుతాం.

**సోను, సతీష్ విప్లవ ద్రోహుల ముఠా సృష్టించిన సంక్షోభాన్ని అధిగమించాలి....** విప్లవ ద్రోహులుగా, పార్టీ విచ్ఛిన్నకులుగా, విప్లవ ప్రతిఘాతకులుగా మారి అక్టోబర్ 14, 16 తేదీల్లో సోను, సతీష్ ల ముఠా శత్రువుకు లొంగిపోయి, పార్టీకి చెందిన 203 ఆయుధాలను శత్రువుకు అప్పగించింది. ఈ ముఠా ప్రభావంతో అక్టోబర్ చివర్లో దండకారణ్యంలోని ఉత్తర బస్తర్ లో 21 మంది 18 ఆయుధాల్ని శత్రువుకు అప్పగించి లొంగిపోయారు, ఒడిశా రాష్ట్రకమిటీ పరిధిలోని ధంతరి-గరియాబండ్-నువాపాద డివిజన్ లో నవంబర్ మొదటి వారంలో 7 గురు 6 ఆయుధాల్ని శత్రువుకు అప్పగించి లొంగిపోయారు. ఈ రకంగా అక్టోబర్-నవంబర్ నెలల్లో 299 మంది శత్రువుకు లొంగిపోయి 227 ఆయుధాల్ని శత్రువుకు అప్పగించారు. సోను, సతీష్ ల ముఠా మన రాజకీయ-సైనిక పంథాపై దాడిచేసి పార్టీ శ్రేణుల్లో ఆయుధాల్ని శత్రువుకు అప్పగించి పార్టీలో సంక్షోభాన్ని సృష్టించారు. దేశవ్యాప్తంగా నిజాయితీ కలిగిన విప్లవ శక్తులు, కగార్ యుద్ధానికి వెరవని శక్తులు సోను, సతీష్ ల ముఠా చేస్తున్న వాదనల్లోని బూటకత్వాన్ని, డొల్లతనాన్ని వెంటనే గ్రహించారు, వారిని విప్లవ ద్రోహులుగా గుర్తించారు. అయితే ఇప్పటికీ దేశవ్యాప్తంగా మనపార్టీలోని, పీ.ఎల్.జీ.ఏ.లోని కొంతమందిలో, విప్లవ శిబిరంలోని ఒక సెక్షన్ లో సోను, సతీష్ ల వాదనలతో గందరగోళానికి, నిరాశకు గురయిన స్థితి ఉంది. అందుకే సోను, సతీష్ ల వాదనల్లోని మోసాన్ని / బూటకాన్ని, డొల్లతనాన్ని బహిర్గతం చేసి వారిలోని నిరాశను తొలగించి వారిని మన రాజకీయ-మిలిటరీ పంథాపై దృఢంగా నిలబెట్టాలి. మనపార్టీ అనుసరిస్తున్న రాజకీయ-సైనిక పంథా తప్పు అని నిర్ధారించడానికి సోను, మనకు విప్లవ పార్టీ లేదు, 2007 నాటి కాంగ్రెస్ రూపొందించిన కేంద్ర కర్తవ్యం ఉద్యమ బలానికి మించిన అతివాద నిర్ణయం, చట్టబద్ధ పోరాటాలను తిరస్కరించడం వల్లే మనం ప్రధాన కారణాలను చెప్పాడు. 'పార్టీ అన్నపుడు పూర్తికాలం విప్లవకారులతో కూడిన అన్ని స్థాయిల పార్టీకమిటీలే' అనే విచిత్రమైన వాదనను ముందుకు తెచ్చి దేశవ్యాప్తంగా ఉన్న పార్ట్ టైమ్ పార్టీ సభ్యులతో కూడిన పార్టీని పార్టీ కాదని తిరస్కరించాడు. పూర్తికాలపు విప్లవకారులతో కూడిన పార్టీ కమిటీలు పార్టీని పార్టీ కాదని తిరస్కరించాడు. పూర్తికాలపు విప్లవకారులతో కూడిన పార్టీ కమిటీలు సాయుధంగా ఉంటూ పని చేస్తున్నందున వీటన్నింటిని పార్టీగా గుర్తించడానికి నిరాకరిస్తూ వాటిని సైన్యంగా చిత్రీకరించాడు. కార్పొరేట్ సెక్యూరిటీ రీత్యా ఏసీ, డీసీ / డీసీ సభ్యులు, పార్టీ సభ్యులు ఆయుధాలు లేకుండా సివిల్ లో ఉండి మాస్ వర్క్ చేస్తున్నప్పటికీ వాటిని/వారిని కూడా పార్టీగా గుర్తించడానికి నిరాకరించాడు. ఇవన్నీ వాస్తవాలకు భిన్నమైన తప్పుడు నిర్ధారణలే. ఆయన దృష్టిలో ఆయుధాలు పట్టుకోకుండా, గ్రామాల్లో, పట్టణాల్లో ప్రజల మధ్య ఉండే పార్టీ కమిటీలే పార్టీ. అంటే ఆయన వాదనల ప్రకారం విప్లవ పార్టీ అంటే గ్రామాల్లో, పట్టణాల్లో ప్రజల మధ్య పార్ట్ టైమ్ పార్టీ సభ్యులతో కూడిన పార్టీ వ్యవస్థే పార్టీ కాదు, సాయుధంగా పనిచేసే ఏరియా కమిటీ నుండి కేంద్రకమిటీ వరకున్న పార్టీ కమిటీలు పార్టీ కాదు. ఇవన్నీ విప్లవ పార్టీ నిర్మాణం, పనివిధానంపై తప్పుడు సైద్ధాంతిక వాదనలు, ఇవి కేవలం మితవాద, రివిజనిస్టు వాదనలే.

2007 నాటి కాంగ్రెస్ రూపొందించిన కేంద్ర కర్తవ్యం ఉద్యమ బలానికి మించిన అతివాద నిర్ణయం అనడం కూడా మితవాద అవకాశవాద, రివిజనిస్టు వాదనే. 2007 నాటికి దండకారణ్యంలో 27 ఏళ్ల పాటు వర్గపోరాటం సాగి ఆ ప్రాంతం గెరిల్లా జోన్ గా ఎదిగింది, బిహార్-ఝార?ండ్ లో 37 ఏళ్ల పాటు వర్గపోరాటం సాగి ఆ ప్రాంతం గెరిల్లా జోన్ గా ఎదిగింది. ఆ రెండు ప్రాంతాల్లో విప్లవోద్యమం విస్తృతమైన, పటిష్టమైన ప్రజాపునాది కలిగి ఉండేది. ఆ రెండు ప్రాంతాలతో పాటు దేశంలోని కొన్ని ప్రాంతాల్లో విప్లవోద్యమం ఎర్రప్రతిఘటనా స్థాయిలో ఉద్యమం, మరికొన్ని ప్రాంతాల్లో తాత్కాలిక వెనకంజ స్థితిలో ఉండేవి. వీటికి తోడుగా రెండు విప్లవ పార్టీల విలీనంతో మావోయిస్టు పార్టీ ఏర్పడిన స్థితిలో దేశవ్యాప్తంగా విప్లవ శిబిరంలో గొప్ప ఉత్సాహం, విశ్వాసం నెలకొన్న స్థితి ఉండింది. ఈ స్థితినంతటిని పరిగణనలోకి తీసుకుని, ఆనాటి అంతర్జాతీయ, దేశీయ రాజకీయ పరిస్థితులను గమనంలో వుంచుకుని దండకారణ్యం, బిహార్-ఝార?ండ్ ప్రాంతాలను విముక్తి ప్రాంతాలుగా అభివృద్ధి చేసే కేంద్ర కర్తవ్యాన్ని కాంగ్రెస్ రూపొందించింది. ఈ ప్రాంతాల్లో విముక్తి ప్రాంతాలు నిర్మించాలంటే ఎర్ర ప్రతిఘటనా స్థాయిలో ఉన్న ఉద్యమాలను సంఘటితం చేసుకుంటూ వాటిని గెరిల్లా జోన్లుగా అభివృద్ధి చేయాలని, తాత్కాలిక వెనకంజలో వున్న ఉద్యమాలను తిరిగి ముందంజలోకి తీసుకురావాలని, పట్టణోద్యమాన్ని అభివృద్ధి చేయాలని కాంగ్రెస్ తక్షణ కర్తవ్యాలను రూపొందించింది. ఈ కర్తవ్యాల సాధన కోసం పార్టీలో వున్న అన్యవర్గ ధోరణులను సరిదిద్దుకొని, మావోయిస్టు పంథాలోనే పనిచేయాలని కాంగ్రెస్ యావత్తు పార్టీకి నిర్దేశించింది. అయితే మన పార్టీలోని అన్యవర్గ ధోరణులను సరిదిద్దుకోవడానికి తీవ్రంగా కృషి చేయని ఫలితంగా: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాగించిన తీవ్రమైన దాడులతో 2012 నాటికి దేశవ్యాప్త విప్లవోద్యమం గడ్డుస్థితికి చేరింది. ఈ స్థితిలో ప్రజావిముక్తి గెరిల్లా సైన్యాన్ని రెగులర్ సైన్యంగా అభివృద్ధి చేసే కర్తవ్యాన్ని, గెరిల్లాయుద్ధాన్ని మొబైల్ యుద్ధంగా అభివృద్ధి చేసే కర్తవ్యాన్ని కేంద్రకమిటీ వాయిదా వేసి, నిర్ణయించి, కేంద్ర కర్తవ్యంలో మార్పు చేసింది. ఈ వాస్తవాన్ని పక్కనపెట్టి కాంగ్రెస్ నిర్దేశిత కేంద్ర కర్తవ్యం అతివాదమనడం అంటే ఉద్యమ బలాబలాలపై ఆధారపడి రాజ్యాధికార స్వాధీనం కోసం పోరాడకుండా కేవలం పాక్షిక పోరాటాలను, ఆర్థిక పోరాటాలను నడిపే స్థాయిలోనే విప్లవోద్యమాన్ని పరిమితం చేయాలనడం అవుతుంది. అంటే విప్లవోద్యమాన్ని ఆర్థికవాద, సంస్కరణవాదానికి బలి చేయడమే అవుతుంది, ఉద్యమాన్ని చట్టబద్ధ పరిధిలోనే నడపాలనే చట్టబద్ధ వాదమవుతుంది.

చట్టబద్ధ పోరాటాలను కాలదన్నుకున్నాం అనే వాదన కూడా అవాస్తవం, వాస్తవాల వక్రీకరణ.

2007 నాటికి ఉత్తర తెలంగాణ, ఆంధ్ర, ఏఓబీ ఉద్యమాలు తాత్కాలిక వెనకంజకు గురయిన స్థితిలో అక్కడ ఉద్యమ బలం తగ్గిన స్థితిని పరిగణనలోకి తీసుకుని ఆ ప్రాంతాల్లో పార్టీ అనేక చట్టబద్ధ-బహిరంగ పోరాటాలను నడిపింది. అందులో భాగంగా ప్రత్యేక తెలంగాణ రాజకీయ ఉద్యమాన్ని నడిపింది. తెలంగాణ, ఏఓబీలోని ఆదివాసీ ప్రాంతాల్లో 5వ షెడ్యూల్, పెసాచట్టం అమలు కోసం పోరాటాలు చేసింది. 2006 నుండి 2011 మధ్యకాలంలో పశ్చిమ బెంగాల్ లో చట్టబద్ధ, చట్టవ్యతిరేక పోరాటాలను సమన్వయించి సింగూర్, సందిగ్రామ్ పోరాటాలను సడిపాం.

ఇదే కాలంలో ఏఓబీలో భూమి సమస్యపై నారాయణపట్నా పోరాటాన్ని నడిపాం. 2008లో కేంద్ర ప్రభుత్వం నూతన అటవీ చట్టాన్ని రూపొందించినపుడు, విప్లవోద్యమం దెబ్బతిన్న ప్రాంతాల్లో, నూతనంగా విస్తరించిన ప్రాంతాల్లో, ఉద్యమం ప్రాథమిక స్థాయిలో ఉన్న ప్రాంతాల్లో ఆ చట్టంలోని ప్రజానుకూల అంశాల కోసం పోరాడాలనీ ఉద్యమం బలంగా ఉండి ప్రజారాజ్యాధికార సంస్థలు (జనతన సర్కార్లు) ఏర్పడ్డ చోట ప్రజారాజ్యాధికార సంస్థలే ఆదివాసుల భూములకు పట్టాలివ్వాలని కేంద్రకమిటీ నిర్ణయించింది. 2013లో సీ.ఆర్.బీ., దోపిడీ వర్గాల సంస్కరణల పట్ల పార్టీ వైఖరిని తెలుపుతూ ఒక పత్రాన్ని రూపొందించింది. అందులో ఉద్యమ బలాబలాల ఆధారంగా/ఉద్యమ బలాబలాల్లోని మార్పులను వెన్నంటి చట్టబద్ధ-చట్టవ్యతిరేక, రహస్య- ప్రాంతాల్లో విస్థాపనకు వ్యతిరేకంగా చట్టబద్ధ-బహిరంగ ప్రజా ఉద్యమాన్ని పార్టీ నడిపింది. ఈ వాస్తవాలను పక్కనబెట్టి దీకే విషయాన్ని ఏకైకం చేసి, దాన్ని కూడా వక్రీకరించి చట్టబద్ధ పోరాటాలను కాలదన్నుకున్నాం అనడం అంటే ఉద్యమాన్ని చట్టబద్ధ పోరాటాలకే పరిమితం చేయాలనే రివిజనిస్టు వాదనే. సోను ఈ మధ్యకాలంలో రాసిన రెండు వ్యాసాలను, సాయుధ పోరాట తాత్కాలిక విరమణ ప్రకటనను, ప్రజలకు విజ్ఞప్తిని, కాడర్లకు విజ్ఞప్తిని కలిపి చూస్తే, అందులో మన పార్టీ అనుసరిస్తున్న విప్లవ పంథాను తిరస్కరించడమే కాకుండా, సాయుధ పోరాటాన్నే తిరస్కరించడం ఉంది. ప్రత్యామ్నాయ పంథా ఏమీ లేదు. ఆయన పంథా లొంగుబాటు పంథా, ఆయన వాదనల మొత్తం సారాంశం చట్టబద్ధ పద్ధతుల్లో ప్రజా పోరాటాలు నడపడం, రహస్య పార్టీ లేదనే పేరుతో పార్టీని బహిరంగ పార్టీగా మార్చడం. ఇవి సైద్ధాంతికంగా రివిజనిజం. పార్టీ చెప్పిన దానిని తిరస్కరించి పార్టీకి చెందిన ఆయుధాల్ని శత్రువుకు అప్పగించి విప్లవ ప్రతిఘాతకుడిగా మారాడు. తన అనుచరులను కూడగట్టుకుని పార్టీని చీలదీసాడు. వీటన్నింటితో సతీష్ ఏకీభవించి ఆయన కూడా విప్లవ ద్రోహిగా, పార్టీ విచ్ఛిన్నకుడిగా, విప్లవ ప్రతిఘాతకుడిగా మారాడు. అందుకే సోను, సతీష్ లు లేవనెత్తిన వాదనల్లోని మోసాన్ని, డొల్లను యావత్తు విప్లవ శిబిరానికి అర్థం చేయించి, విప్లవ శిబిరంలో తలెత్తిన గందరగోళాన్ని తొలగించి స్పష్టతను కల్పించాలి. వారిలో నెలకొన్న నిరాశను తొలగించి ఆత్మవిశ్వాసాన్ని నింపాలి. సోను, సతీష్ లు ముందుకు తెచ్చిన వాదనల్లో నిజాయితీ ఏమాత్రం లేదు. వాళ్లిద్దరు కేవలం ప్రాణభీతితో తమ లొంగుబాటును సమర్థించుకోవడానికి చేసిన వాదనలే అవి. పార్టీ ప్రధాన కార్యదర్శే సాయుధ పోరాటాన్ని తాత్కాలికంగా విరమించాలన్నడనే అబద్ధాలాడి, సైద్ధాంతికంగా, రాజకీయంగా బలహీనంగా ఉన్న కాడర్లను మోసగించి వారిని శత్రువు ముందు లొంగిపోయేలా చేసారు. అందుకే వాళ్లిద్దరి మోసకారితనాన్ని విప్లవ శిబిరంలో బహిర్గతం చేయాలి. 3 సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ, భూస్వామ్య వర్గాల కూటమికి వ్యతిరేకంగా, బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు ఆర్ఎస్ఎస్-బీజేపీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా వర్గపోరాటాన్ని తీవ్రతరం చేయాలి. మన కేంద్రకమిటీ రూపొందించిన 'భారతదేశంలో ఉత్పత్తి సంబంధాల్లో మార్పులు-మన రాజకీయ కార్యక్రమం' (ఎంఓపీ డాక్యుమెంట్), 'భారతదేశంలో కులసమస్య-మన దృక్పథం', 'భారతదేశంలో జాతుల సమస్య-మన పార్టీ వైఖరి' డాక్యుమెంట్ల గైడెన్స్ లో పీడిత వర్గాలను (కార్మికులు, రైతాంగం, మధ్యతరగతి (పెటిబూర్జువా), జాతీయ పెట్టుబడిదార్లు), పీడిత సామాజిక సెక్షన్లను (మహిళలు, దళితులు, ఆదివాసులు, మత మైనారిటీలు), పీడిత జాతులను సమీకరించి వర్గ సమస్యలపై, సామాజిక సమస్యలపై, జాతుల సమస్యలపై వర్గపోరాటాన్ని నడపాలి. దేశంలోని అసమానాభివృద్ధిని అనుసరించి దేశాన్ని 7 కేటగిరీలుగా గుర్తించి ఆయా ప్రాంతాలకు వర్తించే రాజకీయ కార్యక్రమాన్ని ఎంఓపీ డాక్యుమెంట్ రూపొందించింది. ఆ రాజకీయ కార్యక్రమం ఆధారంగా మనం వర్గపోరాటాన్ని తీవ్రతరం చేయాలి. 2014లో కేంద్రంలో బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు ఆర్ఎస్ఎస్-బీజేపీలు అధికారంలోకి వచ్చిన తర్వాత అది రాజ్య ఫాసిజంగా మారింది. అప్పటినుండి దేశంలోని పీడిత వర్గాలపై, పీడిత సామాజిక సెక్షన్లపై, పీడిత జాతులపై ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాల్లో మొత్తంగా సామాజిక జీవితానికి చెందిన అన్నిరంగాల్లో దాడులు చేస్తూనే ఉంది. అందులో భాగంగానే మావోయిస్టులను నిర్మూలించి 'మావోయిస్టు రహిత' భారతాన్ని ఏర్పాటు చేస్తానంటోంది. దేశంలోని ఎన్ ఫోర్సుమెంట్ డైరెక్టరేట్ (ఈడీ), సీబీఐలను, ఎన్నికల సంఘాన్ని, న్యాయవ్యవస్థను అన్నింటిని బెదిరించి, లొంగదీసుకుని తమకు అనుకూలంగా మార్చుకుని పోరాడే ప్రజలపై, ప్రతిపక్షాలపై దాడులు చేయిస్తున్నది. అందులో భాగంగానే 'ప్రతిపక్ష రహిత' (విపక్ష్ ముక్త్) భారతాన్ని ఏర్పాటు చేస్తానంటోంది. అందుకే నేడు అది దేశానికి, దేశ ప్రజలకు ప్రధాన శత్రువుగా మారింది. ఈ స్థితిలో దేశవ్యాప్తంగా మనపార్టీ యూనిట్లు ఉన్న ప్రతిచోట దానికి వ్యతిరేకంగా కలిసివచ్చే వ్యక్తులను, శక్తులను, సంఘాలను, సంస్థలను, పార్టీలను కలుపుకుని, బూర్జువా పార్టీలను కూడా ఎత్తుగడలపరమైన మిత్రులుగా కలుపుకుని ఐక్యకార్యాచరణ కార్యక్రమాలు-ఐక్య కార్యాచరణ వేదికలు ఏర్పాటు చేసుకుని వర్గపోరాటాన్ని తీవ్రతరం చేయాలి. అలాగే, బ్రాహ్మణీయ హిందుత్వ పాసిసు ఆర్ఎస్ఎస్ -బీజేపీ కేంద్ర. రాష్ట్ర ప్రభుత్వాలు 2047 నాటికి దేశాన్ని అభివృది చెందిన ఫాసిస్టు ఆర్ఎస్ఎస్-బీజేపీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2047 నాటికి దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా (వికసిత్ భారత్) చేస్తామనే ప్రచార హోరులోని బూటకాన్ని, మోసాన్ని నిరంతరం సరైన ఆధారాలతో ఎండగట్టాలి. ఈ సంవత్సరం ఏప్రిల్ లో జమ్మూ-కశ్మీర్ లో పహల్గావ్ వద్ద జరిగిన ఉగ్రవాద దాడిని సాకుగా చూపెట్టి భారతదేశం పాకిస్తాన్ పై 'ఆపరేషన్ సింధూర్' పేరుతో మిలిటరీ ఆపరేషన్స్ చేసింది. పాకిస్తాన్ తో నయినా సరిహద్దుల్లో ఉన్న ఏ దేశంతోనయినా సరిహద్దు వివాదంతో సహ ఏ సమస్యనయినా శాంతియుత పద్ధతుల్లో, చర్చల ద్వారా, దౌత్యం ద్వారా పరిష్కరించుకోవాలి. దానికి భిన్నంగా మిలిటరీ ఆపరేషన్స్ ద్వారా, యుద్ధం ద్వారా సమస్య పరిష్కారానికి పూనుకోవడం సరైంది కాదు. ఈ పద్ధతికి భిన్నంగా పాకిస్తాన్ పై మిలిటరీ ఆపరేషన్స్ చేపట్టింది. అయితే, అమెరికా ఆదేశాలతో నాలుగు రోజులకే ఆ ఆపరేషన్స్ ను ఆపివేసి తన లొంగుబాటును ప్రదర్శించుకుంది. ఒకవైపు అమెరికా పట్ల లొంగుబాటును ప్రదర్శిస్తూనే గత 7 నెలలుగా భారతదేశ ప్రజల్లో జాతీయ దురహంకారాన్ని, యుద్ధోన్మాదాన్ని రెచ్చగొడుతూనే ఉంది. గత 11 సంవత్సరాలుగా బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉంటూ దేశంలో పేదరికాన్ని, నిరుద్యోగాన్ని, అధిక ధరలను, రైతాంగపు ఆత్మహత్యల్ని వగైరా దేశం ఎదుర్కొంటున్న ఏ ఒక్క సమస్యల్ని పరిష్కరించలేక విఫలమవుతూనే ఈ సమస్యలపై పోరాడే ప్రజానీకాన్ని పక్కతోవ పట్టించేందుకు నిరంతరం హిందూ మతోన్మాదాన్ని, యుద్ధోన్మాదాన్ని ఎగదోస్తూనే ఉంది. బీజేపీకి, మోదీకి ఆశ్రితుడైన అదానికి దేశ సంపదలను అప్పనంగా అప్పజెప్తూనే వుంది. అదానీ అమెరికాలో వ్యాపార అక్రమాలకు పాల్పడినందుకు ఆయనను కాపాడేందుకు దేశ ప్రయోజనాలను అమెరికాకు తాకట్టు పెడుతోంది. దేశ కార్పొరేట్ల ప్రయోజనాల కోసం ఇజ్రాయిల్ తో, ఆఫ్గనిస్తాన్ తో అనేక ఒప్పందాలను కుదుర్చుకుంటోంది. గత 11 సంవత్సరాల బీజేపీ మనువాద పాలనలో దళితులపై, ఆదివాసులపై దాడులు పెరగడమే కాకుండా దళిత, బహుజన ఉన్నతాధికారులపై (ఐఏఎస్, ఐపీఎస్ తదితర) కూడా మనువాద అధికారుల పీడన, అవమానాలు పెరిగిపోయాయి. గత 11 సంవత్సరాల్లో వ్యవసాయిక, పారిశ్రామిక, సేవా రంగాల్లో దేశ, విదేశీ కార్పొరేట్ల దోపిడీ, పీడనలు విపరీతంగా పెరిగిపోయాయి. వీటన్నింటి ఫలితంగా దేశంలోని విశాల ప్రజానీకం తరతమ స్థాయిలో పోరాటాలు చేస్తూనే వున్నారు. ఈ స్థితిలో, మనువాద ఆర్ఎస్ఎస్-బీజేపీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశ ప్రజలకు వ్యతిరేకంగా అనుసరిస్తున్న, ఆచరిస్తున్న అన్ని ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక విధానాలకు వ్యతిరేకంగా, కార్పొరేట్ల దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా ప్రచార, ఆందోళన, పోరాట కార్యక్రమాల్ని చేపట్టి ప్రజా పునాదిని పెంచుకోవాలి. దేశవ్యాప్తంగా వర్గపోరాటాన్ని తీవ్రతరం చేస్తూ ప్రజాపునాదిని పెంచుకుంటూ దాని ఆధారంగా గెరిల్లాయుద్ధాన్ని కొనసాగిద్దాం.

**డియర్ కామ్రేడ్స్, ప్రజలారా!**

1973 నుండి మొదలైన సామ్రాజ్యవాద సాధారణ సంక్షోభపు పరిష్కారం కోసం సామ్రాజ్యవాదం ముందుకు తెచ్చిన సామ్రాజ్యవాద ప్రపంచీకరణ 2008 నాటికి ప్రపంచ ఆర్థిక సంక్షోభంతో విఫలమైందిగా తేలిపోయింది. ఈ సంక్షోభం ఇప్పటికీ పరిష్కరించబడలేదు. దాని పరిష్కారం కోసం పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద దేశాలు, వెనకబడిన దేశాలు అనుసరించిన /అనుసరిస్తున్న ఆర్థిక, రాజకీయ, సైనిక, సాంకేతిక విధానాలన్ని ఘోరంగా విఫలమయ్యాయి/విఫలమవుతున్నాయి. సామ్రాజ్యవాద ప్రపంచీకరణను వెన్నంటి ఆ విధానాల అమలుకోసం ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లో మితవాద (రైట్ వింగ్), రేసిస్టు (జాత్యాహంకార), ఫాసిస్టు పార్టీలు అధికారంలోకి వచ్చాయి. ఈ మితవాద, జాత్యాహంకార, ఫాసిస్టు పార్టీలు తమ తమ దేశాల్లో బూర్జువా ప్రజాస్వామిక హక్కులను సైతం కాలరాచి నియంతృత్వాన్ని, ఫాసిజాన్ని అమలు చేస్తున్నాయి. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల అమల్లో భాగంగా ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల్లో సామ్రాజ్యవాద ద్రవ్య పెట్టుబడి దాడి తీవ్రంగా సాగినప్పటికీ, దాని దాడి పెట్టుబడిదారీ-సామ్రాజ్యవాద దేశాల్లోని కార్మికవర్గంపై, మధ్యతరగతిపై కూడా కొనసాగుతూనే ఉంది. ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల్లో సామ్రాజ్యవాద ద్రవ్యపెట్టుబడి దళారీలుగా అక్కడి దళారీ నిరంకుశ బూర్జువా వర్గం, భూస్వామ్య వర్గం వ్యవహరిస్తూ ఈ మూడింటి కూటమి ఆయా దేశాల ప్రజలపై దోపిడీ, పీడనలను తీవ్రతరం చేసాయి. వీటికి వ్యతిరేకంగా ఆయా దేశాల్లో ప్రజాపోరాటాలు తరతమ మోతాదుల్లో కొనసాగుతూనే ఉన్నాయి. 2012-13 మధ్యకాలంలో ఆఫ్రికా దేశాల్లో 'గులాబి విప్లవాలు' చెలరేగిన వాటితో దోపిడీ వ్యవస్థలో మార్పు రాలేదు. గత 3-4 సంవత్సరాల్లో ఈ మధ్యకాలంలో శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్, ఫిలిప్పీన్స్, పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్ లోని ప్రజా తిరుగుబాట్లకు తక్షణ కారణాలుగా పైకి కనపడే కారణాలు కొన్ని వున్నప్పటికీ వీటి వెనక సామ్రాజ్యవాద ప్రపంచీకరణ, ఆయా దేశాల్లోని దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ (కార్పొరేట్ కంపెనీల), భూస్వామ్య వర్గాల దోపిడీ, పీడనల తీవ్రతే ప్రధాన కారణం. ఈ మధ్యకాలంలో పశ్చిమ యూరప్ దేశాల్లో కూడా కార్మికులు, మధ్యతరగతి ద్రవ్యపెట్టుబడి దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నారు. అమెరికాలోని న్యూయార్క్ నగర మేయర్ గా డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి జోహ్రాన్ మన్దనీ గెలవడం మితవాద, రేసిస్టు, ఫాసిస్టు ట్రంప్ పరిపాలన పట్ల ఆ నగర ప్రజల్లోని కార్మికుల, మధ్యతరగతి ఉద్యోగుల, వలస ప్రజల (ఇమ్మిగ్రెంట్స్) వ్యతిరేకత కారణం. అలాగే గత 2-3 సంవత్సరాల్లో యూరప్ తదితర దేశాల్లో మితవాద, రేసిస్టు, ఫాసిస్టు పార్టీల స్థానంలో సోషల్ డెమోక్రటిక్ పార్టీలు, డెమోక్రటిక్ పార్టీల అభ్యర్థులు గెలుపొందడానికి కూడా సామ్రాజ్యవాద ప్రపంచీకరణ పట్ల, మితవాద, ఫాసిస్టు శక్తుల పట్ల పెరుగుతున్న వ్యతిరేకతే కారణం. రానున్న రోజుల్లో ఇది మరింత తీవ్రతరం కానుంది. ఈ స్థితిని ఉపయోగించుకుని ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టు విప్లవకారులు తమ దేశాల్లో విప్లవ పార్టీగా సంఘటితం కావాలి, చిన్న పార్టీని పెద్ద పార్టీగా అభివృద్ధి చేసుకోవాలి, బలహీనంగా ఉన్న పార్టీని బలోపేతం చేసుకోవాలి. గత సంవత్సర కాలంగా అమెరికా-చైనాల మధ్య కొనసాగుతున్న సుంకాల పోటీ (టారిఫ్ వార్) ఈ మధ్య నవంబర్ మొదటి వారంలో దక్షిణ కొరియాలోని బూసాన్ లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్, చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ లు సమావేశమయి తాత్కాలిక సంధి కుదుర్చుకోవడంతో తాత్కాలికంగా విరమించబడింది. రెండు దేశాలు వాణిజ్య సుంకాలకు ఏడాది కాలం పాటు విరామం ప్రకటించాయి. చైనా దిగుమతులపై విధించిన సుంకాల్లో 10 శాతం తగ్గించాలని అమెరికా నిర్ణయించింది. అలాగే అరుదైన ఖనిజాల (రేర్ ఎర్త్ మినరల్స్) ఎగుమతులపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయాలని చైనా నిర్ణయం తీసుకుంది. ఆర్థిక మాంద్యంతో సతమతమవుతున్న అమెరికా, చైనాలు ఈ నిర్ణయం తీసుకోక తప్పని స్థితి నెలకొంది. ఈ తాత్కాలిక ఒప్పందంతో అమెరికా, చైనాల మధ్యనున్న పోరు ఆగేది కాదు. ఇరుదేశాలు ప్రపంచాధిపత్యం కోసం పోటీపడుతున్నాయి. ఈ పోటీని అనుసరించి రానున్న రోజుల్లో అమెరికా-చైనాల మధ్య అన్నిరంగాల్లో ఘర్షణలు తలెత్తడం అనివార్యం. పెట్టుబడిదారీ విధానం ఉనికిలోకి వచ్చినప్పటి నుండి ముఖ్యంగా అది సామ్రాజ్యవాదంగా మారినప్పటినుండి అది పర్యావరణ వినాశకారిగా మారింది. దీంతో నేడు మానవ మనుగడే కాకుండా భూగోళపు మనుగడే ప్రమాదంలో పడింది. ఈ స్థితిలో ఐక్యరాజ్యసమితి ఏర్పాటు చేసిన పర్యావరణ పరిరక్షణ శిఖరాగ్ర సమావేశాల ద్వారా జరిగేది ఏమిలేదని తేలిపోయింది. పెట్టుబడిదారీ-సామ్రాజ్యవాద వ్యవస్థను నిర్మూలించే లక్ష్యంతో పర్యావరణ పరిరక్షణ ఉద్యమాలు సాగినపుడే పర్యావరణాన్ని, భూమండలాన్ని, మానవ మనుగడను కాపాడుకోవచ్చు. ఆ దిశగా ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టు విప్లవకారులే పర్యావరణ పరిరక్షణ ఉద్యమాల్ని నడపాలి. అమెరికా ప్రపంచ దేశాలపై విధిస్తున్న సుంకాల్లో భాగంగా భారతదేశంపై ఆగస్టులో 25 శాతం సుంకాల్ని విధించింది. రష్యా నుండి చమురు కొనుగోలు చేస్తున్నారనే పేరుతో ఆ సుంకాలను 25 శాతం పెంచడంతో అవి 50 శాతానికి చేరాయి. దీంతో భారత ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా ప్రభావితమవుతోంది. ఈ స్థితిలో అమెరికాను సంతృప్తి పర్చడానికి భారతదేశం రష్యా నుండి చమురు కొనుగోలును చాలావరకు తగ్గించింది. అమెరికా నుండి మనదేశం దిగుమతి చేసుకునే పత్తిపై ఉన్న 11 శాతం సుంకం మినహాయింపును డిసెంబర్ 31 వరకు పొడిగించింది. రానున్న రోజుల్లో ఈ సుంకాన్ని ఎత్తివేయాలని యోచిస్తోంది. ఇది అమెరికా ఎదుట భారతదేశపు లొంగుబాటే. ఈ స్థితిలో, చర్చల్లో ఉన్న భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం భారత ప్రజలకు వ్యతిరేకంగానే తయారవుతుంది. కాబట్టి భారత ప్రజలందరూ ముఖ్యంగా రైతాంగం, పాల ఉత్పత్తిదార్లు, మత్స్యకారులు భారత ప్రభుత్వపు లొంగుబాటుకు వ్యతిరేకంగా పోరాడాలి. ఆత్మ నిర్భరత (స్వావలంబన) పేరుతో ప్రధాని మోదీ వల్లించే మాటలు వట్టి బూటకాలని అర్థం చేసుకోవాలి. సామ్రాజ్యవాద దేశాలతో చేసుకున్న అన్నిరకాల అసమాన ఆర్థిక, వ్యాపార, వాణిజ్య ఒప్పందాలను రద్దు చేసుకున్నపుడే స్వావలంబన సాధ్యమవుతుంది. అది జాతీయ ప్రజాస్వామిక విప్లవం ద్వారానే సాధ్యమవుతుంది. మనదేశ సార్వభౌమత్వాన్ని, స్వతంత్రతను సాధించుకున్నపుడే స్వావలంబన సాధ్యమవుతుంది. ఈ పనిని దోపిడీ వర్గ రాజకీయ పార్టీలు సాధించలేవు. అందుకే మావోయిస్టు పార్టీ నాయకత్వంలో జరుగుతున్న విప్లవోద్యమాన్ని విజయవంతం చేయడమే మార్గం. ఎన్నికల సంఘాన్ని తమ జేబు సంస్థగా మార్చుకుని బీజేపీ పార్టీ ఓట్ల దొంగతనానికి, అనేక అక్రమాలకు పాల్పడుతూ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో గెలుస్తూ వస్తోంది. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో కూడా అనేక అక్రమాలకు, ఓట్ల దొంగతనానికి పాల్పడి గెలిచింది. ఈ స్థితిలో నేటి పార్లమెంటరీ వ్యవస్థ ఎంత బూటకమో మరోసారి తేలిపోయింది. ఈ స్థితిలో నిజమైన ప్రజాస్వామిక వ్యవస్థను నిర్మించుకోవడమంటే నూతన ప్రజాస్వామిక వ్యవస్థను నిర్మించుకోవడమే. అందుకోసం దేశంలోని విశాల ప్రజానీకం సంఘటితమయి, సాయుధమయి ఈ దోపిడి వ్యవస్థను కూలదోయాలి.

**ప్రియమైన కామ్రేడ్స్, ప్రజలారా!..** ప్రస్తుతం విప్లవోద్యమం తీవ్రంగా నష్టపోయిన స్థితిలో గతంలాగా మనం పీ.ఎల్.జీ.ఏ. వార్షికోత్సవాలను జరుపుకోలేం. కాబట్టి ఉద్యమ ప్రాంతాల్లో పార్టీ, పీ.ఎల్.జీ.ఏ. బలగాల రక్షణకు ప్రాధాన్యతనిస్తూనే ఈ వార్షికోత్సవాలను జరుపుకోవాలి. దేశవ్యాప్తంగా అటవీ, మైదాన, పట్టణ ప్రాంతాల్లో అన్నిచోట్ల గ్రూపు మీటింగులు, చిన్న చిన్న మీటింగుల రూపంలో, రహస్య పద్ధతుల్లో ఈ వార్షికోత్సవాలను జరుపుకోవాలి. ఉద్యమ ప్రాంతాలంతటా పోస్టర్లు వేసి, కరపత్రాలు పంచి ప్రజల్లో పీ.ఎల్.జీ.ఏ.ను బలోపేతం చేసుకోవాల్సిన అవసరాన్ని గుర్తింపచేయాలి. తగిన అర్హతలున్న వారిని పీ.ఎల్.జీ.ఏ. లోకి భర్తీ చేసుకోవాలి.

విప్లవ ప్రతిఘాతక 'కగార్' యుద్ధం నుండి పార్టీని, పీ.ఎల్.జీ.ఏ.ను, ప్రజాసంఘాలను, విప్లవోద్యమాన్ని కాపాడుకుందాం.

సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ (విదేశీ, దేశీయ కార్పొరేట్ కంపెనీలు), భూస్వామ్య వర్గాల కూటమికి వ్యతిరేకంగా వర్గపోరాటాన్ని తీవ్రతరం చేద్దాం.

బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు ఆర్ఎస్ఎస్-బీజేపీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ప్రజా పోరాటాలను తీవ్రతరం చేద్దాం.

నష్టాలను నివారించుకుందాం. లొంగుబాట్లను, విప్లవ ద్రోహాన్ని వ్యతిరేకిద్దాం. పీడిత ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు దృఢంగా పోరాడుదాం.

మార్క్సిజం-లెనినిజం-మావోయిజం వర్ధిల్లాలి.

భారత నూతన ప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలి.

ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం (పీ.ఎల్.జీ.ఏ.) వర్ధిల్లాలి.

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) వర్ధిల్లాలి.

విప్లవాభినందనలతో, సెంట్రల్ మిలిటరీ కమిషన్

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు).**

చురకలు

# సంపాదకీయం

## ఆ దేశ నోట్లపై భారత భూభాగ చిహ్నాలు.. రెచ్చగొట్టేందుకేనా?

భారత్, నేపాల్ మధ్య స్నేహ సంబంధాలు ఉన్నప్పటికీ, సరిహద్దు గొడవలు అప్పుడప్పుడు రాజుకుంటూనే ఉంటాయి. ఇన్నాళ్లు కేవలం మాటల యుద్ధంగా, రాజకీయ మ్యాపులకే పరిమితమైన ఈ వివాదం ఇప్పుడు ప్రజల జేబుల్లోకి కూడా వచ్చేసింది. నేపాల్ తీసుకున్న తాజా నిర్ణయం రెండు దేశాల మధ్య దౌత్యపరమైన వేడిని పెంచేలా ఉంది. ఒక చిన్న కాగితం ముక్క ఇప్పుడు పెద్ద చర్చకు దారితీసింది. సాధారణంగా ఏ దేశమైనా తమ కరెన్సీ నోట్ల మీద వారి దేశ గొప్పతనాన్ని లేదా చిహ్నాలను ముద్రిస్తుంది. కానీ నేపాల్ మాత్రం ఒక అడుగు ముందుకేసి, ఇండియాకు చెందిన ప్రాంతాలను తమవిగా చూపిస్తూ కొత్త కరెన్సీని రిలీజ్ చేసింది. ఇది పక్కాగా ఇండియాను ఇరిటేట్ చేసే చర్యే అని విశ్లేషకులు భావిస్తున్నారు. ఆ నోటు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

**కొత్త రూ. 100 నోట్లపై భారత చిహ్నాలు..** అసలు విషయానికి వస్తే.. నేపాల్ ప్రభుత్వం కొత్తగా 100 రూపాయల నోట్లను విడుదల చేసింది. ఇందులో ముద్రించిన నేపాల్ మ్యాప్ లో భారత భూభాగాలైన కాలాపానీ, లిపులేఖ్, లింపియాధురా ప్రాంతాలను తమ దేశంలో భాగంగా చూపించింది. నేపాల్ రాష్ట్ర బ్యాంక్ (NRB) ఈ కొత్త నోట్లను చలామణిలోకి తెచ్చింది. ఇందులో మాజీ గవర్నర్ మహా ప్రసాద్ అధికారి సంతకం, జారీ చేసిన తేదీ కూడా ఉంది. ఈ వివాదం ఈనాటిది కాదు. 2020, మే నెలలో కేపీ శర్మ ఓలి ప్రభుత్వం ఉన్నప్పుడే ఈ మూడు ప్రాంతాలను కలుపుకొని కొత్త రాజకీయ మ్యాప్ ఆమోదించింది. ఇప్పుడు దాన్ని అధికారికంగా కరెన్సీపై ముద్రించింది. విచిత్రం ఏంటంటే.. రూ. 10, 50, 500 వంటి నోట్లు ఉన్నా, కేవలం రూ. 100 నోటు మీద మాత్రమే నేపాల్ మ్యాప్ ఉంటుంది. అందుకే ఈ మార్పు ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తోంది.

**నేపాల్ నిర్ణయంపై భారత్ ఆగ్రహం..** దీనిపై భారత్ తీవ్రంగా స్పందించింది. నేపాల్ ఏకపక్షంగా తీసుకున్న ఈ నిర్ణయం వాస్తవాలను మార్చలేదని భారత విదేశాంగ మంత్రి జైశంకర్ గతంలోనే చెప్పారు. నోటు మీద మ్యాప్ మార్చినంత మాత్రాన, గ్రౌండ్ లెవల్ లో ఇండియా భూభాగం నేపాల్ ది అయిపోదు కదా అని భారత్ గట్టి కౌంటర్ ఇచ్చింది. సరిహద్దు చర్చలు జరుగుతుండగా ఇలాంటి పనులు చేయడం సరికాదని భారత్ వాదన. సిక్కిం, బెంగాల్, బిహార్, యూపీ, ఉత్తరాఖండ్ రాష్ట్రాలతో కలుపుకొని దాదాపు 1,850 కిలోమీటర్ల మేర భారత్ నేపాల్ సరిహద్దు ఉంది. ఇలాంటి సున్నితమైన సమయంలో నేపాల్ చేసిన ఈ 'కరెన్సీ రాజకీయం' భవిష్యత్తులో రెండు దేశాల బంధంపై ఎలాంటి ప్రభావం చూపుతుందో చూడాలి. ప్రస్తుతానికి అయితే ఆ కొత్త నోటు సరిహద్దుల్లో కొత్త చిచ్చు రేపేలా ఉంది.

**నేపాల్ అంతర్గత రాజకీయాల్లో సంచలనం...** ఈ చర్య నేపాల్ అంతర్గత రాజకీయాల్లో కూడా ఒక పెద్ద సంచలనం రేపింది. కొందరు అక్కడి నాయకులు దేశీయ జాతీయతను రెచ్చగొట్టేందుకు ఈ నోటు విడుదలను ఉపయోగించుకుంటున్నారని విశ్లేషకుల అభిప్రాయం. సరిహద్దు సమస్యలు పరిష్కారం దిశగా వెళ్లకుండా, వాటిని మరింత క్లిష్టం చేసే రాజకీయ ప్రయోజనాలకే ఈ చర్య దోహదం చేస్తోందని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక భారత వైపు నుంచి చూస్తే, ఇది కేవలం సరిహద్దు వివాదం కాదు ఒక నిర్ధారిత అంతర్జాతీయ సరిహద్దు పట్ల పొరుగు దేశం తీసుకున్న అవాంఛిత ధోరణి. కరెన్సీ మీద మ్యాప్ ముద్రించడం అంతర్జాతీయ న్యాయపరంగా అర్థరహితం అయినప్పటికీ, పాపులర్ మైండ్‌సెట్‌ను ప్రభావితం చేసే ప్రమాదం ఉంది. అందుకే భారత్ ఇకపై దౌత్యపరమైన పద్ధతులతోనే కాక, స్థానిక స్థాయిలో కూడా స్పందనను బలోపేతం చేసే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు.


## కాలుష్య నియంత్రణ సామాజిక బాధ్యత - డిసెంబర్ 2...ప్రపంచ కాలుష్య నియంత్రణ దినం




భౌతిక వ్యవస్థలు లేదా జీవ క్రియలకు అస్థిరత, అసమానత, హాని లేదా అసౌకర్యం కలిగించే విధంగా కలుషితాలను పర్యా వరణంలోకి విడుదల చెయ్యటాన్ని కాలుష్యం అంటారు. నిప్పును పుట్టించటాన్ని నేర్చుకున్న శిలాజ సంబంధిత కాలం నుండి కూడా పర్యావరణం పై మానవాళి ప్రభావం కొంతవరకు ఉంది. మానవ వ్యర్థాలు నదులు లేదా నీటి వనరులను కొంత మేరకు కలుషితం చేసాయి. మధ్య కాలాల చివరిలో జనాభా పెరిగి , పట్టణాలలో ఎక్కు వగా కేంద్రీకృతం అవ్వటం వలన తయారుగా ఉన్న కాలుష్యానికి ఎక్కువగా ఆస్కారం ఇచ్చింది.కొన్ని ప్రాంతాలలో వాయు కాలుష్యం స్థాయిలు ఆరోగ్య సంబంధ విషయాలుగా గుర్తించబడ్డాయి , నివాస ప్రాంతాలలో నీటి కాలుష్యం శుద్ధి చెయ్యని మానవ వ్యర్థాల నుండి వ్యాధుల వ్యాప్తికి ఒక ప్రధాన మధ్యవర్తి. హద్దులు లేని వాతావరణం యొక్క స్వభావం , మహాసముద్రాల అనివార్యత భూతాపం యొక్క విషయంతో పాటుగా కాలుష్యాన్ని ఒక గ్రహ స్థాయిలో అమలు చెయ్యటానికి కారణం అయ్యింది. వాయు కాలుష్యం ముఖ్యంగా సరైన వెలుతురు కావలిసిన, కర్రను కాల్చటం ప్రక్రియ ద్వారా వచ్చిందే. శుభ్రమైన త్రాగే నీటి వనరులు విస ర్జితాల ద్వారా కలుషితం అవ్వటం లేదా విషపూరితం కావడం చాలా సులువుగా మరణాలకి కారణం అయ్యింది , కలుషితం అయ్యే ప్రక్రియ సరిగా అర్థం చేసుకో బడలేదు. చాలా ఎక్కువగా విసర్జి తాల ద్వారా జరిగిన కలుషితం , కాలుష్యం ప్రధాన కారణాలు అయ్యాయి. ఇంగ్లాండుకి చెందిన రాజు ఎడ్వర్డ్ %%.. 1272లో లండన్లో ఒక చట్టం చెయ్యటం ద్వారా సముద్ర – బొగ్గును మండించటాన్ని నిషేధిం చాడు. ఇంగ్లాండ్ లో వాయు కాలుష్యం ఒక పెద్ద సమస్యగా మారిపోయింది, 1858లో థేమ్సా గొప్ప దుర్వాసనతో ఒక ప్రాచీన నీటి నాణ్యత సమస్యలను నమోదు చేసింది, ఇది తరువాతి కాలంలో లండన్ మురుగునీటి వ్యవస్థ నిర్మించటానికి కారణం అయ్యింది. అణుయుద్ధం యొక్క పరిణా మాలు , పరీక్షలు రేడియోధార్మికత ప్రభావాన్ని ప్రస్ఫుటం చెయ్యటంతో రెండవ ప్రపంచ యుద్ధం తరువాత కాలుష్యం ఒక ప్రధాన విషయంగా అయ్యింది. తరువాత 1952లో లండన్ లో ఒక సాంకేతికమైన ఘోర ప్రమాదం అయిన గొప్ప పొగమంచు కనీసం 8000 మంది ప్రజలను చంపివేసింది. ఈ సామూహిక సంఘటన పరిశుభ్ర వాయు చట్టం, 1956 వంటి కొన్ని ప్రధాన ఆధునిక పర్యావరణ చట్టాలకు కారణం అయ్యింది. పర్యావరణ కాలుష్యంనకు పారిశ్రామిక విప్లవం జన్మను ఇచ్చింది. గొప్ప కర్మాగారాల ఉద్భవం , అధిక ప్రమాణాలలో బొగ్గు , ఇతర శిలాజ ఇంధనాల వినియోగం మొదలైనవి ఊహిం చని విధంగా వాయు కాలుష్యం నకు కారణం అయ్యాయి. పెరిగి పోతున్న మానవ వ్యర్థాల భారానికి అధిక మొత్తంలో పారిశ్రామిక రసాయనిక వ్యర్థాలను అదనంగా చేర్చాయి. పర్యావరణం పై మానవ ప్రభావం తగ్గింపును ఆశించే పర్యావరణ పరిరక్షణ , పర్యావరణ ఉద్యమం లను అభివృద్ధి చేసాయి. కాలుష్య దుష్ప్రభావాల నుండి పర్యావరణాన్ని రక్షించటానికి ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాలు, వివిధ రకాలైన కాలుష్యాలను నియంత్రించటానికి , అదే విధంగా కాలుష్య దుష్ప్రభావాల తగ్గించ టానికి వివిధ చట్టాలను అమలు చేసాయి. కాలుష్య నియంత్రణ అర్థం గాలి, నీరు , మట్టి లోకి విడుదలను , విసర్జనను నియంత్రించటం. కాలుష్య నియంత్రణ లేకపోతే, తినటం, వేడిచేయ్యటం, వ్యవ సాయం, ఘనుల త్రవ్వకం, తయారీ, రవాణా , ఇతర మానవ క్రియలు, మొదలైన వాటి నుండి వచ్చే వ్యర్థ పదార్థాలు పోగైనా లేదా చెల్లాచెదురుగా ఉన్నా అవి పర్యా వరణాన్ని నాశనం చేస్తాయి. నియంత్రణల అధికారాధిపత్యంలో, కాలుష్య నియంత్రణ కన్నా కాలుష్య నివారణ ఎక్కువగా కోరదగినది. 37 సంవత్సరాల క్రితం 1984, డిసెంబర్ 2న మధ్యప్రదేశ్ లోని భోపాల్ నగరంలో 'యూనియన్ కార్బైడ్ కెమికల్' ఫ్యాక్టరీలో నుంచి విషవాయువులు (మిథైల్ ఐసోసైనేట్) లీకయి నగరంలోని వేలాదిమంది ప్రజలను నిమిషాలలో మట్టుబెట్టింది. ఈ ఘోరకలి మనదేశ మానవాళి గుర్తుంచుకునే విధంగా డిసెంబర్ 2ను 'కాలుష్య నియంత్రణ దినోత్సవం'గా ప్రకటించింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్ - 9440595494**


## మానవ మనుగడకు సవాలుగా మారిన కాలుష్యం - డిసెంబర్ 2... జాతీయ కాలుష్య నియంత్రణ దినం




సరిగ్గా 40 ఏళ్ల క్రితం 1984 డిసెంబర్ 2న మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్ నగరంలో ఒక ఫ్యాక్టరీలో నుంచి వెలువడిన విష వాయువులు వేలాది మంది ప్రాణాలను క్షణాలలో బలి గొన్నాయి. ఈ ఘోర కలిని అందరూ గుర్తుంచుకునే విధంగా కేంద్ర ప్రభుత్వం డిసెంబర్ 2ను 'జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం'గా ప్రకటించింది. 1984 డిసెంబర్ 2న అర్ధరాత్రి సమయంలో భోపాల్ నగరం గాఢ నిద్రలో ఉన్న సమయంలో 41 టన్నుల మిథైల్ ఐసోసైనేట్ అనే విష వాయువు లీక్ కావడం వలన నిమిషాల వ్యవధి లోనే 2259 మంది అమాయక ప్రజలు మరణించారు. మరో 72 గంటల్లో 3487 మంది అసువులు బాశారు. అనంతరం ఈ దుర్ఘటన వల్ల 8 నుంచి 10 వేల మంది, మొత్తంగా 25,000 మంది ఈ గ్యాస్ లీకేజీ వలన ఉత్పన్నమైన పరిణామాలతో మరణించినట్లు మధ్యప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. అంతే కాకుండా పరోక్షంగా 500,000 పైగా ప్రజలు ఈ దుర్ఘటన వలన ఏర్పడిన అనారోగ్యాల బారిన పడ్డారు. ఇది ప్రపంచం లోనే అతిపెద్ద పారిశ్రామిక కాలుష్య ఘోరకలి. దీని కారణంగా కొందరుఇంకా చికిత్సలు పొందు తూనే ఉన్నారు.ప్రపంచ విషయానికి వస్తే యునైటెడ్ కింగ్డం చరిత్రలో అత్యంత భయంకరమైన కాలుష్య సంఘటన లండన్ పై డిసెంబరు 4 1952 న ఏర్పడిన మహా స్మోగ్ రూపంలో జరిగింది. కేవలం 6 రోజులలో 4000 మంది చని పోయారు, తరువాతి మాసాలలో 8000 చని పోయారు. 1979 లో యు ఎస్ ఎస్ ఆర్ లోని స్వేర్ద్ లోవ్స్క దగ్గర ఒక బయలాజికల్ ఆయుధాలను తయారు చేసే లాబొరేటరీలో జరిగిన ప్రమాదం లో లీక్ అయిన ఆంత్రాక్స్ స్పోర్ల వలన వందలమంది సామాన్య ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. యునైటెడ్ స్టేట్స్ అఫ్ అమెరికాలో నేటి వరకు అతి పెద్ద కాలుష్య ప్రమాదము 1948 సంవత్సరం అక్టోబరు చివర్లో దోనోర, పెనన్ పెనన్ సిల్ వెనియా లో జరిగింది. దీనివలన మొత్తం 20 మంది మృతిచెందగా 7000 పైగా క్షత గాత్రులయ్యారు. పరిశ్రమల నుంచి, వాహనాల నుంచి వచ్చే వ్యర్థాలు గాలిని, నీటిని, భూమిని, అంతరిక్షాన్ని అన్నింటిని కాలుష్యం చేస్తున్నవి. కర్బన ఉద్గారాల వల్ల భూతాపం పెరిగి పోతున్నది. భూగోళం అగ్నిగోళంగా మారు తోంది. ప్రస్తుతం ఉన్న రీతిలోనే వాతావరణ కాలుష్యం పెరిగితే ఈ శతాబ్దపు అంతానికి భూతాపం 3.5 డిగ్రీల సెల్సియస్‌కు పెరిగి ప్రళయ విలయాలు సంభవించి జీవుల మనుగడ కష్టమవుతుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. పరిసరాల కాలుష్యం నేడు మనిషి మనుగడకే ప్రమాదం కలిగించే స్థాయికి చేరుకున్నది. వాయు కాలుష్యములు ఎక్కువగా ఉన్న ప్రపంచ పట్టణాలలోని పిల్లలు ఉబ్బసం, నిమోనియా, ఇతర శ్వాసకోస సంబంధమైన జబ్బుల బారిన పడే అవకాశాలు ఎక్కువ. వాయు కాలుష్యం సామాన్యముగా జనసాంద్రత అధికంగా కలిగిన మహా నగరాలలో, ముఖ్యముగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో, ఎక్కడైతే పర్యావరణ నియమ నిబంధనలు అమలులో లేవో లేక నామమాత్రంగా వున్నాయో, అక్కడ కూడు కొంటుంది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో కూడా జన సాంద్రత అధికంగా కలిగిన ప్రదేశాలలో కాలుష్యం అనారోగ్య కరమైన స్థాయిలలో ఉంటుంది. వాయుకాలుష్యం, నీటి కాలుష్యం, భూ కాలుష్యం, ధ్వని కాలుష్యం, సముద్ర కాలుష్యం, ఉష్ణ కాలుష్యం, వ్యర్థ ఘన పదార్థాల కాలుష్యం, రేడియో ధార్మిక కాలుష్యం తదితరాలు కూడా కాలుష్య కారకాలు. కాలుష్య కారకాలు ఉత్పన్నమగు విధానాలు ప్రకారం రెండు రకములుగా విభజింపవచ్చు – ప్రాథమిక లేదా ద్వితీయ రకాలు. సాధారణంగా ప్రాథమిక కాలుష్య కారకాలు ఏదైనా ప్రక్రియ నుండి నేరుగా ఉత్పన్నమైయ్యే పదార్థాలు. ఉదాహరణకు అగ్ని పర్వతముల నుండి వచ్చే బూడిద, మోటారు వాహనముల నుండి వచ్చే కార్బన్ మోనాక్సైడ్ లేక ఫ్యాక్టరీల నుండి వచ్చే సల్ఫర్ డై ఆక్సైడ్ లాంటివి. ద్వితీయ రకపు కాలుష్య కారకాలు నేరుగా ఉత్పన్నం కావు. ప్రాథమిక కాలుష్య కారకాలు చర్యలకు లోనవ్వడం వల్ల లేక వాయువులో కలిసినందు వల్ల ద్వితీయ కాలుష్య కారకాలు ఏర్పడుతాయి. పర్యావరణాన్ని రక్షించటానికి ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాలు, వివిధ రకాలైన కాలుష్యాలను నియంత్రించటానికి, అదే విధంగా కాలుష్య దు ష్ప్రభావాలను తగ్గించ టానికి వివిధ చట్టాలను అమలు చేస్తున్నాయి. అదే విధంగా మన దేశంలో కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కాలుష్య భూతాన్ని తరిమి వేయడానికి పలు చట్టాలను రూపొందించి అమలు చేస్తున్నాయి. భారత ప్రభుత్వం 1981వ సంవత్సరంలో "వాయు కాలుష్య చట్టాన్ని ప్రవేశపెట్టింది. ఇంకా 1986వ సంవత్సరంలో "పర్యా వరణ పరిరక్షణ చట్టాన్ని కూడా అమలులోకి తెచ్చింది. పరిశ్రమల నుంచి వెలువడే పొగ, బూడిద, విష వాయువులు వంటి వాటిని ఫిల్టర్లతో వడపోసి మాత్రమే వాతావరణం లోకి వదలాలి. అంతేకాక ఇటువంటి పరిశ్రమలను, థర్మల్ విద్యుత్ కేంద్రాలు, అణు రియాక్టర్ల వంటి వాటిని జనుల నివాసాలకు దూరంగా కట్టాలి. రైళ్ళు, వాహనాలు వంటి వాటికి ఉపయోగించే పెట్రోలు, డీజిల్ వంటి ఇంధనాలు కాకుండా జీవ ఇంధనాలు వాడేలా చూడాలి. దీనివలన ఎంతో వాయు కాలుష్యం తగ్గుతుంది. మొత్తం పరిశ్రమలను కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నాలుగు తరగతులుగా విభజిం చింది. ఆయా పరిశ్రమల నుండి వెలువడే కాలుష్య కారకాలను అనుసరించి అత్యధిక కాలుష్యాన్ని వెదజల్లే వాటిని ఎరుపు వర్గంగాను, మధ్యస్తంగా కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలను నారింజ వర్గంగాను, తక్కువ కాలుష్యాన్ని వెదజల్లే వాటిని ఆకుపచ్చ వర్గంగా, కాలుష్యానికి ఆస్కారమివ్వని వాటిని తెలుపు వర్గంగా వర్గీకరించింది. తెలంగాణ లోని పరిశ్రమలన్నింటినీ కాలుష్య నియంత్రణ మండలి క్రమబద్ధంగా పర్యవేక్షిస్తోంది. ఈ పరిశ్రమలు ఎటువంటి కాలుష్యాన్ని విడుదల చేయకుండా చూస్తూ, ఒక వేళ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలకు ఉపక్రమిస్తున్నది. అలాగే అడవులను, పర్యావరణాన్ని రక్షించేందుకు ఇతర చర్యలతో పాటు, అతి ముఖ్యమైన తెలంగాణకు హరితహారం అనే బృహత్తర కార్యక్రమాన్ని రూపొందించి గత కొన్ని సంవత్సరాలుగా యుద్ధ ప్రాతిపదికపై కోట్లాది మొక్కలు నాటి పర్యావరణ సంరక్షణకు కృషి చేస్తున్నది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్ - 9440595494**

## బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనతోనే బానిసత్వానికి అడ్డుకట్ట - డిసెంబర్ 2... అంతర్జాతీయ బానిసత్వ విముక్తి దినోత్సవం




ఇష్టం లేని పనిని వివిధ కారణాల వల్ల బలవంతంగా చేయిస్తూ శ్రమ దోపిడీకి గురి చేయడమే బానిసత్వం. పిల్లలవద్ద బలవంతంగా పని చేయించుకోవడం, బలవంతపు పెళ్ళిళ్ళు, ఇళ్ళల్లో వెట్టి చాకిరి, వ్యవసాయ కూలీలు, పిల్లలను అమ్మడం, ఇటుక బట్టీలు, బలవంతపు పడుపు వృత్తి, పిల్లల అక్రమ రవాణా లాంటి వివిధ రూపాలలో బానిసత్వం కనిపిస్తున్నది. భయ పెట్టీ, హింసించి, మోసగించి, బెదిరించి, వివిధ రకాలుగా శ్రమ దోపిడీ జరగడం అనునిత్యం జరుగుతున్నదే. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి జరిగితే తప్ప పరిష్కారం లేదని విజ్ఞుల భావన. ప్రభుత్వాలు పలు పథకాలు చేపట్టినా ఇంకా అధిక శాతం పిల్లలు విధి లేక బాలకార్మికులు గానే ఉండి పోతున్నారు. బాలల శ్రేయస్సుకు కృషి జరుగుతున్నా ఆచరణలో ఫలితాలు కానరావడం లేదు. పాఠశాల సౌకర్యాలు లేక కొందరు, అవి ఉన్నా వివిధ కారణాల రీత్యా బడికి వెళ్లలేక మరికొందరు బాలలు తమ ఉజ్వల భవిష్యత్తును అంధకారమయం చేసుకుంటున్నారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలతో ముడివడి సంక్షేమ పథకాలకు నోచుకోక, చదువు చెప్పించే స్థోమత లేక ఎందరో పేద తల్లిదండ్రులు గత్యంతరం లేని స్థితిలో చిన్నారులపై భారాన్ని మోపుతున్నారు. హోటళ్లు, కిరాణా దుకాణాలు, ఫ్యాక్టరీలు, మిల్లులు, క్వారీలు, గనులకు తమ పిల్లలను పనికి పంపుతున్నారు. వ్యవసాయ పను లకు కొందరు బాలలు వెళుతున్నారు. చివరికి కొందరు పిల్లలను భిక్షాటన వృత్తిలోకి బలవంతంగా నెడుతున్నారు. వివిధ రంగాలలో బాలకార్మికులు అవస్థలు పడుతూ అనుక్షణం శ్రమిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో పెద్దలు చేయాల్సిన పనులను సైతం వీరే చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు నీళ్లు వదిలి బాలల చేత వెట్టిచాకిరీ చేయించుకుంటున్నా, వారికి విముక్తి కలిగించాలన్న ధ్యాస సంబంధిత అధికారుల్లో లేకపోవడం బాధాకరం. యజమానులు చెప్పిందే చట్టంగా, వారు చేసేదే సంక్షేమంగా పరిస్థితులున్నా కార్మికశాఖ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. అప్పుడప్పుడు తూతూ మంత్రంగా దాడులు చేస్తున్నా దోషులకు ఎలాంటి శిక్షలు పడడం లేదు. 14 సంవత్సరాల లోపు పిల్లలందరికీ – ఉచిత నిర్బంధ విద్యను అమలు చేయాలని భారత రాజ్యాంగం లోని 24వ నిబంధన స్పష్టం చేస్తున్నా అది కాగితాలకే పరిమితమవడం శోచనీయం. పేదరికం కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో పసి పిల్లల బంగారు కలలు చెదిరి పోతున్నాయి. పాలబుగ్గల లేత వయసులో వారు కార్మికులుగా మారడం బాధాకరం. కార్మిక చట్టాలకు విరుద్ధంగా పిల్లల చేత పని చేయించుకునే యాజమాన్యాలు తగిన వేతనాలు ఇవ్వడం లేదు. పిల్లలు పనిచేసే చోట తగిన రీతిలో భద్రతా సౌకర్యాలను కల్పించక పోవడం ఆక్షేపణీయం. ప్రాథమిక హక్కులను పేర్కొన్న రాజాంగంలోని 3వ ప్రకరణంలోని 15(8)వ అంశం బాలల కోసం ప్రత్యేక శాసనాలు చేసే అధికారం ప్రభుత్వానికి కలుగజేస్తున్నది. 2 8 వ అధికరణం ప్రకారం బాలలను వ్యాపార వస్తువుగా మార్చడం, నిర్బంధ సేవలను చేయించు కోవడం అపరా ధంగానే పరిగణించాలి. 14 సంవత్సరాల లోపు పిల్లలను కర్మాగారాలలో, గనులలో, ఇతర ప్రమాదకరమైన పనులలో నియమించడాన్ని 24వ ఆర్టికల్ నిషేధించింది. 39(ఇ) ప్రకారం బాలలను వారి వయసుకు తగని, శక్తికి మించిన పనులలో నియమించ రాదు. పేదరికాన్ని సాకుగా చేసుకుని బాలలను పనుల్లో నియ మించడం నిషేధించాలని రాజ్యాంగం ఆదేశించింది. కఠిన చట్టాలు ఎన్ని ఉన్నా చాలామంది పిల్లలు బాల కార్మికులు గానే మిగిలి పోతున్నారు. రాజ్యాంగంలో పేర్కొన్న నిర్బంధ ప్రాథమిక విద్య ఈనాటికీ ఫలించని కలగానే మిగిలి పోతున్నది. ప్రపంచ బాలకార్మి కుల్లో మూడవ వంతు మంది మన దేశంలోనే ఉన్నారని ఒక అంచనా. దీంతో బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. 5 నుండి 15 సంవత్సరాల లోపు వయసు గల పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించేందుకు పలు కార్యక్రమాలను చేపట్టారు. పాఠశాలలో నమోదు కాని, మధ్యలో మాని వేసిన, అర్హతగల పిల్లల సమగ్ర వివరాలను సేకరించి వారిని తిరిగి తరగతులకు పంపేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, ఆచరణాత్మక చర్యలను చేపట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చదువుల పండగ పేరుతో 2002 ఆగస్టు 1 నుండి 10వరకూ, 2003 సంవ త్సరం నవంబర్ 24 నుండి 29వరకూ బడి బయట ఉన్న పిల్లలనందరినీ పాఠశాలలలో చేర్పించే బృహత్ కార్యక్రమాన్ని అమలు చేశారు. ఆ తర్వాత ఏటా ఆ కార్యక్రమాన్ని అమలు చేస్తునే ఉన్నారు. అయినా ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదన్నది వాస్తవం. అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు చెబుతున్నా బాల కార్మికులు వివిధ పనుల్లో కొనసాగుతూనే ఉన్నారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించ డానికి, నిర్బంధ ప్రాథమిక విద్య అమలుకు మరింతగా చర్యలు చేపట్టవలసి ఉంది. ముందుగా వారి తల్లిదండ్రులకు చదువు పట్ల అవ గాహన కలిగించాలి. బాలకార్మికులకు వసతి సైతం కల్పించేలా ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేయాలి. నిరుపేద కుటుంబాల్లో ఆర్థిక సమస్యలను తొలగించేలా వారికి సంక్షేమ పథకాలను అమలు చేయాలి. పిల్లల సంపాదనపై ఆధార పడకుండా తల్లిదండ్రులకు సాధికారత కల్పించాలి.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్ - 9440595494**

# చందమామతో బి.ఎన్.రెడ్డికి విడదీయరాని అనుబంధం

## – డిసెంబరు 2... బొమ్మిరెడ్డి నాగిరెడ్డి జయంతి



BOMMIREDDY NAGI REDDY

(2 December 1912 – 25 February 2004)

బి.నాగిరెడ్డి... తెలుగు చిత్ర పరిశ్రమ నుండి విడదీయ జాలని బంధం, అనుబంధం కలిగిన ప్రతిభాశాలి. ఆయన ఆంధ్ర జ్యోతి పత్రిక ప్రచురణ కర్తగా తెలియకున్నా, "చందమామ" పేరు తీయగానే గుర్తొచ్చే పేరు చక్రపాణి తో పాటు రెడ్డి పేరే. బొమ్మిరెడ్డి నాగిరెడ్డి (డిసెంబర్ 2, 1912 – ఫిబ్రవరి 25, 2004) తెలుగు సినీ నిర్మాత, దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత. బి.ఎన్.రెడ్డిగా సుపరిచితు లైన బొమ్మిరెడ్డి నాగిరెడ్డి డిసెంబర్ 2, 1912న కడప జిల్లా, కొండాపురం మండలంలోని పొట్టిపాడు గ్రామం లో అమ్మమ్మ ఇంట, రైతు కుటుం బంలో జన్మించాడు. ఈయన స్వ స్థలం, సింహాద్రిపురం మండలం లోని వై.కొత్తపల్లిలో ఒక ఉపాధ్యాయుడి వద్ద చదువుకున్న నాగిరెడ్డి పది, పన్నెండేళ్ళు వచ్చే నాటికే పురాణేతిహాసాలను క్షుణ్ణంగా ఆకళింపు చేసుకో గలిగాడు. అవన్నీ ఆయన ఆలోచనా విధానాన్ని ఎంతగానో ప్రభావితం చేశాయి. యువకుడుగా ఆయన స్వాతంత్ర్యో ద్యమం పట్ల ఆకర్షితుడయ్యాడు. ఖాదీ ఉద్యమంలో పాల్గొన్నాడు. ప్రింటింగ్ ప్రెస్ ను ప్రారంభించాడు. క్రమంగా ప్రచురణ రంగ ప్రవేశానికి అదే దోహదం చేసింది. ఆంధ్రజ్యోతి అనే సామాజిక–రాజకీయ పత్రికను ప్రారంభించాడు. అప్పుడే చక్రపాణి సాహచర్యం లభించింది. ఇద్దరూ కలిసి పిల్లల కోసం ప్రత్యేకంగా ఒక పత్రికను తీసుకు రావాలను కున్నారు. దేశం స్వాతంత్ర్యం పొందడానికి ఒక నెల ముందుగా "చందమామ" ఆవి ర్భావం జరిగి దినదిన ప్రవర్ధమానం కాసాగింది. ఆ తర్వాత ఆయన సినిమా నిర్మాణ రంగ ప్రవేశం చేశాడు. 1974లో ఆయన దృష్టి వైద్యరంగం మీదికి మళ్ళింది. మద్రాసులో రెండు ఆసుపత్రులను నెల కొల్పాడు. కఠినశ్రమ, నిరాడం బరత, వినయం, నిర్దిష్ట పథకాలు రూపొందించడం, ఆయన సహజ గుణాలు. ఆయన పలికే ప్రతి మాటలోనూ, చేసే ప్రతి పనిలోనూ భారతీయ తాత్విక దృష్టి, ముఖ్యం గా భగవద్గీత ప్రబోధించే కర్మసిద్ధాంత ప్రభావం స్పష్టంగా కనిపించేది. మొదట్నుంచి నాగిరెడ్డికి పబ్లిసిటీ విభాగం పట్ల ఆసక్తి ఉండేది. ఆయన అన్న బి.ఎన్.రెడ్డి స్థాపించిన వాహినీ సంస్థలో భాగస్వామిగా చేరాడు. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో (1941లో) వాళ్ళ సరుకు తీసుకువెళు న్న ఓడ బాంబు దాడిలో ధ్వంసం కావడంతో పెద్ద మొత్తంలో నష్టం వచ్చింది. ఆ పరిస్థితుల్లో వ్యాపారం కొనసాగించ లేక తన స్వగ్రామమైన ఓరంపాడు చేరాడు. ఆ తర్వాత వాహినీ వారి భక్తపోతనకు దర్శకత్వం వహించిన కె.వి.రెడ్డి నాగిరెడ్డిని మద్రాసుకు పిలిపించి ఆ చిత్రం తాలూకు పబ్లిసిటీ వ్యవహారాలు అప్ప జెప్పాడు. సరిగ్గా అదే సమయంలో జెమినీ వారి బాలనాగమ్మ విడుదలైంది. జెమినీ వారు తమ చిత్రాలకు పెద్ద ఎత్తున ప్రచారం చేయిస్తారు. దానికి దీటుగా ఉ ండడానికి నాగిరెడ్డి మద్రాసులో హనుమంతుడి భారీ కటౌట్లు పెట్టించి వినూత్న రీతిలో ప్రచారం చేయించాడు. ఆ పబ్లిసిటీ చిత్ర విజయానికి బాగా తోడ్పడింది. దాంతో కె.వి.రెడ్డి ఆయనకు 500 రూపాయలు బహుమతిగా ఇచ్చాడు. ఆ మొత్తంతో నాగిరెడ్డి ఒక ఆస్టిన్ కారు కొన్నాడు. తర్వాత 1950లో నిర్మాతగా మారి చక్రపాణితో కలిసి విజయా ప్రొడక్షన్స్ స్థాపించాడు. ఉన్నతమైన ప్రమాణాలతో పండితపామర జనరంజకంగా సినిమాలు తీసిన విజయా సంస్థ తెలుగు సినిమా చరిత్రలో ఒక సువర్ణాధ్యాయాన్ని సృష్టించింది. 1950లో వచ్చిన షావుకారుతో మొదలైన ప్రస్థానం 1962లో వచ్చిన గుండమ్మ కథ వరకు ఉచ్ఛస్థితిలో కొనసాగింది. అర్జునుడి పతాకంపై జెండాపై కపిరాజు (హనుమంతుడు) బొమ్మ ఉంటుంది. అర్జునుడి ఆ పతాకమే విజయా వారి లోగోలోనూ ఉంటుంది. లోగోలో "క్రియా సిద్ధి స్సత్వే భవతి" అనే ఆర్యోక్తి ఉంటుంది. విజయా ప్రొడక్షన్స్ వారి మొదటి సినిమా ఎల్వీ ప్రసాద్ దర్శకత్వం వహించిన "షావుకారు" (1950). ఇది తెలుగులో మొట్ట మొదటి అభ్యుదయ చిత్రంగా, తెలుగు సినిమాకు పునాదిరాయిగా కీర్తి అందుకొంది. ఈ సినిమా అనుకు న్నంతగా విజయవంతం కాక పోవడంతో తర్వాతి ప్రయత్నంగా కె.వి.రెడ్డి దర్శకత్వంలో పాతాళ భైరవి తీశారు. 1951లో వచ్చిన "పాతాళభైరవి", సినిమాను జనం విరగబడి చూశారు. అంతకు ముందు ఎవరూ కనీ వినీ ఎరుగని ఘన విజయం సాధించింది. దాంతో ఈ సినిమాను తర్వాత హిందీ, తమిళ భాషల్లో కూడా తీశారు. ఈ సినిమా లోని పాత్రలు తోట రాముడు, నేపాళ మాంత్రికుడు, అంజిగాడు, సదాజపుడు, ఆ పాత్రల కోసం పింగళి నాగేంద్రరావు రాసిన సంభాషణలతో సజీవంగా ప్రజల మనసుల్లో స్థిరనివాసం ఏర్పరచు కొన్నారు. ఈ సినిమాతో ఎస్వీ రంగారావు లోని గొప్ప నటుడు బయట కొచ్చాడు. ప్రేక్షకాదరణలో ఈ సినిమాను అధిగమించ గలిగింది. మాయాబజార్ ఒక్కటే. విజయా వారి మూడవ సినిమా పెళ్ళిచేసిచూడు. ఇది భారీగా లాభాల నార్జించింది. దీంట్లో ఎన్.టి.రామారావు, జి.వరలక్ష్మి, సావిత్రి నటించారు. తర్వాత తమ సంస్థలో దర్శకత్వ శాఖలో సహాయ దర్శకుడుగా పనిచేస్తున్న కమలాకర కామేశ్వర రావు దర్శకత్వంలో 1954లో చంద్రహారం తీశారు. ఇది గొప్ప చిత్రంగా విమర్శకుల ప్రశంసలు పొందింది. కానీ ప్రేక్షకుల ఆదరణకు నోచు కోలేదు. ఆ తర్వాత వారు తీసిన సినిమాలే నేటికీ తెలుగులో వినోదాత్మక సాంఘిక చిత్రాల్లో మేటిగా కీర్తించబడే మిస్సమ్మ, దాని తర్వాత మాయా బజార్. నిస్సందేహంగా ఇది ప్రపంచస్థాయి చిత్రాలు. వీటి తర్వాత వచ్చిన రెండు విజయవంత మైన విజయా వారి సినిమాలు అప్పుచేసి పప్పుకూడు, గుండమ్మ కథ. గుండమ్మ కథతో ఒక శకం ముగిసినట్లైంది. సి.ఐ.డి, జగదేకవీరుని కథ, సత్య హరిశ్చంద్ర, ఉమా చండీ గౌరీ శంకరుల కథ, గంగ–మంగ, శ్రీ రాజేశ్వరీ విలాస్ కాఫీక్లబ్ మొదలై నవి తీశారు. ఇక సినిమాలు తీయడం మానుకున్న నాగిరెడ్డి ఆ తర్వాత చాలా కాలానికి 1990లలో విజయా బ్యానర్ మీదే "విజయ" అనే సినిమా తీశాడు. దీంట్లో రజనీకాంత్ నటించాడు. విజయాసంస్థ ఏర్పడిన నాటి నుంచి 'ఉమా చండీ గౌరీ శంకరుల కథ' వరకు వారి ప్రతి సినిమాలోనూ హీరో రామారావే. ఆస్థాన నటు లుగా ఉన్నవాళ్ళు ఎస్వీ. రంగారావు, సూర్యకాంతం, రేలంగి, రమణారెడ్డి తదితరులు. ఆ కాలంలో నటులు ఇతర సంస్థలు తీసే సినిమాల్లో హీరో వేషం వేయడం కంటే విజయావారి సినిమాల్లో ఎక్స్ట్రా వేషం వేయడమే మిన్నగా భావించేవారు. అక్కినేని నాగేశ్వరరావుకు విజయా వారి సినిమాల్లో నటించే అవకాశం మొదట మిస్సమ్మ సినిమాతో వచ్చింది. మాయాబజార్ తర్వాత ఆయనకు గుండమ్మకథలో సహనాయకుడి పాత్ర వేసే అవకాశం వచ్చింది. అది ఆయనకు నూరవ సినిమా కూడా. అది గొప్ప అదృష్టంగా భావించిన ఆయన ఆ సినిమాకు పారితోషికం తీసుకో లేదు. కానీ నాగిరెడ్డి ఆయనకు ఇవ్వవలసిన మొత్తాన్ని ఒక విద్యాసంస్థకు విరాళంగా ఇచ్చారు. ఎల్వీ ప్రసాద్ (షావుకారు, పెళ్ళిచేసి చూడు, మిస్సమ్మ) బీ కె.వి.రెడ్డి (పాతాళ భైరవి, మాయా బజార్, జగదేకవీరుని కథబీ కమలాకర కామేశ్వర రావు (చంద్రహారం), దర్శకులుగా ఉన్నారు. విజయా సంస్థ తమిళంలో పాతాళ భైరవి, కళ్యాణం పన్ని పార్ (పెళ్ళి చేసి చూడు), చంద్రహారం, మిస్సియమ్మ (మిస్సమ్మ), మాయా బజార్, గుండమ్మ కథ, ఎంగవీట్టు పిళ్ళై (సురేష్ ప్రొడక్షన్స్ వారి తొలి సినిమా, రాముడ– భీముడు) బీ హిందీలో పాతాళభైరవి, మిస్ మేరీ (మిస్సమ్మ), రాం ఔర్ శ్యాం (రాముడు – భీముడు), జూలీబీ కన్నడ, సింహళీ భాషల్లో కూడా కొన్ని సిన్మాలు తీశారు. నాగిరెడ్డి తమిళంలో గుండమ్మ కథ, ఎంగ వీట్టు పిళ్ళై సినిమాలకు తనే దర్శకత్వం వహించాడు. చెన్నైలో తమ్ముడు బి.ఎన్. కొండా రెడ్డి పేరు మీద బి.ఎన్.కె. ప్రెస్సు ప్రారంభించిన ప్రెస్సు నుంచే ఆయన ఆంధ్రజ్యోతి అనే సాంఘిక – రాజకీయ పత్రిక మొదలుకొని అనేక పత్రికలు ప్రచురించారు. వాటిలో అగ్రగణ్యమైనది చందమామ. అంతేకాక జూనియర్ చందమామ. తొమ్మిదేళ్ల లోపు పిల్లల కోసం చందమామ ప్రత్యేకంగా ఆంగ్లంలో ప్రచురిస్తున్న మాస పత్రిక, విజయ చిత్ర, (సినిమా వారపత్రిక), వనిత, (మహిళల మాసపత్రిక) జూనియర్ క్వెస్ట్, పిల్లలకోసం ఇంగ్లీషులో స్పుత్నిక్, పిల్లల కోసం ఇంగ్లీష్ లో హెరిటేజ్, మనోజ్ దాస్ సంపాదకత్వంలో భారతీయ సాంస్కృతిక వైభవాన్ని గురించి తెలియజేసే ఆంగ్ల మాస పత్రికలను నిర్వహించారు. ఆయన నేషనల్ ఫిల్మ్ డెవలప్ మెంట్ కౌన్సిల్ వ్యవస్థాపకునిగా, ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిగా రెండు సార్లు, సౌత్ ఇండియన్ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడిగా నాలుగు సార్లు, 1980 – 83 మధ్యకాలంలో తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ అధ్యక్షుడిగా పని చేశారు. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు (1987లో), రఘుపతి వెంకయ్య అవార్డు,తమిళనాడు ప్రభుత్వంచే కలైమామణి అవార్డు (1972లో) అందుకున్నారు. శ్రీవేంకటేశ్వర, శ్రీ కృష్ణదేవరాయ విశ్వ విద్యాలయాల నుంచి గౌరవ డాక్టరేట్లు పొందారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్ - 9440595494**

# రాజకీయ దురంధరుడు మర్రి చెన్నారెడ్డి - డిసెంబర్ 2...మర్రి చెన్నారెడ్డి వర్ధంతి



మర్రి చెన్నారెడ్డి (జనవరి 13, 1919 – డిసెంబర్ 2, 1996) భారత జాతీయ కాంగ్రెస్ పార్టీకి చెందిన రాజకీయ నాయకుడు. 1978 నుండి 1980 వరకు, 1989 నుండి 1990 వరకు రెండు పర్యా యాలు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఉత్తర ప్రదేశ్ గవర్నర్‌గా (1974–1977), పంజాబ్ గవర్నర్ (1982–1983), గవర్నర్‌గా కూడా పనిచేశారు. ఫిబ్రవరి 1992 నుండి మే 1993 వరకు రాజస్థాన్, 1993 నుండి ఆయన మరణించే వరకు తమిళనాడు గవర్నర్‌గా ఉన్నారు . అతను ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు .అతి పిన్న వయసుల్లనె మంత్రులలో ఒకరైన ఘనత కూడా ఆయనకు ఉంది. 30 సంవత్సరాల వయస్సులో ఆంధ్ర ప్రదేశ్ మంత్రి కావడం కూడా విశేషం. చెన్నారెడ్డి జనవరి 13, 1919న ప్రస్తుత వికారాబాదు జిల్లా, వికారాబాదు తాలూకాలోని మర్పల్లి మండలం లోని సిరిపురం గ్రామములో శంకరమ్మ, లక్ష్మారెడ్డి దంపతులకు జన్మించారు. హైస్కూలు విద్యార్థిగా వున్న రోజులలో, ఉపన్యాస పోటీలను ఏర్పాటు చేయడం, గ్రంథా లయాలను స్థాపించడం, సేవాకార్య క్రమాలను నిర్వహించి, తోటి విద్యార్థులను ఉత్తేజ పరిచేవారు. కాలేజీలో చదువుతున్న రోజులలో సాంఘిక సేవా దళాలను ఏర్పాటు చేసి వాటికి నాయకత్వం వహించ డమో, లేదా నిజాం పరిపాలనకు వ్యతిరేకంగా జరిగే రాజకీయ మహా సభలలో ప్రతినిధిగా పాల్గొనడమో చేస్తూ ఉండేవారు. చిన్ననాటినుండి వైద్యవృత్తిని చేబట్టాలనే ఆకాంక్ష బలంగా ఉండేది. చివరకు తన 22వ ఏట ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఎం.బి.బి.యస్ పట్టా తీసుకొనడం ద్వారా ఆయన ఆశయం సిద్ధించింది. రాష్ట్ర ప్రభుత్వ శాఖలో వైద్యులుగా నియమింప బడ్డారు. ఉద్యోగంలో ప్రవేశించిన రెండు నెలలలోనే ఆ ఉద్యోగానికి రాజీనామా చేసి హైదరాబాదులో సొంతంగా రెండు వైద్యా లయాలను నెలకొల్పి వైద్యం చేయడం ప్రారంభించారు. రెండు సంవత్సరాలు ఆ రెండు చికిత్సాలయాలను మూసివేసి, తన జీవితాన్ని పూర్తిగా దేశ రాజకీయాలకు అంకితం చేశారు. గాంధీజీ పిలుపు మేరకు 1935లో ఆంధ్రమహాసభలో పాల్గొన్నారు. అది ఆయన రాజకీయ అరంగేట్రం. కార్యకర్తగా, సమావేశకర్తగా, ఖాదీ ప్రచారకులుగా, గాంధేయులుగా, విద్యార్థి నాయకులుగా, ఆంధ్ర విద్యార్థి కాంగ్రెస్ వ్యవస్థాపకులుగా అనేక స్థాయిలో పనిచేసి అనుభవాన్ని సంపాదించారు. 1938లో జైలు శిక్షను అనుభ వించారు. చెన్నారెడ్డి 1941లో ఎం.బి.బి.ఎస్ డిగ్రీ పొందారు. వరంగల్ లోని గాంధీ ఆసుపత్రిలో డాక్టర్ గా పని చేశారు. తర్వాత రోజుల్లో ఆంధ్ర యువజన సమితి, విద్యార్థి కాంగ్రెసును స్థాపించారు. అనేక విద్యార్థి, యువత, విద్య, అక్షరాస్యత, సాంస్కృతిక సంస్థలలో చురుకుగా పాల్గొనే వారు. ఒక వారపత్రికను రెండు సంవత్సరాల పాటు సంపాద కత్వం వహించారు. అనేక పత్రికలలో వ్యాసాలు కూడా ప్రచురించారు. చెన్నారెడ్డి అప్పటి హైదరాబాదు రాష్ట్రములోని స్వాతంత్ర్యోద్యమములో పాల్గొన్నారు. 1942లో ఆంధ్ర మహాసభ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 1946 లో జరిగిన రాష్ట్ర స్టేట్ కాంగ్రెసు మహాసభకు చెన్నారెడ్డి ఆహ్వాన సంఘ కార్యదర్శిగా ఎన్నుకోబడ్డారు. చివరకు ఈ స్టేట్ కాంగ్రెసు అధ్యర్యాన్నే, హైదరాబాదు ప్రజలు నిజాం నిరంకుశ పరిపాలనను ఎదుర్కొని పోరాడారు. నిజాం మీద సాగించిన ఈ పోరాటాన్ని అహింసాయుత పద్ధతిని సాగించాలని డాక్టరు చెన్నారెడ్డి అభిమతం. ఆ సందర్భంలో ఆయన ఢిల్లీ వెళ్ళి పండిట్ జవహర్లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్, డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ తదితరులను కలుసుకుని వచ్చారు. మహాత్మాగాంధీ ఆశీస్సులను కూడా పొందారు. ఆయన అనేక సంవత్సరాలు ఆంధ్రా ప్రావిన్స్ కాంగ్రెస్ కమిటీకి ప్రధాన కార్యదర్శిగా, 30 సంవత్సరాలు పిసిసి వర్కింగ్ కమిటీ సభ్యునిగా ఉన్నారు . హైదరాబాదు స్వతంత్ర్య పోరాటం ఉధృత రూపం దాల్చడంతో, నిజాం ప్రభుత్వం నాయకులందరినీ అరెస్టు చేసింది. అరెస్టు అయిన నాయకులలో చిన్నవాడైన చెన్నారెడ్డి కూడా ఉన్నారు. చర్చల ఫలితంగా విడుదలై, స్టేట్ కాంగ్రెస్ నాయకులందరు హైదరాబాదు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలకు వలస వెళ్ళి, అక్కడనుండి ఉద్యమం సాగించారు. ఆ సమయంలో చెన్నారెడ్డి విజయవాడ వచ్చి, "హైదరాబాదు" అనే వారపత్రికను నిర్వహిస్తూ, హైదరాబాదు ప్రజలు సాగిస్తున్న స్వాతంత్ర్య పోరాటాన్ని ఉధృత పరిచారు. ఆ సమయంలో భారత ప్రభుత్వం కలుగజేసుకుని నిజాంపై పోలీసు చర్యలను తీసుకుని, హైదరాబాదు సంస్థానాన్ని ఇండియాలో అంతర్భాగంగా విలీనం చేసింది. దానితో ఇండియా పార్లమెంటుకు హైదరాబాదు రాష్ట్రంలోని కొందరిని ప్రజా ప్రతినిధులుగా భారత ప్రభుత్వం తీసుకొనడం జరిగింది. ఆనాటి పార్లమెంటు సభ్యులలో చెన్నారెడ్డి కూడా ఒకరు. పార్ల మెంటులో హైదరాబాదు లోని విషమ సంఘటనలను, పరిస్థితులను గురించి చెన్నారెడ్డి చేసిన ప్రసంగాలు నెహ్రూ, రాజాజీల వంటి వారిని ఆకర్షించాయి. పర్యవసానంగా చెన్నారెడ్డి కాంగ్రెస్ పార్టీ విప్ గా ఎన్నుకో బడ్డారు. ఇంతలో 1952లో దేశమంతటా ప్రప్రథమంగా వయోజన వోటింగు పద్ధతిని జనరలు ఎన్నికలు జరిగాయి. చెన్నారెడ్డి హైదరాబాదు రాష్ట్ర శాసన సభకు ఎన్నుకో బడ్డారు. తర్వాత బూర్గుల మంత్రివర్గంలో ఆహార, వ్యవసాయ శాఖలమంత్రిగా తీసుకోబడి, ఇండియన్ డెలిగేషనుకు నాయకత్వం వహించి, 1953, 1955 సంవత్సరాలలో విదేశాలు పర్యటించారు. ఆంధ్రప్రదేశ్ అవతరణ జరిగిన తర్వాత సంజీవరెడ్డి, బ్రహ్మానందరెడ్డి మంత్రి వర్గాలలో కూడా చెన్నారెడ్డి మంత్రిగా పనిచేశారు. ఆంధ్ర రాష్ట్రంతో తెలంగాణ విలీనాన్ని వ్యతిరేకించారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పెద్ద మనుషుల ఒప్పందంపై సంతకం చేసిన తెలంగాణ ప్రాంత నేతలలో ఒకరు . డాక్టర్ రెడ్డి 1967 లో ఇందిరా గాంధీ కేంద్ర మంత్రివర్గంలో ఉక్కుశాఖ మంత్రిగా తీసుకో బడ్డారు. ఆంధ్రప్రదేశ్ లోని తెలంగాణ ప్రజలు సాంఘిక ఆర్థిక విద్యా రంగాలలో వెనుకబడి యుండడాన్ని డాక్టరు చెన్నారెడ్డి సహించలేక పోయారు. ఏప్రిల్ 1968 లో కేంద్ర మంత్రివర్గం నుండి రాజీనామా చేసారు. 1968లో ఢిల్లీ నుండి హైదరా బాదుకు తిరిగి రాగానే "తెలంగాణ ప్రజా సమితి" అనే పార్టీని నెలకొల్పి, ప్రత్యేక తెలంగాణ నిర్మాణం కొరకు పోరాటం సాగించారు. ఉద్యమాన్ని రాజకీయం చేసేందుకు చెన్నారెడ్డి తెలంగాణ ప్రజాసమితి అధ్యక్షుడయ్యారు. విభజనకు మద్దతిచ్చే ఆ పార్టీ 11 లోకసభ స్థానాలను (14 స్థానాల్లో) గెలుచు కోవడం ద్వారా ప్రజా ఆదరణ పొందింది. ఉత్తర ప్రదేశ్ (1970ల మధ్యలో రాష్ట్రపతి పాలన సమయంలో), రాజస్థాన్, పంజాబ్, తమిళనాడు మరియు పాండిచ్చేరి గవర్నర్‌గా కూడా ఉన్నారు. 1971లో సిక్స్ పాయింట్ ఫార్ములా రూపొందించిన ఘనత ఆయనదే. 1972లో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకి ఎన్నికలు జరిగినప్పుడు కాంగ్రెస్ మేనిఫెస్టోలో 'న్యూ డీల్ ఫర్ తెలంగాణ'గా చేర్చారు. డాక్టరు చెన్నారెడ్డి శక్తి సామర్థ్యా లను గుర్తించిన ఇందిరా గాంధీ, ఆయనను ఉ త్తరప్రదేశ్ గవర్నరుగా నియమించగా, 1974 అక్టోబరు 24వ తేదీన పదవీ స్వీకారం చేశారు. 1977 అక్టోబరులో గవర్నరు పదవివి రాజీనామా చేసి హైదరాబాదుకు తిరిగి వచ్చారు. దేశ పరిస్థితులను, వివిధ రాజకీయ పక్షాల తీరు తెన్నులను పరిశీలిం చారు. చివరకు కాంగ్రేసు (ఐ) పార్టీని తమ పార్టీ గా నిర్ణయించు కున్నారు. 1978 జనవరి 18 వ తేదీని రాష్ట్రకాంగ్రేసు (ఐ) అధ్యక్ష పదవిని స్వీకరించారు. 1978 ఫిబ్రవరిలో జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో డాక్టరు చెన్నారెడ్డి కృషి వలన కాంగ్రెస్ (ఐ) పార్టీ 180 స్థానాలు గెలుచు కొన్నది. అత్యధిక సంఖ్యాబలం గల కాంగ్రెస్ (ఐ) పార్టీ తరుపున డాక్టరు చెన్నారెడ్డి గారు 1978 మార్చి 6వ తేదీని ముఖ్యమంత్రి పదవిని అలంక రించారు. డిసెంబర్ 2,1996న చెన్నారెడ్డి మరణించారు. చెన్నారెడ్డి సమాధి హైదరాబాదులో ఇందిరా పార్కు ఆవరణలో ఉంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్ - 9440595494**

# తెలుగు భాషా గౌరవానికి ప్రతిష్ఠ: స్వతంత్ర తెలుగు విశ్వవిద్యాలయ చరిత్ర

## భాష, సాహిత్యం, జానపద కళలకు పునరుజ్జీవన కేంద్రం: తెలుగు విశ్వవిద్యాలయం

## డిసెంబర్ 2 ... తెలుగు విశ్వ విద్యాలయ స్థాపన దినం




1985లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక చారిత్రక నిర్ణయం తీసుకుంది తెలుగు భాషకు, సంస్కృతికి, వ్మాయానికి, జానపద సంపదకు, నాట్య%–%సంగీత సంప్రదాయాలకు ఒకే వేదికగా నిలిచే సమగ్ర సాంస్కృతిక విశ్వ విద్యాలయం అవసరమని తేల్చింది. దాని ఫలితంగానే 1985 డిసెంబర్ 2న చట్టం నెం.27 ద్వారా ఏర్పడింది పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం. తెలుగు రాష్ట్రాల జన ప్రియుడైన పొట్టి శ్రీరాములు పేరుతో ఈ సంస్థ ఏర్పడటమే కాదు, ఆయన త్యాగ స్ఫూర్తిని విద్యా రూపంలో నిలబెట్టడమే ఈ మహా సంస్థ ప్రథమ ధ్యేయంగా మారింది. ప్రారంభంలో హైదరాబాద్ నాంపల్లి ప్రాంతంలోని పాత భవనాల్లోని పరిమిత వసతులతో కార్యకలాపాలు మొదలైనప్పటికీ, త్వరితగతిన సుదీర్ఘ భవనాలు, పరిశోధనా కేంద్రాలు, కళా విభాగాలు, గ్రంథాలయాలు, నృత్య%–%సంగీత శిక్షణా మందిరాలతో ఒక సమగ్ర విద్యా నగరంగా అభివృద్ధి చెందింది. తెలుగు విశ్వవిద్యాలయం ఆవిర్భావానికి 1970–80 దశకాల్లో జరిగిన భాషా ఉద్యమాలు, సాహిత్య వేత్తల ప్రతిపాదనలు, జానపద పరిశోధనా వర్గాల నిరంతర చర్చలు మౌలిక కేంద్రమయ్యాయి. ఒక ప్రాంతీయ భాషను కేంద్రంగా చేసుకుని భాష–సాహిత్యాల నుండి నాట్య–సంగీతం వరకు, జానపద%–%రంగస్థల కళల నుండి పురావస్తు%–%పరిశోధన వరకు అన్నింటినీ ఏకం చేసే విశ్వవిద్యాలయం భారతదేశంలో లేనప్పుడు, ఈ సంస్థ ఆ లోటును తీర్చింది. 1985%–%90 మధ్య స్థాయిలో జానపద శాస్త్రం, అపర వేదాలు, పురాణ సంప్రదాయాలు, అనువాద శాస్త్రం, భాషా విజ్ఞానం, తెలుగు విమర్శ, నాట్య శాస్త్రం వంటి శాఖలు విస్తరించగా, 1990%–%2000 కాలంలో తెలుగు విశ్వ కోశం, నిఘంటు ప్రాజెక్టు, శాస్త్రీయ గ్రంథాల సంపాదన, వేద%–%ఆగమ%–%పురాణ పరిశోధనలు, గిరిజన జానపద పరిశోధనలు దేశవ్యాప్త గుర్తింపు పొందాయి. సుమారు 5000కు పైగా జానపద గేయాలు, 800కు పైగా సామెతలు, 150కు పైగా గిరిజన కథనాలు, 200కు పైగా పురాణ ప్రతులు ఈ రెండు దశాబ్దాల్లో డిజిటైజ్ చేయ బడ్డాయి. కళా శాస్త్రాల విభాగంగా ఏర్పడిన నృత్య%–%సంగీత పీఠం ఈ విశ్వవిద్యాలయ విజ్ఞానానికి నిలువెత్తు సాక్ష్యం. కూచిపూడి నృత్య విభాగం ప్రపంచ స్థాయిలో ప్రసిద్ధి చెందింది. భరతనాట్యం, పేరిణి శివ తాండవం, యక్షగానం, వీణ, మృదంగం, వయలిన్, బుర్రకథ, హరికథ వంటి శాస్త్రీయ మరియు జానపద కళలకు ఉచిత, ప్రామాణిక, ప్రాచీన గురుకుల శైలిలో శిక్షణ ఇచ్చే ప్రభుత్వ విశ్వ విద్యాలయం ఇది మాత్రమే. 1998%–%2024 మధ్య కూచిపూడి విభాగం నుంచి మాత్రమే 12 దేశాల్లో 400కుపైగా ప్రదర్శనలు జరిగాయి. యక్ష గాన విభాగం 120 ప్రదర్శనలు, వయలిన్%–%వీణ విభాగాల్లో 600కుపైగా విద్యార్థులు కళాసేవలో ప్రవేశించారు. పరిశోధన విభాగం మరో ప్రధాన అంశం. 1993లో ప్రారంభమైన తెలుగు మహాభారత పరిశోధన ప్రాజెక్టు 27 వేల శ్లోకాలను ప్రాచీన ప్రతులతో పోల్చి సవరించింది. తెలుగు విశ్వ కోశం ప్రాజెక్టు ఇప్పటి వరకు 38 వాల్యూములు ప్రచురించి 12 వేల పైచిలుకు అంశాలను శాస్త్రీయంగా నమోదు చేసింది. అక్షర భారతి నిఘంటు ప్రాజెక్టులో 1.25 లక్షల తెలుగు పదాలు భాషా వేత్తల పర్యవేక్షణలో శాస్త్రీయ వర్గీకరణకు గురయ్యాయి. జర్నల్ ఆఫ్ తెలుగు స్టడీస్ 1987 నుండి ప్రచురించ బడుతూ 150కుపైగా శాస్త్రీయ పరిశోధన పత్రాలను ప్రపంచ విద్యా సంస్థల నుంచి గుర్తింపుగా సాధించింది. విశ్వ విద్యాలయం విస్తరణ దశ 2006లో శ్రీశైలంలో శాఖ స్థాపనతో మొదలై, 2008లో కూచిపూడిలో ప్రత్యేక నృత్య కాంపస్, 2012లో రాజమండ్రి శాఖతో ముందుకు సాగింది. హైదరాబాద్ ప్రధాన క్యాంపస్‌లో భాషాశాస్త్ర పీఠం, తులనాత్మక సాహిత్య పీఠం, అనువాద పరిశోధన కేంద్రం, పురావస్తు కేంద్రం, ప్రసార%–%పాత్రికేయ విభాగం, జ్యోతిష%–%వాస్తు శాఖ, సంస్కృతి, పర్యటన అధ్యయన కేంద్రం, జానపద శాస్త్ర పీఠం, నాట్య%–%సంగీత%–%చిత్ర%–%శిల్ప%–%రంగస్థల కళల విభాగాలు సమగ్రంగా పనిచేస్తున్నాయి. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ 12బి గుర్తింపు తర్వాత మాత్రమే పెద్ద ఎత్తున ఉపాధ్యాయ నియామకాలు, పరిశోధన నిధులు, అంతర్జాతీయ ఒప్పందాలు విస్తరించాయి. ఢిల్లీ కేంద్ర భాషా సంస్థ, బెంగళూరు సంగీత విశ్వ విద్యాలయం, త్రివేంద్రం సంస్కృత యూనివర్సిటీ, తమిళనాడు మ్యూజిక్ యూనివర్సిటీతో కుదిరిన అవగాహనా ఒప్పందాలు విద్యా మార్పిడి, సంయుక్త శిబిరాలు, పరిశోధనలలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించాయి. ఈ విశ్వ విద్యాలయానికి ఉప కులపతులుగా పనిచేసిన తూమాటి దోణప్ప, సి. నారాయణరెడ్డి, నాయని కృష్ణకుమారి, ఎన్. గోపి, జి.వి. సుబ్రహ్మణ్యం, ఆవుల మంజులత, అనుమాండ్ల భూమయ్య, ఎల్లూరి శివారెడ్డి, ఎస్.వి. సత్యనారాయణ వంటి మహోన్నతులు తెలుగు విద్యా వేదికను శాస్త్రీయ పునాదులపై నిలిపారు. 2024 అక్టోబర్ 18న ప్రొఫెసర్ వెలుదండ నిత్యానందరావు ఉపకులపతిగా నియమితులై విద్యా%–%పరిశోధన విస్తరణకు నూతన దిశను అందిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం 2025 మార్చి 18న ఈ విశ్వవిద్యాలయానికి "సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం" అని పేరు మార్చడం ద్వారా ఆ మహనీయుని తెలుగు చరిత్ర%–%సాంస్కృతిక సమాచార నిర్మాణానికి చేసిన సేవకు శాశ్వత గౌరవం చేకూర్చింది. సురవరం రాసిన ఆంధ్రప్రదేశ్ చరిత్ర, వీర తెలంగాణ, గొల్లపూడి వీరుల కథనాలు వంటి గ్రంథాలు ఈ విశ్వ విద్యాలయం పరిశోధనాత్మక ఆత్మను ప్రతిబింబిస్తాయి. విద్యా, సాహిత్య, కళా రంగాల్లో విశ్వవిద్యాలయం అందించే పురస్కారాలు తెలుగుదేశం ప్రతిభకు అద్దం పడతాయి. తెలుగు విశిష్ట పురస్కారం, కళా బ్రహ్మ పురస్కారం, జానపద భూషణ పురస్కారం, సాహిత్య భూషణ, రంగస్థల యువ పురస్కారం వంటి అవార్డులు 1990%–%2024 మధ్య మొత్తం 230మందికి ప్రదానం చేయబడ్డాయి. చిన్న నాటక, బుర్రకథ, ఒగ్గు కథ, గాయక వర్గాలు, హరికథ, గ్రామీణ కళారూపాలకు విశ్వ విద్యాలయం ఇచ్చిన పునరుజ్జీవనం అద్భుతం. 30 ఏళ్లలో నశించి పోయే ప్రమాదంలో ఉన్న 40కు పైగా జానపద కళారూపాలు పునరుద్ధరించ బడినట్లుగా జానపద శాఖ రికార్డులు చెబుతున్నాయి. ఈరోజు, నాలుగు దశాబ్దాలు దాటిన ఈ విశ్వ విద్యాలయం కేవలం ఒక విద్యాసంస్థ కాదుతెలుగు భాషకు హృదయం, సంస్కృతికి ఊపిరి, సాహిత్యానికి వేద వాక్యం, కళలకు కర్పూర దీపం. భవిష్యత్ తరాలకు ఇది ఒక దిశానిర్దేశక గ్రంథంగా నిలుస్తోంది. 1985లో నాటి చిన్న నిర్ణయం, ఈరోజు తెలుగు జాతికి ఒక మహత్తర సాంస్కృతిక యుగం రూపంలో కనిపిస్తోంది. ఎందరో మహానుభావుల అవిరళ కృషి శాశ్వత చైతన్యంగా నిలిచి, తెలుగు భాష జీవన నదిని కాలాంతం వరకు ప్రవహింప జేస్తూనే ఉంటుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్ – 9440595494**




**అమరావతి: నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన దిత్వా తుపాను క్రమంగా బలహీనపడుతోందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. ఈ తుపాను గడిచిన ఆరు గంటల్లో గంటకు 5 కి.మీ వేగంతో నైరుతి బంగాళాఖాతం, పశ్చిమ మధ్య బంగాళాఖాతం, ఉత్తర తమిళనాడు, దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతం మీదుగా కదులుతోందన్నారు. దిత్వా తుపాను చెన్నైకి 50 కి.మీ, పుదుచ్చేరికి 130 కి.మీ, నెల్లూరుకి 200 కి.మీ దూరంలో కేంద్రీకృతమైందని, రాబోయే 12 గంటల్లో వాయుగుండంగా బలహీనపడే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. దీనివల్ల రాబోయే మూడ్రోజులు నెల్లూరు, చిత్తూరు, తిరుపతి, దక్షిణ కోస్తా జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని తెలిపారు.**

# ప్రేమతో ఇంటిని రాసిస్తే.. తాతనే వెళ్లగొట్టాడు

హైదరాబాద్: ప్రేమతో ఇల్లు రాసిస్తే.. అది తన సొంతమయ్యాక తాతనే ఇంట్లోంచి వెళ్లగొట్టాడో మనవడు.. అపాత్రదానం చేశానని గ్రహించిన ఆ తాత..న్యాయపోరాటం చేసి బహుమతిని రద్దు చేయించుకున్నారు. దీంతో ఇల్లు ఖాళీ చేయించాలంటూ మేడ్చల్ జిల్లా కలెక్టర్‌ను ఆయన అభ్యర్థించారు. రెండు నెలల క్రితం జరిగిన ఈ సంఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. సి.రాములు అనే 91 ఏళ్ల విశ్రాంత ఉపాధ్యాయుడు పదవీ విరమణప్పుడు, ఇతర ఆదాయంతో కీసర మండలం కొత్తపేట్‌లో ఒక ఇల్లు కొనుగోలు చేశారు. ఎనిమిదేళ్ల క్రితం రాములు కుమారుడు చనిపోయారు. దీంతో ఆయన ఇంటిని పెద్ద మనవడు శ్రీనివాస్‌కు 2018లో గిఫ్ట్‌డీడ్‌గా ఇచ్చారు. బహుమతిగా ఇంటిని పొందిన కొద్దినెలలకే మనవడు శ్రీనివాస్.. తన తాతయ్య రాములు, తల్లి, సోదరుడిని ఇంటి నుంచి వెళ్లగొట్టాడు. దీంతో ఆయన.. వృద్ధుల సంక్షేమ చట్టం-2007 ప్రకారం 2021లో మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. పలుమార్లు



విచారించిన అనంతరం జిల్లా కలెక్టర్ గిఫ్ట్ డీడ్‌ను రద్దు చేసింది. గిఫ్ట్‌డీడ్ రద్దుపై శ్రీనివాస్ హైకోర్టును ఆశ్రయించగా.. నాలుగేళ్లపాటు విచారించిన హైకోర్టు గిఫ్ట్‌డీడ్ రద్దు సబబేనంటూ రెండు నెలల క్రితం తీర్పు ప్రకటించింది.

**పోషించాలని ఎక్కడా లేదుగా..**

మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఆదేశాలను రాములు మనవడు శ్రీనివాస్ పాటించలేదు. తనకు తన తాత బహుమతిగా ఇంటిని రాసిచ్చిన పత్రాల్లో ఎక్కడా 'తాతను పోషించాలి' అంటూ నిబంధన లేదంటూ హైకోర్టును ఆశ్రయించారు. విచారణ సందర్భంగా జస్టిస్ పుల్లా కార్తిక్ ఇరువర్గాల వాదనలు విన్నారు. సుప్రీంకోర్టు తాజా తీర్పులను ఉటంకిస్తూ.. నిబంధన లేకపోయినా.. వృద్ధులను నిర్లక్ష్యం చేస్తే కఠిన శిక్షలు వేయడంతోపాటు బహుమతిని రద్దు చేసేందుకు ఆ కారణం సరిపోతుందని కొద్దిరోజుల క్రితం తీర్పు ప్రకటించారు. దీంతో అప్పటి కలెక్టర్ తీసుకున్న నిర్ణయం మేరకు ఇప్పుడు తనకు ఇల్లు ఇప్పించాలంటూ సి.రాములు మేడ్చల్ జిల్లా కలెక్టర్‌ను అభ్యర్థించారు.

# ఉచిత వైఫై వాడుతున్నారా?

హైదరాబాద్: నేటి డిజిటల్ యుగంలో అంతర్జాలం రోజువారీ అవసరంగా మారింది. వివిధ అవసరాల నిమిత్తం చాలామంది ఫ్రీ వైఫై వినియోగిస్తుంటారు. బస్టాండ్లు, షాపింగ్ మాల్స్, రైల్వేస్టేషన్లు, విమానాశ్రయాలు.. ఇలా పబ్లిక్ ప్లేస్‌లో ఫ్రీ వైఫై వాడేటప్పుడు అప్రమత్తంగా లేకపోతే పబ్లిక్ వై-ఫై వాడే సమయంలో డేటా చోరీ, ఆర్థిక మోసం జరిగే ప్రమాదం ఉందని భారత ప్రభుత్వ సైబర్ భద్రతా సంస్థ హెచ్చరించింది.



**నష్టాలు ఇవే..**

భద్రతా లోపం..: పబ్లిక్ వైఫైలో తగినంత భద్రత ఉండదు. హ్యాకర్లు మనల్ని మోసం చేయడానికి నకిలీ వైఫై నెట్‌వర్క్‌లను రూపొందిస్తుంటారు.డేటా చోరీ..: పబ్లిక్ వైఫైకి కనెక్ట్ అయిన వెంటనే హ్యాకర్లు మీ ఫోన్ పాస్‌వర్డ్‌లు, బ్యాంక్ అకౌంట్ వివరాలు, ఈ-మెయిల్స్ వంటి వాటిని సులభంగా అపహరించే ప్రమాదం ఎక్కువ.మీ ఫోన్‌లోకి వైరస్‌లను పంపి, సమాచారం సేకరించడం హ్యాకర్లకు చాలా సులభం. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే..: వీలైనంత వరకు పబ్లిక్ వైఫైని వాడకపోవడం ఉత్తమం. అత్యవసర పరిస్థితుల్లో వీపీఎన్ వాడటం ఉత్తమం. తద్వారా కొంత వరకు భద్రత లభిస్తుంది.

# విలీనమైతే లాభమా.. నష్టమా?

హైదరాబాద్: గ్రామాలను దగ్గర్లోని పురపాలికలు, నగరపాలక సంస్థల్లో కలిపేశారు. ఇప్పుడు ఆయా పట్టణ స్థానిక సంస్థ (యూఎల్‌బీ)లను తీసుకెళ్లి జీహెచ్‌ఎంసీలో విలీనం చేయబోతున్నారు. ప్రభుత్వ నిర్ణయంపై.. విలీనం కానున్న స్థానిక సంస్థల పరిధిలోని ప్రజలు తీవ్రంగా చర్చించుకుంటున్నారు. ప్రయోజనాలు, నష్టాలపై విశ్లేషణలు చేసుకుంటున్నారు. సర్కారు తీసుకున్న విలీన నిర్ణయంపై మెజార్టీ ప్రజలు సానుకూలంగా ఉన్నప్పటికీ.. జనాల్లో పలు రకాల చర్చలు జరుగుతున్నాయి.

రకరకాల ప్రశ్నలు.. గ్రేటర్‌లో విలీనం చేస్తే ఆస్తిపన్ను పెరుగుతుందా, మేము చెల్లించే పన్నులను వేరే ప్రాంతాల్లో ఖర్చు చేస్తారా? అని జనాలు రకరకాల ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. మణికొండ, నార్సింగి నగరపాలక సంస్థలకు ఆస్తిపన్ను ద్వారా ఎక్కువ ఆదాయం సమకూరుతుంది. జవహర్‌నగర్, జల్‌పల్లి, తుక్కుగూడ వంటివి ఆదాయ వనరులు లేక అవస్థ పడుతున్నాయి. ఇప్పుడు అన్నింటినీ గ్రేటర్‌లో కలిపేస్తే.. నిధులను ఎలా ఖర్చు చేస్తారోనని చర్చించుకుంటున్నారు.

**ముందున్న సవాళ్లు..**

నగరానికి చేరువగా ఉన్నప్పటికీ.. విలీన ప్రాంతాల్లో వందలాది గ్రామాలు ఉన్నాయి. వాటిని నగర అభివృద్ధిలో భాగస్వామ్యం చేసేటప్పుడు.. గ్రామీణ వాతావరణాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రణాళిక రూపొందించాల్సి ఉంటుంది. విశాల నగరం అయినప్పటికీ.. జన సాంద్రత ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకంగా ఉంది. మణికొండ, నార్సింగి ప్రాంతాల్లో జన సాంద్రత అధికం. పెద్దఅంబర్‌పేట్, ఘట్‌కేసర్, తుక్కుగూడ ప్రాంతాల్లో తక్కువ. వాటిని దృష్టిలో ఉంచుకుని.. అభివృద్ధి సమతూకంలో ఉండేట్టు అధికారులు జాగ్రత్త తీసుకోవాలి.

డివిజన్ల పునర్విభజన అనేక రాజకీయ, సామాజిక సవాళ్లను సృష్టిస్తుంది. వాటిని పరిష్కరించినప్పుడే.. ఎలాంటి దుమారం లేకుండా బృహత్‌నగర పరిపాలన గాడిలో పడుతుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# జర్నలిస్టుల సమస్యలను తక్షణం పరిష్కరించాలి

**-అడ్వర్టయిజ్మెంట్ల బకాయిలను చెల్లించాలి - జాప్యం చేస్తే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన**

**-టీడబ్ల్యూజేఎఫ్ కన్వీనర్ మామిడి సోమయ్య**

**-సమాచార భవన్ ఎదుట జర్నలిస్టుల భారీ ధర్నా**







చురకలు విలేఖరిహైదరాబాద్, డిసెంబర్ 01: తమ దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జర్నలిస్టులు సోమవారం హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ లోని రాష్ట్ర సమాచార శాఖ కమీషనరేట్ (సమాచారభవన్) ఎదుట ధర్నా నిర్వహించారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలకు చెంది అనేక మంది జర్నలిస్టులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని జర్నలిస్టులు ముక్తకంఠంతో నిరసించారు.సమస్యలను పరిష్కరించాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనింగ్ కమిటీ కన్వీనర్ మామిడి సోమయ్య ధర్నానుద్దేశించి మాట్లాడుతూ,రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేండ్లు కావస్తున్నా... జర్నలిస్టుల సమస్యలు ఏ ఒక్కటీ పరిష్కరించలేదని, కనీసం కొత్త అక్రెడిటేషన్ కార్డులు ఇచ్చే పరిస్థితిలో ప్రభుత్వం లేదని అన్నారు.

జర్నలిస్టులకు ఇస్తామన్న ఇళ్లస్థలాల ఊసే లేదని, కోర్టు తీర్పు సాకుతో ప్రభుత్వం కాలయాపన చేస్తుందని అన్నారు. ఆరోగ్య భీమా పథకాన్ని అటకెక్కించారని, చిన్న మధ్య తరహా పత్రికలను సంక్షోభంలో పడేసారని మామిడి సోమయ్య ధ్వజమెత్తారు. జర్నలిస్టులకు గత ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందంటే... అంతకంటే ఎక్కువగా ఈ ప్రభుత్వం అన్యాయం చేస్తోం దని అన్నారు. జర్నలిస్టుల సమస్యలను త్వరగా పరిష్కరిస్తామం టూ ముఖ్యమంత్రి, సమాచార శాఖ మంత్రి పలు మార్లు హామీలిచ్చారే తప్ప ఆచరణలో పెట్టలేదని, చివరికి జర్నలిస్టుల ప్రతినిధిగా ఉన్న మీడియా అకాడమీ ఛైర్మన్ కూడా కమిటీల పేరుతో కాలయాపన చేసి చివరికి చేతులెత్తేశారని విమర్శించారు. సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపుతూ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వడం లేదని, ఇది చాలా అన్యాయమని, ప్రత్యామ్నాయ జీవో ద్వారా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.జర్నలిస్టుల సమస్యల లో ప్రధానమైన ఇండ్ల స్థలాలు, అక్రెడిటేషన్ కార్డులు,హెల్త్ కార్డులతో పాటు జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ళలో ఉచిత విద్య, సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్, మహిళా జర్నలిస్టులకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని, చనిపోయిన జర్నలిస్టు కుటుంబానికి ప్రభుత్వం ఇస్తున్న లక్ష రూపాయల సహాయాన్ని రూ.10 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. చిన్న పత్రికలను ఎంపానెల్ లో చేర్చాలని, అడ్వర్టయిజ్మెంట్ పెంటింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని మామిడి సోమయ్య కోరారు. ఈ ధర్నాలో ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనింగ్ కమిటీ కో-కన్వీనర్లు పులిపలుపుల ఆనందం, వల్లాల జగన్, బండి విజయ్ కుమార్, తన్నీరు శ్రీనివాస్, ఆర్.వెంకటేశ్వర్లు, కుడుతాడి బాపురావు, ఎం.యాదగిరి, కె.పాండురంగారావు, వివిధ జిల్లాల నాయకులు కంతేటి రమాదేవి, పద్మనాభరావు, ఉదయ్ భాస్కర్ రెడ్డి, గిరిబాబు,అక్బర్ పాషా, పంతాటి రవీందర్, పి.గోపాల్, ఎం.గోపాల్, జక్కుల విజయకుమార్, స్వామిదాస్, మిట్టపల్లి మధు, సత్యగౌడ్, సత్యనారాయణ, శ్రీనివాస్ గౌడ్, పర్వతాలు, నీల నరేష్ , మల్లేష్, అశోక్,శంకర్, దప్పు రామస్వామి, శాంతి, సౌభాగ్యవతి, సుష్మ, మంజు లారెడ్డి, శివపార్వతి తదితరులు పాల్గొన్నారు. అనంతరం సమాచార పౌరసంబధాల శాఖ కమీషనర్ కు ఇచ్చే వినతి పత్రాన్ని జాయింట్ డైరెక్టర్ డీ ఎస్ జగన్ కు అందజేశారు. జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించేందుకు కృషి చేస్తానని జగన్ హామీ ఇచ్చారు.

# పాండవుల గుట్టపై కబ్జాదారుల కన్ను

కాల్వశ్రీరాంపూర్ : అక్రమార్కులు గుట్టలు, ప్రభుత్వ స్థలాల్లో ఇష్టారాజ్యంగా మొరం తవ్వకాలు చేపడుతున్నారు. గుట్టలు మాయమైపోతుండగా అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ స్థలంలో సుమారు 200 ఎకరాలకుపైగా విస్తీర్ణంలో పాండవుల గుట్ట క్రమంగా తరిగిపోతోంది. ఈ గుట్ట ప్రాంతంలో పోలీస్ స్టేషన్, మార్కెట్‌యార్డు, జూనియర్ కళాశాల, కస్తూర్బా పాఠశాల, రెండు పడక గదుల నిర్మాణం, రైతు వేదిక, పల్లె ప్రకృతివనం, విద్యుత్తు ఉప కేంద్రం, శ్రీజగత్ మహామునీశ్వర స్వామి ఆలయానికి, అయ్యప్ప దేవాలయానికి కొంత భూమి కేటాయించారుఈ ప్రాంతమంతా అక్రమ పట్టాలతో కొందరు, మరి కొందరూ ఎలాంటి పట్టా లేకున్నా కబ్జా చేసి సాగు చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

**పెద్దల అండదండలతో..**

వాస్తవంగా మట్టి తవ్వకాలు చేపట్టాలనుకునేవారు మొదట గనులశాఖకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. వివరాలు సవ్యంగా ఉంటే ఎన్‌ఓసీ(నో అబ్జక్షన్ సర్టిఫికెట్) సంబంధిత తహసీల్దార్‌కు పంపుతారు. అనంతరం గనులశాఖ, రెవెన్యూశాఖ అధికారులు కలిసి ఒకేసారి నిర్ణీత మట్టి తవ్వకాల ప్రదేశాన్ని సర్వే చేయాలి. ఇవన్నీ ఉంటే మట్టి తవ్వకాలకు అనుమతించగా మట్టికి రాయల్టీ రూపంలో నిర్ణీత రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఇవేమీ లేకుండా మండల కేంద్రంలో ప్రజాప్రతినిధులు, అధికారుల అండదండలతో మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగిపోతున్నాయి.

**రాయల్టీకి గండి**

ట్రాక్టర్లు కాకుండా లారీల్లో మట్టిని గృహాలు, వేడుక వేదికలు, వెంచర్ల ప్రదేశాలకు చేరవేస్తున్నారు. ఇలా నిబంధనలు విస్మరించడంతో ప్రభుత్వానికి రావాల్సిన రాయల్టీకి గండి పడుతోంది.

ఈ విషయంపై తహసీల్దార్ జగదీశ్వర్‌రావును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా పాండవుల గుట్ట ప్రాంతాన్ని సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటాం అని వివరించారు.

# మనసు పెట్టి.. పతకాలు కొట్టి



జగిత్యాల : 64 గడులపైనే మనసు కేంద్రీకరించి, నిర్దేశిత సమయంలో మెదడుకు పదును పెడితేనే చదరంగం ఆటలో విజయం వరిస్తుంది. అంతర్జాతీయ స్థాయికి ఎదగాలంటే కింది స్థాయి పోటీల నుంచే రాణించాలి. ఇటీవల జగిత్యాల పట్టణంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో స్విస్ లీగ్ విధానంలో రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచి పలువురు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. చాటిన క్రీడాకారుల నేపథ్యంతో కథనం..

**ఒకటో తరగతి నుంచే ఆసక్తి**

కరీంనగర్‌కు చెందిన కుమ్మరి సాధన తండ్రి సంతోష్‌కుమార్ ఎల్ఐసీలో ఉద్యోగి, తల్లి షారా ప్రభుత్వ ఉపాధ్యాయిని. ఒకటో తరగతి నుంచే ఆటపై ఆసక్తి పెంచుకుంది. చరవాణి సాయంతో నైపుణ్యం పెంచుకుంటోంది. ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయి రేటింగ్ 1416లో కొనసాగుతోంది. గతంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఏడేళ్లలోపు విభాగంలో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంది. గతేడాది జాతీయ స్థాయి పోటీల్లో ఏడో స్థానంలో, రాష్ట్ర స్థాయిలో అయిదో స్థానంలో నిలిచింది. గ్రాండ్‌మాస్టర్ కావడమే లక్ష్యమని సాధన చెబుతోంది.

గ్రాండ్‌మాస్టర్‌గా నిలవడమే ధ్యేయం

కరీంనగర్‌కు చెందిన వేముల అభిరామ్ పదో తరగతి చదువుతున్నాడు. తండ్రి రామకృష్ణ ప్రభుత్వ అధ్యాపకుడు, తల్లి పావని గృహిణి. నాలుగేళ్లుగా నిత్యం రెండున్నర గంటల పాటు సాధన చేస్తున్నాడు. ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయి రేటింగ్ 1462తో కొనసాగుతున్నాడు. జాతీయ స్థాయి, రాష్ట్ర స్థాయి పోటీల్లో రెండు సార్లు చొప్పున పాల్గొని ప్రతిభ చాటాడు. మార్వెల్ పోటీల్లో పతకం సొంతం చేసుకున్నాడు. ఎలక్ట్రికల్ ఇంజినీర్‌గా స్థిరపడటం, గ్రాండ్‌మాస్టర్‌గా నిలవడం జీవిత ధ్యేయమని పేర్కొన్నాడు.

నిరంతర సాధనతో గుర్తింపు

రంగారెడ్డి జిల్లాకు చెందిన గౌరికా ఎస్‌వీ పదో తరగతి చదువుతోంది. తండ్రి శివానంద్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కాగా, తల్లి శృతి బిహేవియర్ థెరపిస్ట్. ఏడాది కిందట రీజినల్ పోటీల్లో ప్రతిభతో గుర్తింపు పొందింది. నాటి నుంచి నిరంతర సాధనతో అంతర్జాతీయ స్థాయి రేటింగ్ 1480తో కొనసాగుతోంది. ఇప్పటివరకు ఐసీఎస్‌సీ జాతీయ స్థాయి పోటీల్లో రెండుసార్లు పాల్గొంది. జోనల్ స్థాయిలో బంగారు, రీజినల్ స్థాయిలో రజత పతకం సాధించిన గౌరికా గ్రాండ్‌మాస్టర్‌తో పాటు, వైద్యురాలిగా స్థిరపడటమే లక్ష్యమని చెబుతోంది.

# వాళ్లొస్తే డిగ్రీ.. వీళ్లొస్తే ఎంబీఏ

హైదరాబాద్: ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ కోర్సులకు అనుమతి పొందుతున్న కొన్ని ప్రైవేటు కళాశాలల యజమానులు ఒకే భవనంలో ప్రైవేటు వర్సిటీలు, ఇతర రాష్ట్రాల వర్సిటీల ఇంటిగ్రేటెడ్, ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు కొనసాగిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఓయూ అనుబంధ గుర్తింపున్న కళాశాలల్లో ఇలా ఇతర వర్సిటీల తరగతులు బోధించకూడదు. రాంనగర్‌లో సన్ డిగ్రీ కళాశాల యాజమాన్యం దిల్లీలోని ఓ విశ్వవిద్యాలయంతో ఒప్పందం కుదుర్చుకుని విద్యార్థులకు ప్రవేశాలు కల్పించి తరగతులు నిర్వహిస్తోంది.ఓయూ ఆడిట్ విభాగం ఇటీవల తనిఖీలు నిర్వహించి సన్ డిగ్రీ కళాశాలకు రూ.8 లక్షల జరిమానా విధించింది. సన్ డిగ్రీ కళాశాలతో పాటు గ్రేటర్ పరిధిలోని మరికొన్ని ప్రైవేటు కళాశాలలు అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలిసింది. ఓయూ అధికారులు వచ్చినప్పుడు ఆ భవనం డిగ్రీ కళాశాలగా మారిపోతుంది. ప్రైవేటు, ఇతర రాష్ట్రాల వర్సిటీల ప్రతినిధులు వెళ్లినప్పుడు ఎంబీఏ, ఎంసీఏ కళాశాల బోర్డు ఉంటుంది. ఈ అక్రమ వ్యవహారం ఇప్పటి వరకు గుట్టుగా సాగింది. ఓయూ అధికారులు కొందరు ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో అంతర్గతంగా సమాచారాన్ని సేకరిసున్నారు.



**ఎంబీఏ, ఎంసీఏలకు గుర్తింపు వర్తించకున్నా..** ఇతర రాష్ట్రాల వర్సిటీలతో ఒప్పందం కుదుర్చుకుంటున్న ప్రైవేటు కళాశాలల యజమానులు అదే భవనంలో ఎంబీఏ, ఎంసీఏ, ఇంటిగ్రేటెడ్ కోర్సులను నిర్వహిస్తున్నారు. రికార్డుల ప్రకారం ఆయా కోర్సులు చదువుకుంటున్న వారు ఓయూ పరిధిలోకి రారు. గ్రేటర్ హైదరాబాద్‌లో చదువుకుంటున్నా ప్రైవేటు, ఇతర రాష్ట్రాల్లో చదువుతున్నట్లు గానే వ్యవహరిస్తారు.

**కఠిన చర్యలు తీసుకుంటాం**

ఓయూ పరిధిలో కొన్ని ప్రైవేటు డిగ్రీ కళాశాలల భవనాల్లో ఇతర రాష్ట్రాల వర్సిటీలకు చెందిన ఎంబీఏ , ఇంటిగ్రేటెడ్ కాలేజీలు ఉన్నట్లు మా దృష్టికి వచ్చింది. నిబంధనలు పాటించని యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటాం.ఇకపై ఆకస్మిక తనిఖీలు చేస్తాం.

ఆచార్య కుమార్ మొలుగరం, ఉపకులపతి, ఓయూ

# బషీరాబాద్.. కన్నడిగుల జిందాబాద్

బషీరాబాద్ : రాష్ట్రం వేరైనా వర్తకం మాత్రం ఇక్కడికే అంటున్నారు.. కర్ణాటక రాష్ట్ర సరిహద్దు ప్రజలు. నిత్యం బషీరాబాద్ మండల కేంద్రానికి వచ్చి వివిధ పనులు చేసుకొని వెళతారు. నిజాం పాలనలో కలబురిగి (గుల్బర్గా) రాష్ట్రం ఉండగా.. బషీరాబాద్ జిల్లా కేంద్రం ఉండేది. అప్పటి నుంచే బషీరాబాద్‌లోనే అన్ని పనులు చేసుకోవడం అలవాటుగా మారిందని వివరిస్తున్నారు.

**ప్రసవాలు ఇక్కడే..**

బషీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రతి రోజు స్థానిక రోగులతోపాటు కర్ణాటకకు చెందిన వారు సేవలు పొందుతున్నారు. ప్రాంతీయ భేదం లేకుండా సేవలు అందిస్తున్నామని వైద్యులు అంటున్నారు. రోజూ



80-100 మందిలో 25 మంది పొరుగు రాష్ట్రం రోగులు వైద్య సేవలు పొందుతున్నారు. హల్కోడ, వెంకటాపూర్, పోతంగల్, జెట్టూరు, అయ్యాలం మహిళలు ప్రసవాలకు బషీరాబాద్‌కు వస్తున్నారు. ప్రతి మంగళవారం సంత రోజున బషీరాబాద్ నుంచి ఆయా గ్రామాలకు ప్రత్యేకంగా ఆటోలు, జీపులు నడిపిస్తారు. కూరగాయలు, నిత్యావసర వస్తువుల కొనుగోలుకు ప్రతిరోజు వందల సంఖ్యలో వస్తున్నారు.

**ఊరక్కడ.. భూములు ఇక్కడ**

జీవన్గీ, బషీరాబాద్, ఇందర్‌చేడ్, గంగ్వార్, క్యాద్గిర గ్రామాల పరిధిలో కర్ణాటక రైతులకు భూములున్నాయి. తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ శాఖ నుంచి అందించే రైతుబంధు, ఇతర పథకాలను సైతం కన్నడిగులు సద్వినియోగం చేసుకుంటున్నారు. వ్యవసాయ ఉత్పత్తులను బషీరాబాద్, తాండూరు విపణికి తీసుకొచ్చి విక్రయాలు చేస్తున్నారు.

# బాల్యంలో లగ్గం.. అధికారుల పగ్గం

తాండూరు :"మేళ తాళాల మధ్య మాంగల్యం తంతునానేనా అని పెళ్లి మంత్రం ఎక్కడి నుంచైనా వినిపిస్తే ఆహా ఎంత శుభకరం.. అని భావిస్తుంటాం. కానీ బాల్యం ముగియకుండానే వివాహాలు చేయడమనేది ఆరోగ్యపరంగా అశుభకరం." జిల్లాలోని స్త్రీ శిశు సంక్షేమ శాఖ, బాలల హక్కుల పరిరక్షణ కమిటీ, ఛైల్డ్‌లైన్ బృందాలు బాల్యవివాహాల నిర్మూలనే లక్ష్యంగా చేపట్టిన కట్టుదిట్టమైన నిఘా, గ్రామీణ స్థాయిలో కొనసాగుతున్న అవగాహన కార్యక్రమాలు సత్ఫలితాలిస్తున్నాయి. నాలుగు సంవత్సరాల వ్యవధిలో ఏకంగా 430బాల్య వివాహాలను అడ్డుకోవడం విశేషం. గ్రామాల్లో వాలంటీర్లు, ఆశ కార్యకర్తలు, బాలల సంక్షేమ కమిటీ సభ్యులు ఇస్తున్న సమాచారంతో అధికారులు వెంటనే స్పందించడంతో బాలల భవితకు బాటలు పడేందుకు తోడ్పడింది.

**అవగాహన సదస్సులతో..**

తాండూరు పట్టణాన్ని ఆనుకొని ఉన్న గ్రామానికి చెందిన బాలికతో మరో గ్రామానికి చెందిన యువకుడు ఇటీవల బాల్య వివాహం చేసేందుకు ఏర్పాట్లు చేయగా.. ఐసీడీఎస్ అధికారులు వెళ్లి నిలువరించారు. బాలికను సఖీ కేంద్రానికి తరలించారు.ః చెంగోల్‌లో ఆరు బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేశారు. బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలు, ఆరోగ్యపరమైన సమస్యలను తల్లిదండ్రులకు వివరించి పెళ్లి ఆలోచనను విరమింపజేశారు.

**చట్టం ప్రకారం శిక్షార్హం**

బాలికలు మేజర్ అయితే విద్య, ఉపాధి అవకాశాలపై స్పష్టత వస్తుంది. జీవితంలో ఉన్నత లక్ష్యాలను చేరుకుంటారు. ఈక్రమంలో బాల్య వివాహాలను గ్రామస్థాయిలో నిలువరించడానికి సమాచార నెట్‌వర్క్‌ను బలంగా ఏర్పాటు చేసుకున్నాం. అవగాహన సదస్సుల్లో అంగన్‌వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు, మహిళా సంఘాలు, రెవెన్యూ, పోలీసు యంత్రాంగం యువజన సంఘాలు తోడ్పాటు అందిస్తున్నాయి. వధువుకు 18 ఏళ్లు, వరుడుకి 21 సంవత్సరాల వయస్సు నిండితేనే వివాహం జరిపించాలి.వెంకటేషం, బాలల సంక్షేమ కమిటీ జిల్లా ఛైర్‌పర్సన్

చరకలు



## అతివలు రయ్...రయ్

పెద్దపల్లి : పలు రంగాల్లో రాణిస్తున్న మహిళలు వాహన డ్రైవింగ్‌పైనా ఆసక్తి చూపుతున్నారు. ద్విచక్ర, కార్లు నడపడానికి వీలుగా శిక్షణ కేంద్రాల బాట పడుతున్నారు. ఇష్టంతో శిక్షణ పొంది సొంతంగా వాహనాలను రోడ్లపై పరుగు తీయిస్తూ పనులు చేసుకుంటున్నారు.

**ఏటా లైసెన్సుల పెరుగుదల**

జిల్లాలో 9 లక్షల జనాభా ఉంది. వీరిలో సగానికిపైగా మహిళలు ఉన్నారు. ప్రైవేటు ఉద్యోగాల్లో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారు. రామగుండం, పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ పట్టణాల్లో డ్రైవింగ్ శిక్షణ కేంద్రాల్లో మెలకువలు నేర్చుకుంటున్నారు. రవాణాశాఖ నివేదిక ఆధారంగా వాహనాల లైసెన్స్‌లు తీసుకోవడంతో మహిళలు ఆసక్తి కనబరుస్తున్నారు. మూడేళ్ల గణంకాలు పరిశీలిస్తే ఈ సంఖ్య ఏటికేడు పెరుగుతోంది. జిల్లాలో సుమారు 15 శాతం లైసెన్సులు మహిళలు పొందుతున్నారు.

**ఆత్మవిశ్వాసం పెరిగింది**

నా భర్త ప్రభుత్వ ఉద్యోగి. ప్రతీ సమయంలో అందుబాటులో ఉండటం కొద్దిగా కష్టం. అత్యవసర పరిస్థితుల్లో ఇతరులపై ఆధారపడకుండా డ్రైవింగ్‌లో శిక్షణ పొందుతున్నా. దీంతో కారులో వెళ్లి నా కొడుకును పాఠశాల నుంచి తీసుకురావచ్చు. ఈ శిక్షణతో నాలో మరింత ఆత్మ విశ్వాసం పెరిగింది. - కళావతి

## ఎన్నాళ్లకెన్నేళ్లకు.. దేవుని సేవకు..

ఖమ్మం : దేవతామూర్తులకు శాస్త్ర, సంప్రదాయ సేవలు మరింతగా అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం దేవాదాయ, ధర్మాదాయశాఖ పరిధిలోని దేవాలయాల్లో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని నిర్ణయించింది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో అనేక ఏళ్ల తర్వాత దేవాలయాల్లో రెగ్యులర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. తద్వారా ఎనిమిది దేవాలయాల్లోని 19 పోస్టులు భర్తీ కానున్నాయి.

**భర్తీకానున్న పోస్టులు**

దేవాలయాల్లో వేద పారాయణదారులు, అర్చకులు, పంచారిక(గర్భాలయం శుభ్రం చేసేవారు), పాచక(వంట వండేవారు), సహాయ పాచక, డోలు, సన్నాయి, శ్రుతి వాయిద్యకారుల పోస్టులను అధికారులు భర్తీ చేయనున్నారు. ఎర్రుపాలెం మండలం జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి, ఖమ్మం కాల్వొడ్డు శ్రీసత్యనారాయణ సహిత శ్రీవీరాంజనేయస్వామి, కూసుమంచి మండలం జీళ్లచెర్వు శ్రీవెంకటేశ్వరస్వామి, పెనుబల్లి శ్రీనీలాదీశ్వరస్వామి, వేంసూరు మండలం కందుకూరు శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం, పాల్వంచ పెద్దమ్మ తల్లి గుడి, అశ్వారావుపేట మండలం వినాయకపురం శ్రీచిలకలగండి ముత్యాలమ్మ తల్లి, అన్నపురెడ్డిపల్లి మండలం శ్రీబాలాజీ వెంకటేశ్వరస్వామి దేవాలయాల్లోని 19 ఖాళీ పోస్టుల భర్తీకి సంబంధిత ఈఓలు నోటిఫికేషన్లు విడుదల చేశారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ప్రారంభించారు.



**ఇవీ అర్హతలు..**

అభ్యర్థులు తెలంగాణకు చెందిన వారై ఉండాలి. 18 నుంచి 40ఏళ్ల వయస్సు కలిగినవారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. నోటిఫికేషన్ విడుదల చేసిన నాటి నుంచి 20రోజుల పాటు సంబంధిత దేవాలయాల్లో ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులు సమర్పించాలి. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ పూర్తయిన తర్వాత వాటిని దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయానికి ఈఓలు పంపిస్తారు. దరఖాస్తులను సహాయ కమిషనర్ కార్యాలయంలో ఓ కమిటీ పరిశీలిస్తుంది. అక్కడి నుంచి దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయానికి దరఖాస్తులు చేరుతాయి. ఆ తర్వాత నోటిఫికేషన్ విడుదల చేసి రాత, ప్రాక్టికల్ పరీక్షలతో పాటు ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారిని ఉద్యోగాలకు ఎంపిక చేస్తారు. 'ఆసక్తి కలిగిన అభ్యర్థులు 20 రోజుల్లోపు సంబంధిత దేవాలయాల్లో దరఖాస్తులు సమర్పించాలి. ఉభయ జిల్లాల్లో ఆదాయం కలిగిన ఆలయాలు 86 ఉంటే, ఎనిమిదింటిలో ఖాళీ పోస్టులను భర్తీ చేయనున్నాం' అని దేవాదాయశాఖ సహాయ కమిషనర్ ఎం.వీరాస్వామి కు తెలిపారు.

## వాటా.. ఆదాయ ఊట..!

అశ్వారావుపేట : ఆయిల్‌ఫెడ్‌లో ముడిచమురు, గింజలతో పాటు కెర్నల్ ఆయిల్ ద్వారా సమకూరే ఆదాయంలోనూ రైతులకు వాటా ఇవ్వాలనే రైతు సంఘాల డిమాండ్‌కు నూనెగింజల సంస్థ తొలిసారి సానుకూలంగా స్పందించింది. దీనిపై కేంద్రానికి లేఖ రాయాలని, అధ్యయనం చేయాలని నిర్ణయించింది. హైదరాబాద్‌లో బుధవారం జరిగిన ఓఈఆర్ నిర్ణయ సమావేశంలో దీనిపై ప్రైవేటు పరిశ్రమలు తీవ్రస్థాయిలో వ్యతిరేకించినా రైతుసంఘాల ప్రతినిధులు పట్టుబట్టడంతో ఆయిల్‌ఫెడ్ స్పందించింది.

**అప్పారావుపేట పరిశ్రమలో రెండేళ్లుగా..**

ఆయిల్‌పాం గెలలను గానుగ ఆడిస్తే గింజలు వేరవుతాయి. ఖాళీగెలలు వేరుగా వస్తాయి. ఈ క్రమంలో ముడిచమురు తయారవుతుంది. గింజలను ప్రైవేటు పరిశ్రమలు కొనుగోలు చేస్తుంటాయి. అదే గింజల నుంచి ఆయిల్(కెర్నల్) తీసే విధానాన్ని దమ్మపేట మండలం అప్పారావుపేటలో టీజీ ఆయిల్‌ఫెడ్ రెండేళ్ల క్రితం ప్రారంభించింది. ప్రస్తుతం టన్ను ఆయిల్‌పాం గెలల ధర రూ.19,681 పలుకుతోంది. గానుగ ఆడగా వచ్చిన గింజల టన్ను ధర రూ.32వేలు ఉంది. గింజల నుంచి తయారయ్యే కెర్నల్ ఆయిల్ టన్ను ధర రూ.2.10లక్షలు పలుకుతోంది. అందుకే రైతులు కెర్నల్ ఆయిల్ ద్వారా సమకూరే ఆదాయంలోనూ వాటా కావాలని డిమాండ్ చేస్తున్నారు. గతేడాది 29వేల టన్నుల గింజలు గానుగ ఆడగా 5వేల టన్నుల కెర్నల్ ఆయిల్ వచ్చింది. ప్రస్తుతం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో 30వేల మంది రైతులు సుమారు 1.20లక్షల ఎకరాల్లో ఆయిల్‌పాం తోటలు పెంచుతున్నారు.

**కెర్నల్ ఆయిల్ వినియోగం ఇలా..**

కెర్నల్ ఆయిల్‌ను కాస్మోటిక్స్, బేకరీ పదార్థాల్లో అత్యధికంగా వాడుతుంటారు. ఆహార పరిశ్రమలు, సబ్బులు, లోషన్లు, క్రీమ్‌లు, కొన్ని రకాల ఔషధాల తయారీలో వినియోగిస్తారు. దీనిని బయోఫ్యూయల్‌గానూ వాడతారు. అందుకే కెర్నల్ ఆయిల్‌కు డిమాండ్ అధికంగా ఉంటోంది. కెర్నల్ ఆయిల్ ద్వారా పొందే రాబడిలో రైతులకు వాటా ఇవ్వాలని ఆయిల్‌పాం రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రామచంద్రప్రసాద్, రైతు సంఘాల ప్రతినిధులు మూడేళ్లుగా కోరుతున్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఆయిల్‌ఫెడ్ ఛైర్మన్ జంగా రాఘవరెడ్డి, వ్యవసాయ, ఉద్యాన ప్రధాన కార్యదర్శి, టీజీ ఆయిల్‌ఫెడ్ ఎండీకి పలుమార్లు వినతిపత్రాలు సమర్పించారు. దీనిపై కేంద్రానికి లేఖ రాయాలని, అధ్యయనం చేయాలని ఆయిల్‌ఫెడ్ నిర్ణయించటంతో ఆయిల్‌పాం రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# మరో కొత్త అడుగు



గోదావరిఖని: గ్రీన్ ఎనర్జీ వైపు అడుగులు వేస్తున్న సింగరేణి పంపుడ్ స్టోరేజీ పవర్ ప్లాంట్(పీఎస్‌పీపీ) ఏర్పాటుకు సర్వే ప్రక్రియ చేపట్టింది. ప్లాంట్ నిర్మాణం కోసం వ్యాప్కోస్ సంస్థకు అధ్యయన బాధ్యతలు అప్పగించింది. సింగరేణికి చెందిన మేడిపల్లి ఓసీపీని నాలుగేళ్ల కిందట మూసివేశారు. క్వారీలో ఉన్న నీటిని సద్వినియోగం చేసుకొని హైడల్ విధానంలో విద్యుత్తు ఉత్పత్తి చేసేందుకు ప్రణాళికలు చేశారు. దీని కోసం క్వారీలో ఉన్న జలాశయంతో పాటు ఉపరితలంలో మరో జలాశయం నిర్మించి మోటార్ల ద్వారా నీటిని ఎత్తిపోసే విధంగా చర్యలు చేపట్టనున్నారు. ఈ ప్రక్రియ ద్వారా విద్యుత్తు ఉత్పత్తి చేయాలని భావించారు. రూ.2,535 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే కేంద్రంలో ఏటా 1560 మిలియన్ యూనిట్ల విద్యుత్తును ఉత్పత్తి చేయనున్నారు. 500 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మించనున్న ప్లాంట్ ద్వారా సింగరేణికి ఆదాయం సమకూరుతుందని ఆశిస్తున్నారు.

**పగలంతా సౌర విద్యుత్తు** నీటిని ఎత్తిపోసేందుకు నడిపించే యంత్రాలకు సౌరవిద్యుత్తును వినియో గించనున్నారు. దీనికి సంస్థకు చెందిన సౌర విద్యుత్తును సరఫరా చేయనున్నారు. 150 మీటర్ల ఎత్తులోకి నీటిని పంపింగ్ చేసి అక్కడి నుంచి కిందకు జారవిడిచే విధంగా ప్రాజెక్టును రూపొందించారు. నీటిని కిందికి వదిలే సమయంలో జనరేటర్ల ద్వారా విద్యుత్తును ఉత్పత్తి చేస్తారు. ఉత్పత్తయ్యే విద్యుత్తును డిమాండ్ సమయంలో విక్రయించడం ద్వారా లాభం వస్తుందని సంస్థ అంచనా వేసింది. విద్యుత్తు డిమాండ్ సమయంలో ఒక యూనిట్ రూ.9 వరకు కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది. ఈ ప్లాంట్ ద్వారా ఒక యూనిట్ విద్యుత్తు ఉత్పత్తికి రూ.7 వరకు ఖర్చు వస్తుంది. విద్యుత్తు డిమాండ్ సమయంలో అమ్మడం ద్వారా ఒక యూనిట్‌కు రూ.2 లాభం వచ్చే అవకాశం ఉంటుందని సింగరేణి ప్రణాళికలు వేసింది.

**అధ్యయనం పూర్తికాగానే పనులు**వ్యాప్కోస్ సంస్థ అధ్యయనం పూర్తి చేయగానే టెండరు ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించే అవకాశం ఉంది. 0.40 టీఎంసీల నీటిని నిల్వ చేసేందుకు 260 ఎకరాల విస్తీర్ణంలో జలాశయాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. హైడల్ ప్రాజెక్టు మాదిరిగా ఎత్తిపోసే నీటికి అనుగుణంగా జనరేటర్లను అమర్చాలి. వీటికి సంబంధించిన పనులు త్వరలోనే మొదలు పెట్టేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే థర్మల్‌తో పాటు సౌర విద్యుత్తు కేంద్రాలను ఏర్పాటు చేసిన సింగరేణి బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్(బీఈఎస్‌ఎస్)తో విద్యుత్తును నిల్వ చేసే విధానాన్ని కూడా అందుబాటులోకి తీసుకువస్తోంది. విద్యుత్తు ఉత్పత్తి రంగంలో పీఎస్‌పీపీ ద్వారా మరో కొత్త అడుగు పడనుంది.

# అప్పులకు వడ్డీలు.. అసంపూర్తి నిర్మాణాలు



ముస్తాబాద్ : గత ప్రభుత్వ హయాంలో నిర్మించుకున్న రెండు పడక గదుల ఇళ్లకు బిల్లులు రాక లబ్ధిదారులు అప్పుల్లో కూరుకుపోయారు. జిల్లాలోని గ్రామాల్లో సొంత స్థలం ఉండి.. ఇల్లు నిర్మించుకోవటానికి ముందుకు వచ్చేవారికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని అప్పటి సర్పంచులు నాటి మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్‌ను కోరారు. ఆయన అప్పటి జిల్లా కలెక్టర్‌కు ఆదేశించగా.. గ్రామసభలు నిర్వహించి సొంత స్థలం ఉన్న పేద, మధ్యతరగతి వారిని గుర్తించి లబ్ధిదారులను ఎంపిక చేశారు. వారు అప్పులు తెచ్చి నిర్మాణాలు ప్రారంభించారు. దాదాపు 6 ఏళ్లు గడస్తుండగా.. వడ్డీలు పెరిగిపోతున్నాయి కానీ బిల్లులు రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముస్తాబాద్, మద్దికుంట, మోహినికుంట, చిప్పలపల్లి, పోత్గల్, గూడెం, కొండాపూర్ గ్రామాలకు రెండు పడక గదుల ఇళ్లు మంజూరు చేశారు. దాదాపు 2018-19 సంవత్సరంలో నిర్మాణాలు ప్రారంభించారు. రూ.5 లక్షలు సరిపోవని మరో రూ.5లక్షలు పెంచితే బాగుంటుందని లబ్ధిదారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అది అంతలోనే ఆగిపోయింది.

**గ్రామాలవారీగా ఇలా..**

ఆవునూర్ గ్రామంలో 28 మంది లబ్ధిదారులు ప్రైవేటు ఫైనాన్స్‌లో రుణాలు తీసుకుని నిర్మాణాలు చేపట్టారు. ఒక బిల్లు కూడా మంజూరు కాలేదు. ఇంటి నిర్మాణం పూర్తికాక.. బిల్లు రాక.. ఇబ్బంది పడుతున్నామని వాపోతున్నారు.

సేవాలాల్‌తండాలో 8 మంది ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. వారికి బిల్లులు వచ్చిన దాఖలాలులేవు.

తెర్లుమద్దిలో 17 మంది వరకు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించుకున్నారు. కొందరికి 1 నుంచి 3 బిల్లుల వరకు మాత్రమే వచ్చాయి.

వెంకట్రావుపల్లె 20 రెండు పడక గదుల ఇళ్లకు... ముగ్గురు లబ్ధిదారులు పనులు ప్రారంభించారు.

తుర్కపల్లె గ్రామంలో 24 మంది ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. నలుగురికి అసలే బిల్లులు రాలేదన్నారు.

బందనకల్‌లో 12 మంది నిర్మాణాలు ప్రారంభించారు. పూర్తిస్థాయిలో బిల్లులు రాక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

మొర్రాయిపల్లెలో 7 ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. బిల్లులు మంజూరైన దాఖలాలు లేవు.

చీకోడ్‌లో 48 ఇళ్లు మంజూరు కాగా.. ఒక్కరు నిర్మించుకోలేదు.

అధికారులు ఎంబీ రికార్డు చేయాలి. దీనికి ఈవోటీ(ఎక్స్‌టెన్షన్ ఆఫ్ టైమ్) అడుగుతున్నారంటూ లబ్ధిదారులు అంటున్నారు. ఈవోటీ ఇప్పించి బిల్లులు వచ్చేలా అధికారులను లబ్ధిదారులు వేడుకొంటున్నారు.

రూ.15లక్షలు ఖర్చు.. ఒక్క బిల్లు రాలే

ఇంటి నిర్మాణానికి ఇప్పటికే రూ.15లక్షల వరకు ఖర్చు అయింది. ఇంతవరకు ఒక్క బిల్లు రాలేదు. దీంతో అసంపూర్తిగానే మిగిలిపోయింది. బిల్లుల కోసం అప్పటి సర్పంచి వద్దకు, ప్రజావాణిలో పలుమార్లు వినతి పత్రం అందించాం. నేను బీడీలు చుట్టేదాన్ని.. అనారోగ్యంతో ఇప్పుడు చేయటం లేదు. భర్త కూలి. తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయి.

- ప్యారం సత్తవ్వ, ఆవునూర్

# లోతట్టు వారధి.. పాలకుల పట్టింపేది!



జగిత్యాల : జగిత్యాల గ్రామీణ మండలం అనంతారం వద్ద జాతీయ రహదారిపై లోలెవెల్ వంతెనతో వాహనదారులకు ఇబ్బందులు తీవ్రమయ్యాయి. ఏళ్ల తరబడి ఇదే సమస్య ఉన్నా పాలకులు పట్టించుకోవడం లేదు. జగిత్యాల-మంచిర్యాల మార్గంలో 63వ న్యబరు జాతీయ రహదారిపై 60 ఏళ్ల కిందట నిర్మించిన లోతట్టు వంతెన శిథిలావస్థకు చేరింది. వారధికి ఇరువైపులా దిమ్మెలు వరద ధాటికి కొట్టుకుపోయాయి. రాత్రి వేళ వాహనాలు అదుపు తప్పి వాగులో పడిపోయే ప్రమాదం ఉంది.

**50 గ్రామాలకు ఇదే మార్గం**

వాస్తవానికి ఈ రహదారిపై వంతెన నిర్మించాల్సిన బాధ్యత జాతీయ రహదారి సంస్థదే. కాగా ఆర్మూర్ నుంచి జగ్దల్‌పూర్ వరకు గ్రీన్ కారిడార్ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో మార్గాన్ని పూర్తి మార్చారు. ఈ మేరకు జగిత్యాల మండలం పొలాస దాటిన తర్వాత అనంతారం పెద్దమ్మ గుడి సమీపం నుంచి యశ్వంతరావుపేట, మద్దునూరు మీదుగా రాయపట్నం చేరుకునేలా కొత్తగా రహదారి నిర్మించనున్నారు.

ఇందులో భాగంగా భూసేకరణ చేపట్టారు. త్వరలోనే గ్రీన్ కారిడార్ హైవే నిర్మాణం ప్రారంభం కానుండగా పాత మార్గంలోని వంతెనను జాతీయ రహదారి అభివృద్ధి సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) పట్టించుకోవడం లేదు.

సమస్యను స్థానిక ఎంపీ ధర్మపురి అర్వింద్ దృష్టికి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ తీసుకెళ్లారు. కాగా ఎలాంటి ముందడుగు పడలేదు. వాస్తవానికి మార్గాన్ని మార్చి జాతీయ రహదారి నిర్మిస్తున్నా అనంతారం వద్ద పూర్తి స్థాయి వంతెన నిర్మించాల్సిందే.

జగిత్యాల నుంచి ధర్మపురి, బుగ్గారం తదితర మండలాల్లోని 50 గ్రామాలకు ఇదే మార్గంలో వెళ్లాల్సి ఉంటుంది. జాతీయ రహదారి సంస్థ స్పందించని నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వమైనా నిధులు కేటాయించి వారధి నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా జాతీయ రహదారి సంస్థ రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించగానే నిధులు కేటాయించి వంతెన నిర్మాణం పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## ఆధ్యాత్మిక గ్రామం.. స్థానిక కోలాహలం

భద్రాచలం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనే అత్యంత పెద్ద మేజర్ గ్రామ పంచాయతీ అయిన భద్రాచలంలో పాగా వేసేందుకు రాజకీయ పార్టీలు తెర వెనుక వ్యూహరచన చేస్తున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా తొలి విడతలోనే దీనికి పోలింగ్ జరగనుంది. ఇందుకు సంబంధించి నామినేషన్ల స్వీకరణకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇక్కడ 40,761 మంది ఓటర్లు, 20 వార్డులు ఉండడంతో 60 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేస్తున్నారు. ఒక పంచాయతీలో ఈ స్థాయి ఓటర్లు ఉండటం ప్రత్యేకతను చాటుతోంది. గిరిజన జనరల్ అభ్యర్థికి సర్పంచి స్థానం కేటాయించడంతో ఎస్టీ మహిళ, పురుషుల్లో ఆశావహులు బరిలో నిలిచేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. భద్రాచలంతో పాటు బూర్గంపాడు మండలం సారపాకలోనూ ఎన్నికల కోలాహలం కనిపిస్తోంది. ఈ జంట పట్టణాలకు తెలంగాణ ఏర్పడిన తర్వాత ఇదే



తొలి ఎన్నిక కావటంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది.

**గోడకు కొట్టిన బంతిలా...**

భద్రాచలం పేరు ప్రపంచవ్యాప్తంగా పరిచయం. ఇది దక్షిణ అయోధ్యగా కీర్తి పొందింది. ఇలాంటి చోట 1987 నుంచి సర్పంచి ఎన్నికలకు న్యాయపరమైన చిక్కులు తలెత్తాయి. సుదీర్ఘ విరామం వచ్చింది. 2001లో టౌన్‌షిప్ అవడంతో ఐదేళ్లకు మించి పాలన సాగలేదు. దీన్ని రద్దు చేసి 2005లో మున్సిపాలిటీ చేశారు. పురపాలికను ఐదేళ్లు కొనసాగించకుండా న్యాయపరమైన అంశాలతో రద్దు చేశారు. ఈ పరిస్థితుల్లో 2013లో సర్పంచిని ఎన్నుకోగా 2018 వరకు కొనసాగారు. ఆ తర్వాత మళ్లీ మున్సిపాలిటీ చేస్తారని కొంతకాలం ఎన్నికలు నిర్వహించలేదు. ఈలోగా మూడు పంచాయతీలను చేయటంతో ఇది వివాదాస్పదమైంది. ఆ తర్వాత మూడు పంచాయ తీలను రద్దు చేసి భద్రాచలాన్ని ఒక్కటే పంచాయతీగా ఉంచారు. ఇలా గోడకు కొట్టిన బంతిలా భద్రాచలం మారింది. ఈసారి ఓట్ల పండగ ఉంటుందన్న ఆశ అటు ఓటర్లలోనూ, ఇటు ఆశావహుల్లోనూ నెలకొంది. పార్టీ గుర్తు లపై ఎన్నిక జరగకున్నా.. అన్ని పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. సారపాకలోనూ ఇదే తరహా సందడి కనిపిస్తోంది. ఇక్కడ 18,934 మంది ఓటర్లు ఉన్నారు.

## భా'స్వరం' వినాల్సిందే..!

నల్గొండ : ఉమ్మడి జిల్లాలోని పంటపొలాల్లో రసాయన ఎరువుల వినియోగం మోతాదు పెరిగిపోయినట్లు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు పేర్కొంటున్నారు. సేంద్రియ సాగు విధానమే మేలని సూచిస్తున్నారు. రైతులు అవసరం ఉన్నా.. లేకున్నా దిగుబడి ఎక్కువ వస్తుందన్న కారణంతో భాస్వరం ఉండే 20:20, డీఏపీ, ఎస్ఎస్‌పీ, కాంప్లెక్స్ ఎరువులను మోతాదుకు మించి ఉపయోగిస్తున్నారు. అది మొక్కకు 20 శాతం మాత్రమే అంది మిగిలిన 80 శాతం భూపొరల్లో నిల్వ ఉండిపోతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భూమిలో పేరుకుపోయిన నిల్వలను కరిగించడానికి జీవ ఎరువులే ముఖ్యం. భూమిలో కరిగిపోకుండా మిగిలిపోయిన భాస్వరం పోషకాన్ని ఇవి కరిగించి మొక్కలకు అందిస్తాయి. మొక్కలకు మేలు చేసే



బ్యాక్టీరియాకు సంబంధించిన పాస్ఫో బ్యాక్టీరియం, మెగాథీరియం తదితర పాస్ఫరస్ సాలిబులైజ్ బ్యాక్టీరియా(పీఎస్‌బీ) జీవ ఎరువులను వినియోగిస్తే నేలలో ఉన్న భాస్వరం నిల్వలు కరిగిపోతాయి. ఫలితంగా నీరు, పోషకాలు మొక్కలకు పూర్తిస్థాయిలో అందుతాయి. దీంతో పాటు పిల్లి పెసర, జనుము, జీలుగు లాంటి పచ్చిరొట్ట ఎరువులను వినియోగిస్తే నేల సారవంతమై దిగుబడులు పెరగనున్నాయని కంపాసాగర్ వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది మొత్తం 17,254 మట్టి నమునాలు సేకరించారు. ఇందులో పంట భూముల్లో నత్రజని వనరుల లభ్యత తక్కువగా ఉందని.. అవసరానికి మించిన భాస్వరం నిల్వలు ఎక్కువగా ఉన్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. వచ్చే పంటకాలాల్లో భాస్వరం ఉపయోగించకపోవడమే మేలని వారు పేర్కొంటున్నారు.

## వ్యయం రూ.లక్షలు.. ఆయుష్షు గంటలు

కూసుమంచి : నిర్మించిన అంతర్గత సిమెంటు రహదారిని గంటల వ్యవధిలో జేసీబీతో ధ్వంసం చేశారు. కూసుమంచిలో ఉపాధిహామీ పథకం ద్వారా రూ.20.90 లక్షలతో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు మూడు రోజుల క్రితం అంతర్గత రహదారి నిర్మాణ పనులు ప్రారంభించారు. ఓ కుటుంబంలో సభ్యుల మధ్య వివాదం నేపథ్యంలో న్యాయస్థానంలో తీర్పు కోసం వేచిఉన్న భూమిలో రహదారి నిర్మించారంటూ అధికారులకు ఓ వర్గం ఫిర్యాదు చేసింది. దీంతో రహదారిని తొలగించాలని అధికారులు నిర్ణయించారు. నిర్మించిన మార్గంలో 38మీటర్ల మేర జేసీబీతో తొలగించారు. నిర్మించే ముందు ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం కాలేదని పంచాయతీరాజ్ శాఖ ఏఈ రెయిన్‌హార్డ్ కు తెలిపారు.

# వన్యప్రాణులు ఎన్నున్నాయ్..?

పలమనేరు : మన అడవుల్లో పులులు ఎన్ని ఉన్నాయి.. ఏనుగుల సంచారం.. తోడేళ్లు.. జింకలు.. నక్కలు.. ఇలా అన్ని జంతువుల వివరాల లెక్క తేలనుంది. వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వన్యప్రాణుల సర్వే మరో 5 రోజుల్లో జిల్లాలో ప్రారంభం కానుంది. కేంద్రం ప్రతిపాదించిన బృందం సర్వేలో పాల్గొంటుంది.

**ఇవీ జంతువులు..**


ఏనుగులు, పాంథర్స్, రేసుకుక్కలు, తోడేళ్లు, గుంట నక్కలు, అడవి పిల్లులు, దుప్పులు, జింకలు, అడవి పందులు, ఎలుగుబంట్లు ఉన్నాయి. వీటితో పాటు వివిధ రకాల అడవి జంతువులు, పక్షుల వివరాలు సర్వేలో లెక్కిస్తారు.

**సర్వే వివరాలు..**

ఎందుకు: వన్య ప్రాణుల సంఖ్య నిర్ధారణ
ప్రారంభం: డిసెంబరు 1
పరిధి: పలమనేరు, కుప్పం అటవీశాఖ
చేస్తున్నది: దిల్లీ నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ
లక్ష్యం: 2026 నాటికి దేశంలో ఉన్న పులులు, ఏనుగులు, ఇతర వన్యప్రాణాల వివరాల సేకరణ.

**పదుల సంఖ్యలో మృత్యువాత..**

15 నుంచి 20 చ.కిమీ విస్తీర్ణంలో ఎన్ని జంతువులు ఉన్నాయో వివరాలు లెక్కిస్తారు. పులి టెరిటోరియల్ ఏర్పాటు చేసుకుంటుంది.



ఈ ప్రకారం ఎన్ని ఉన్నాయో అంచనా వేస్తారు. పలమనేరు, కుప్పం నియోజకవర్గాల పరిధిలోని అడవిలో ఇప్పటి వరకు 70 వరకు ఏనుగులు, 2 ఎలుగు బంట్లు, 1 పాంథర్ ప్రాణాలు కోల్పోయాయి. జింకలు, దుప్పులు వేటగాళ్ల ఉచ్చులో పడి, జాతీయ రహదారి దాటే సమయంలో వందల సంఖ్యలో మృతి చెందుతున్నాయి.

**అంచనా..** ఏనుగులు- 100, పాంథర్స్- 7, జింకలు, దుప్పులు- 2 వేలు, ఎలుగుబంట్లు- 7, మిగిలిన చిన్న జంతువులు వేలల్లో ఉన్నట్లు అంచనా.

**నాలుగేళ్లకు ఒకసారి..**

ఈ సర్వే నాలుగేళ్లకు ఒకసారి చేస్తాం. ప్రస్తుతం ఏనుగులు, పాంథర్స్‌తో పాటు చిరుతల వివరాలు సేకరించనున్నాం. - వేణుగోపాల్, సబ్‌డీఎఫ్‌వో, పలమనేరు

# రప్పా.. రప్పా.. ఈ ఆక్రమణలేందప్పా

కర్నూలు : గత ఐదేళ్లలో ప్రభుత్వ, ప్రైవేటు భూములను ఇష్టానుసారం ఆక్రమించిన వైకాపా నేతలు కూటమి ప్రభుత్వంలోనూ తమ కబ్జాల పరంపరను కొనసాగిస్తున్నారు. కర్నూలు నగరం నడిబొడ్డున ఉన్న వివాదాస్పద స్థలంలోనే నిర్మాణాలు చేపట్టడం తాజాగా చర్చనీయాంశమైంది. ఆర్ఎస్ రోడ్డు ఐదురోడ్ల కూడలిలో సుమారు రూ.80 కోట్ల విలువ చేసే 1.60 ఎకరాల ఆగ్రోస్ సంస్థ స్థలాన్ని రెండున్నరేళ్ల కిందట వైకాపా హయాంలో ఆ పార్టీ జిల్లా కార్యాలయానికి స్వాధీనం చేసుకున్నారు. ఈ స్థలంలో వైకాపా కార్యాలయ భవన నిర్మాణం



చేపట్టారు. అప్పట్లో ఆగ్రోస్ సంస్థ అనుమతులు లేకుండానే రెవెన్యూ శాఖ ద్వారా ఆ భూమిని పార్టీ కార్యాలయం కోసం తీసుకున్నారు. అప్పట్లో తెదేపా నేతలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆ భవనాన్ని ప్రభుత్వ అవసరాలు, రైతుల సంక్షేమానికి వినియోగించేలా చూస్తామని ప్రకటించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 17 నెలలైనా ఆ స్థల వ్యవహారం ఓ కొలిక్కి రాలేదు. నగరపాలక సంస్థ అధికారులు దీనిపై కోర్టుకు వెళ్లినట్లు సమాచారం. కోర్టు విచారణలో ఉన్న స్థలంలో ప్రస్తుతం వైకాపా నేతలు ప్రహరీ నిర్మించారు. ఆ పార్టీ జిల్లా నేత ఒకరు స్వయంగా ఈ పనులు చేయిస్తున్నట్లు సమాచారం.

# 'గట్టు'కాయ స్వాహా

భీమవరం: కాలువ గట్టు కనిపిస్తే చాలు.. మరుసటి రోజు కనిపించదు. అంతలా మింగేస్తున్నారు అక్రమార్కులు. ఫలితంగా.. గట్లు కుచించుకుపోయి శివారు ప్రాంతాలకు సాగు..తాగునీరు అందని పరిస్థితి.

ఇరగవరం మండలం తూర్పువిప్పర్రులో నరసాపురం పంట కాలువ గట్టుపై, గరిగమ్మ కాలువ గట్టుపై కొందరు నిర్మాణాలు చేపట్టారు. చిన్నపాటి షెడ్డుతో మొదలుపెట్టి పక్కా భవనాలను నిర్మించి అద్దెకు ఇస్తున్నారు. మొగల్తూరులోని పాతకాలువ నుంచి లాకుల వరకు, సీతారామపురం నుంచి రామన్నపాలెం వరకు, నరసాపురం ప్రధాన కాలువ నుంచి వేములదీవి కాలువ గట్లపై ఆక్రమణలు వెలిశాయి. ఫలితంగా సుమారు 15 గ్రామాలు తాగు, సాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. జిల్లాలోని తొమ్మిది ప్రధాన పంట కాలువలు ఉండగా, వాటికి అనుసంధానంగా వందల సంఖ్యలో బోదెలు ఉన్నాయి. వాటి పరిధిలో 4 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. చాలావరకు ఆక్రమణలకు గురవడంతో నీటి ప్రవాహం తగ్గి సాగు, తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయి. నీరు సకాలంలో దిగువకు ప్రవహించే పరిస్థితి లేక వరదలు, భారీ వర్షాల సమయంలో పల్లపు ప్రాంతాల్లో చేలు, ఆవాస ప్రాంతాలు ముంపు బారిన పడుతున్నాయి. సుమారు 45 కిలోమీటర్ల పొడవు.. 95 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించే నిడదవోలు-నరసాపురం కాలువ వివిధ ప్రాంతాల్లో ఆక్రమణలకు గురైంది. గోస్తనీ-వేల్పూరు కాలువ పరిధిలో మాముడూరు లాకుల వద్ద నిర్మాణాలు చేపట్టారు. సమన్వయ లోపం జల వనరులు, పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో జీఅండ్‌వీ కెనాల్ నుంచి రెండు కిలోమీటర్లు ఉండే గునుపూడి ఛానల్-1 పరిధిలో 250ఎకరాలు కొన్నిచోట్ల కబ్జాలతో బక్కచిక్కిపోయింది. ఆచంట మండలంలో బ్యాంకు కెనాల్ గట్లను ఆక్రమించుకుని మొక్కలు వేసుకున్నారు.

# అధికారులు అడగరు.. అక్రమార్కులు ఆగరు




పుట్టపర్తి : సామాన్యులకు ట్రాక్టరు మట్టి, ఇసుక కావాలంటే పలు నిబంధనలతో అడ్డుచెప్పే అధికారులు.. కళ్లముందే టిప్పర్లలో ఎర్రమట్టి తరలిపోతున్నా.. పట్టించుకోవడం లేదు. ఇదే అదనుగా అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. కొత్తచెరువు మేజర్ పంచాయతీలో యథేచ్ఛగా జరుగుతున్న మట్టిదందా తీరిది. కొత్తచెరువు మేజర్ పంచాయతీలో ఎవరైనా మరణిస్తే చెరువులోతట్టు ప్రాంతంలో ఉన్న స్థలంలో అంత్యక్రియలు నిర్వహించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రజలు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పుట్టపర్తి రోడ్డులోని పొలిమేరగుండు వద్ద కొండ పోరంబోకు భూమిని శ్మశానవాటికకు కేటాయించారు. సర్వే నంబరు 1458-2లో 1.03 ఎకరాలు, 1453-3లో 2.46.. మొత్తం 3.49 ఎకరాలు.. దీనిపక్కనే డంపింగ్ యార్డు కోసం సర్వేనంబరు 1452-1లో మరో 95 సెంట్లు ఇచ్చారు. కొండగుట్టను చదును చేసే పనిని కొందరు రెట్టింపు ఆదాయవనరుగా మార్చుకున్నారు. ఇందుకు అధికారులు సహకరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

**మట్టి తవ్వకాలకు పంచాయతీ నిధులు**

కేటాయించిన స్థలం కొండ పోరంబోకు కావడంతో గుట్టను చదును చేయాల్సి ఉంది. దీంతో పంచాయతీ అధికారులు విలేజ్ లెవల్ కమిటీ (వీఎల్‌సీ) తీర్మానం మేరకు ఇద్దరు వ్యక్తులకు పనులు అప్పగించారు. ఇక్కడే అసలు కథ మొదలైంది. టన్నుల కొద్దీ ఎర్రమట్టిని తవ్వడానికి పంచాయతీ నిధులు కేటాయిస్తోంది. అలాగని తవ్విన మట్టి, రాళ్లను పంచాయతీకి సంబంధించి ప్రజాప్రయోజన పనులకేమైనా వినియోగిస్తున్నారా...అంటే లేదు. ఓ నాయకుడికి చెందిన పొలంలో ఉన్న గుంతలను పూడ్చడానికి తరలిస్తుండటం గమనార్హం. శ్మశానస్థలం చదును పేరుతో ఇతరులకు పనులిచ్చి అటు ప్రభుత్వ ధనానికి గండికొడుతూ.. నాయకుడికి లాభం చేకూరుస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి రెండువిధాలా గండి పడుతోంది.

**కళ్లెదుటే టిప్పర్లు తిరుగుతున్నా..**

కొండలు, గుట్టలు తవ్వాలంటే.. అటు పంచాయతీగాని, ప్రైవేట్ వ్యక్తులు గాని మైనింగ్ అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. జిల్లా కేంద్రానికి సమీపంలోనే ఉన్న కొత్తచెరువు రహదారి మీదుగా అధికారులు నిరంతరం తిరుగుతుంటారు. ఇదే రహదారిపై నుంచి నిత్యం ఎర్రమట్టి టిప్పర్లలో తరలిపోతున్నా మైనింగ్, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. మరోవైపు ధర్మవరం రోడ్డులోని నాగిరెడ్డిపల్లికాలనీ సమీపంలో ఉన్న దాసరిపాముగుట్టను అక్రమార్కులు తవ్వేస్తున్నారు. మట్టి, రాళ్లు సదరు నాయకుడి ప్రైవేటు స్థలానికే వెళుతోంది. నిర్దేశించిన స్థలంకంటే ఎంత విస్తీర్ణంలో దోపిడీ జరుగుతోందన్న విషయాన్నీ ఎవరూ తేల్చడం లేదు.

**తగిన చర్యలు తీసుకుంటాం- జనార్దన్‌రెడ్డి, కొత్తచెరువు ఇన్‌ఛార్జి ఈఓ**

వీఎల్‌సీ తీర్మానం మేరకు పనులు అప్పగించిన మాట వాస్తవమే. మట్టి తరలిపోతున్న విషయాన్ని తహసీల్దారు దృష్టికి తీసుకెళ్లాం. మట్టి తవ్వకం పనులు మైనింగ్ అధికారులు అడ్డుకోవాల్సి ఉంది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటాం.

# స్వామీ.. కోనేర్లు బాగయ్యేనా?



అనంతపురం : పలు ఆలయాల పరిధిలోని కోనేరుల పునరుద్ధరణ పనులపై డ్వామా అధికారులు దృష్టి సారించటం లేదు. నెలలు గడుస్తున్నా ఉమ్మడి అనంతపురం జిల్లాలో మరమ్మతు పనులు పూర్తి చేయని దుస్థితి. శిథిలావస్థకు చేరిన వాటిని గుర్తించి.. బాగు చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఉపాధి హామీ పథకం కింద మరమ్మతులు చేపట్టాలని రెండు నెలల క్రితమే సర్కారు ఆదేశించింది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అధికారులు అధ్వానస్థితికి చేరిన కోనేరులను అధికారులు గుర్తించారు. పూడికను తీసేందుకు పథకానికి సంబంధించి మెటీరియల్ కాంపొనెంట్ నిధులను వినియోగించాలని... కూలీలతో పనులు చేయించాలని ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో మండల ఇంజినీర్లు పరిశీలించి.. అంచనాలను తయారు చేసి పంపించారు. పొడవు, వెడల్పును బట్టి పునరుద్ధరణకు రూ.80 వేల నుంచి రూ.2 లక్షల వరకు ఖర్చు అవుతుందని నివేదించారు. ఇప్పటిదాకా పెన్నోహొబిలంలో ఒకటి, లేపాక్షిలో ఒక కోనేరు పనులు చేశారు. అనంతపురం జిల్లాలో గుర్తించినవి 57, శ్రీసత్యసాయిలో 17 కోనేర్లు ఉన్నాయి.

పూడికతీత పనులు చేపట్టడానికి భారీ క్రేన్‌లను వినియోగించాల్సి ఉంది. అవి అందుబాటులో లేకపోవడం, ఉపాధి కూలీలు కోనేరులో పనులు చేసేందుకు ముందుకు రావటం లేదని అధికారులు చెబుతున్నారు.

అనంతపురం జిల్లాలో గుర్తించినవి: అనంతపురం, ఆత్మకూరు, బెళుగుప్ప, బ్రహ్మసముద్రం, గార్లదిన్నె, గుత్తి, శింగనమల, గుంతకల్లు, కూడేరు, కుందుర్పి, పెద్దపప్పూరు, యాడికి, యల్లనూరులో ఒకటి చొప్పున.. కంబదూరు, పామిడి, తాడిపత్రిలో రెండు చొప్పున, బుక్కరాయసముద్రం, కణేకల్లులో 3 చొప్పున, ఉరవకొండ 5, వజ్రకరూరు 6, పెద్దవడుగూరు 11, విడపనకల్లులో 10 కోనేరులను మరమ్మతుల కోసం గుర్తించారు.

శ్రీసత్యసాయి జిల్లాలో..: అమరాపురం, బత్తలపల్లి, బుక్కపట్నం, చిలమత్తూరు, కనగానపల్లి, లేపాక్షి, పుట్టపర్తి, సోమందేపల్లి, తాడిమర్రిలో ఒకటి చొప్పున, రొళ్ల, నల్లచెరువు 2, కదిరి 4 చొప్పున మరమ్మతులు చేయాల్సి ఉంది.

**అవసరమైన చర్యలు చేపడతాం**

- సలీంబాషా, విజయేంద్రప్రసాద్, డ్వామా పీడీలు, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలు

ఉపాధి హామీ పథకం కింద పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పలు కోనేరుల్లో నీరు ఉండటంతో మరమ్మతులు చేసేందుకు వీలు కావటం లేదు. త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపడతాం. కొన్ని పనులను క్వాలిటీ కంట్రోల్ అధికారులు తిరస్కరించారు.

# సొమ్ములు వారికి.. శోకం వీరికి!




తిరుపతి : శ్రీకాళహస్తి నియోజకవర్గంలో వైకాపా హయాంలో ఆ పార్టీ నాయకులు ప్రభుత్వ భూముల్లో తమకు కాసులు ఇచ్చిన వ్యక్తులు, పేదలకు స్థలాలు చూపి కోట్ల రూపాయలు సంపాదించారు. రెవెన్యూ యంత్రాంగం నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే వీటిని కేటాయించారు. ఇందుకు ఒక్కొక్కరి నుంచి రూ.2 లక్షలు- రూ.8 లక్షల వరకు వసూలు చేశారు. అప్పట్లో రెవెన్యూ సిబ్బంది ఎవరూ అడ్డు చెప్పకపోవడంతో నిర్మాణదారులు ఇళ్లు కట్టేసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తేనెతుట్టె కదిలింది. అప్పటి బాగోతాలపై అధికారులు విచారణ మొదలుపెట్టడంతో వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. దాంతో నిర్మాణాలను ఒకొక్కటిగా కూల్చేస్తుండటంతో పేదలు కన్నీరుమున్నీరవుతున్నారు.

చోటామోటా నాయకులంతా కలిపి పేదల నుంచి రూ.15 కోట్ల వరకు వసూలు చేశారు.

ఏర్పేడులోనూ దాదాపు 20 మంది నుంచి డబ్బులు తీసుకున్నారు. శ్రీకాళహస్తి రాజీవ్‌నగర్‌లోనూ సుమారు 1,300- 1,400 గృహాలకు సంబంధించి వివాదం కొనసాగుతూనే ఉంది. ప్రస్తుతం రెవెన్యూ అధికారులు వీటిని కూల్చేసే పనిలో పడ్డారు. ఈ వ్యవహారంలో అంతిమంగా నష్టపోయింది పేదలే.

**నేతలపైనా చర్యలు తీసుకుంటేనే**

పేదల ఇళ్లపైకి పొక్లెయిన్లు తీసుకెళ్లి ప్రతాపం చూపుతోన్న అధికారులు అక్రమార్కులైన వైకాపా నేతలపై మాత్రం చర్యలు తీసుకోవడానికి ఆసక్తి చూపడంలేదు. బాధితులను విచారిస్తే నాయకుల పేర్లు, వారికి ఎంత చెల్లించారన్నది తెలుస్తుంది. తదనుగుణంగా అవసరమైతే వారిపైనా కేసులు నమోదు చేస్తే భవిష్యత్తులో ఎవరూ ఇలాంటి వ్యవహారాల్లో తలదూర్చరు.

**ఒక్క రేణిగుంటలోనే 700 మందికి**

పేదలు, ఎలాంటి అర్హత లేని వ్యక్తులు ఎవరైనా గత ప్రభుత్వంలో వైకాపా నాయకులను సంప్రదిస్తే సంబంధిత పంచాయతీ నుంచి ఇంటి పన్ను రసీదు ఇప్పించారు. ఎస్పీడీసీఎల్ నుంచి విద్యుత్తు కనెక్షన్‌నూ తీయించారు. మిమ్మల్ని ఇక ఎవరూ అడగరని చెప్పి ఐదేళ్లలో ఒక్క రేణిగుంట మండలంలోనే 700 మందికి ప్రభుత్వ, అభ్యంతరాలున్న ప్రాంతాల్లో స్థలాలు చూపారు. కుర్రకాలువ, కొత్తపాలెం, సీబీఐడీ కాలనీ, వివేకానంద కాలనీ, చెంగారెడ్డిపల్లి, సీఆర్ఎస్ వెనుక ఇంటి పట్టాలు ఇచ్చినట్టు పేర్కొన్నారు. అందులో కొందరు అప్పు చేసి గృహాలు నిర్మించుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన ఈ వ్యవహారంపై అప్పట్లో అభ్యంతరాలు తలెత్తినా లెక్క చేయలేదు.

# అదనపు గదుల్లో.. నత్త పోటీలు

నంద్యాల : మహానంది మండలం తిమ్మాపురంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో 250 మంది చదువుకొంటున్నారు. ఇక్కడ ఆరు అదనపు గదుల నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరయ్యాయి. గత కొన్నినెలలుగా పనులు జరగడం లేదు. ప్రయోగశాలలకు గదుల్లేక విద్యార్థినులకు తిప్పలు తప్పడం లేదు. కస్తూర్బా విద్యాలయాల్లో(కేజీబీవీ) అదనపు గదుల నిర్మాణ పనులు నత్తతో పోటీ పడుతున్నాయి. కస్తూర్బా విద్యాలయాల్లో విద్యార్థునుల సంఖ్య ఏటికేడు పెరుగుతోంది. రెండేళ్ల నుంచి ఇంటర్మీడియట్ విద్యనూ బోధిస్తున్నారు. ఈక్రమంలో అదనపు గదుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. సమగ్రశిక్షా పర్యవేక్షణలో పీఎఫ్ఎంఎస్(పబ్లిక్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) విధానంలో నిధులు ఖర్చు చేస్తున్నారు. పేరుకు ప్రిన్సిపాళ్ల ఆధ్వర్యంలో జరుగుతున్నట్లు కనిపిస్తున్నా.. చేసేది మాత్రం స్థానిక నాయకుల అనుచరులే. నిధులు వచ్చినప్పుడే కొంత పనులు చేస్తూ.. మిగితా సమయంలో చేయడం లేదు. ఈ విద్యా సంవత్సరంలో పూర్తి కావాల్సిన పనులు వచ్చే ఏడాది నాటికీ పూర్తయ్యేట్లు కనిపించడం లేదు.

**రూ.10.78 కోట్ల కేటాయింపు**

స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు, గుత్తేదారులు పనులు చేయకూడదు. కేవలం ప్రిన్సిపాళ్ల ఆధ్వర్యంలోనే చేయాలి. ప్రిన్సిపాళ్లు మహిళలు కావడం, సివిల్ పనులపై అవగాహన లేకపోవడంతో స్థానికంగా ఉన్న నాయకులు తలదూర్చారు.

ఇంజినీర్లను మధ్యవర్తులుగా ఉంచి ప్రిన్సిపాళ్లతో సంతకాలు చేయించి.. మిగితా పనులన్నింటినీ వారే చేస్తున్నారు. నంద్యాల, శ్రీశైలం, ఆళ్లగడ్డ, నందికొట్కూరు, డోన్, పాణ్యం, పత్తికొండ, ఎమ్మిగనూరు, ఆలూరు,



కోడుమూరు తదితర నియోజకవర్గాల్లో పనులన్నీ నాయకుల కనుసన్నల్లోనే జరుగుతున్నాయి. కనీసం 60 శాతం కూడా పూర్తి కాలేదు.

**కొరవడిన పర్యవేక్షణ**

మహానంది మండలం తిమ్మాపురంలో కొన్ని నెలలుగా పనులు జరగడం లేదు. నంద్యాల పట్టణంలోని మైనార్టీ కేజీబీవీలో ఒక నెల పని జరిగితే మరికొన్ని నెలల పాటు కదలడం లేదు. గడివేములలో ఫ్లోరింగ్ పనులు ఆగుతూ సాగుతున్నాయి. రుద్రవరం, మిడుతూరు, ఓర్వకల్లు, గూడూరు, మంత్రాలయం, పత్తికొండ ప్రాంతాల్లో పైకప్పు స్థాయిలో నిలిచిపోయాయి.ప్రభుత్వం నిధులు విడుదల చేసినప్పుడు డ్రా చేసుకొని ఆ మేర పనులు చేసి తర్వాత వదిలేస్తున్నారు. ఈ ఏడాది జూన్ నాటికే పూర్తి కావాల్సినా పట్టించుకోవడం లేదు.

నిర్మాణాల తీరుపై ఏఈలు సమగ్రశిక్షా అధికారులతో సమన్వయం చేసుకోలేకపోతున్నారు. ప్రిన్సిపాళ్లే ముందుగా ఖర్చులు భరించి, తర్వాత ఎం.బుక్కులో నమోదు చేయాలంటూ ఇంజినీర్లు ఒత్తిడి చేస్తున్నారు. నాయకుల ప్రమేయం పరోక్షంగా ఉండటంతో పనుల వేగంపై ఒత్తిడి చేయలేకపోతున్నారు.

| కస్తూర్బా | కర్నూలు | నంద్యాల |
|---|---|---|
| విద్యాలయాలు | 17 | 22 |
| నిధులు(రూ.కోట్లు) | 4.46 | 6.32 |
| ఖర్చు(రూ.కోట్లు) | 2 | 1.5 |

# గని గుంత.. కళ్లకు గంతలు

బనగానపల్లి: జిల్లాలో నాపరాతి గని గుంతలు ప్రమాదకరంగా మారాయి. గని గుంతలు ఎంతో మంది ప్రాణాలు బలిగొంటున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యారు. నాపరాతి గనులు లీజులు పూర్తయిన తర్వాత పూడ్చాల్సిన యజమానులు విస్మరించడంతో గుంతలు ప్రమాదాలకు నిలయంగా మారిపోయాయి. గనులు, భూగర్భ శాఖ అధికారులు పట్టించుకోక గాలికొదిలేశారు.

**చెరువుల్లా మారిపోయి**

ఉమ్మడి జిల్లాలో 1,150 హెక్టార్లలో నాపరాతి గనులు ఉన్నాయి. నంద్యాల జిల్లాలో బనగానపల్లి, అవుకు, కొలిమిగుండ్ల, డోన్, నందికొట్కూరు ప్రాంతాల్లో నాపరాతి గనులు ఉన్నాయి. సుమారు 500 మందికి పైగా గనుల లీజులు పొందిన యజమానులు ఉన్నారు. సుమారు వందకు పైగా గని గుంతలు ఉన్నట్లు అంచనా. ఏడాది పొడవునా నీరు నిల్వ ఉంటుంది.

యజమానులు విచ్చలవిడిగా తవ్వకాలు సాగించి వదిలి వేయడం కొందరి పాలిట శాపంగా మారింది. ఒక్కో గని గుంత 50 నుంచి 70 అడుగుల లోతు ఉంటుంది. వాటి నిండా వర్షం నీరు చేరి చెరువుల్లా మారిపోయి ఉంటాయి. సమీపంలోని ప్రజలు, రైతులు నీటి కోసం వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

**పోతున్న ప్రాణాలు**

గుంతల్లో పడి యువత, పనిచేసే కూలీల దగ్గరి నుంచి రైతులు, గ్రామాల సమీపంలో పనిచేసే కూలి మహిళలు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. కొందరు ఆవేశానికి గురై గని గుంతల్లో పడి ఆత్మహత్య చేసుకోవడం, ఈతకు వెళ్లిన యువత చనిపోవడం కనిపిస్తోంది. మరోవైపు నాపరాతి గనుల సమీపంలో ఉన్న గ్రామాల ప్రజలు అంటురోగాలు, దోమల బారిన పడుతున్నారు.

**కొన్ని ప్రమాదాలు పరిశీలిస్తే..**

కొలిమిగుండ్ల మండలం బెలుం సమీపంలోని గతేడాది నాపరాతి గని గుంతలో పడి మహేంద్రరెడ్డి(22) అనే విద్యార్థి చనిపోయాడు. బందర్లపల్లె సమీపంలో స్నేహితులతో కలిసి గని గుంతలో ఈతకు వెళ్లి ఇటీవల ప్రవీణ్ (14) అనే విద్యార్థి దుర్మరణం పాలయ్యాడు. నాలుగేళ్ల కిందట పలుకూరు సమీపంలో గణేశ్ నిమజ్జనం చేసే క్రమంలో ఇద్దరు యువకులు గని గుంతలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందారు. **నిబంధనలకు నీళ్లు**గనుల లీజులు పొందే ముందు యజమానులు ప్రభుత్వ నిబంధనలు పాటించాల్సి ఉంది. ఆ మేరకు అగ్రిమెంటులో సంతకం చేస్తారు. నాపరాతిని తవ్విన తర్వాత వ్యర్థాలతో గుంతను పూడ్చి వేయాలి.గని గుంతల్లో నీరు చేరకుండా చూడాలి. ఒక వేళ నీరు చేరితే మోటార్ల ద్వారా బయటకు పంపి పూడ్చి వేయాలి.అవసరాన్ని బట్టి చుట్టూ కంచెలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. తిరిగి లీజులు పునరుద్ధరించాలంటే గతంలో చేసిన గనిని అధికారులు పరిశీలించి గుంతను పూడ్చితేనే తిరిగి లీజులు ఇవ్వాలి.స్థానికులను ఇబ్బంది పెట్టేలా పేలుడు పదార్థాలు వాడకూడదు. గుంతల వద్ద విద్యుత్తు తీగలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి."గని గుంతల్లో ఎవరైనా పడి చనిపోతే ఆ బాధ్యత యజమానులే తీసుకోవాలని, గుంతలను గుర్తించి ఆయా యజమానులకు నోటీసులు జారీ చేస్తామని" గనుల శాఖ ఏడీ రాజగోపాల్ తెలిపారు.

# చిత్రావతి కలుషితం.. ప్రజారోగ్యంతో చెలగాటం

పుట్టపర్తి: శ్రీసత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో భూగర్భ మురుగుపారుదల వ్యవస్థ గాడి తప్పింది. అధికారులు, పాలకుల అలసత్వంతో నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. శుద్ధి ప్లాంటు సక్రమంగా పని చేయకపోవడంతో మురుగును నదిలోకి వదిలేస్తున్నారు. పట్టణంలోని సాయినగర్ నుంచి కర్ణాటకనాగేపల్లి కాజ్‌వే వరకు నది కలుషితం అయింది. నివారణ చర్యలు చేపట్టకుండా అధికారులు చోద్యం చూస్తున్నారు. ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. సాయినగర్, గోకులంలో ప్లాంట్లు నుంచి శుద్ధి కేంద్రానికి సరఫరా చేయకుండా నదిలోకి వదిలేస్తున్నారు. ప్రతి రోజూ పట్టణానికి 26 లక్షల లీటర్లు నీరు సరఫరా అవుతోంది. కాగా 18 లక్షల లీటర్ల మేర మురుగు బయటకు వస్తోంది. సాయినగర్, గోకులం వద్ద సక్రమంగా మోటార్లు పని చేయడం లేదు. దాన్ని అలాగే వదిలేశారు. ఎస్ఎస్ ఆసుపత్రి వద్ద శుద్ధి ప్లాంటు పునాదికే పరిమితమైంది.



పుట్టపర్తి పట్టణ పరిధిలోని చిత్రావతి నది పరిసరాలను ఆధ్యాత్మిక, పర్యాటకంగా ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపడుతున్నా.. మరోవైపు మురుగు నీరు, వ్యర్థాలతో నింపేస్తున్నారు. దీంతో నది పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్ క్రాంతికుమార్‌ను వివరణ కోరగా నదిలోకి మురుగు వెళ్లకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు.

# ప్రత్యామ్నాయం లేకుండానే మూత

తిరుపతి : శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాల ఆసుపత్రిలో మందుల దుకాణాన్ని స్విమ్స్ నిర్వహించాలని తితిదే ఆదేశించినా.. ఆ దిశగా ఇప్పటికీ అడుగులు పడటం లేదు. ఇప్పటివరకు మందుల దుకాణం నిర్వహణకు దరఖాస్తు చేసుకోలేదు. మందుల కొనుగోలులో పాటించాల్సిన విధివిధానాలు.. సిబ్బంది నియామకం చేపట్టలేదు. ఈ నేపథ్యంలో తితిదే అధికారులు టెండర్ కాలపరిమితి ముగిసిందంటూ శ్రీపద్మావతి మందుల దుకాణాన్ని మూసివేశారు. దీంతో స్థానికంగా చికిత్స పొందే రోగులు మందుల కోసం స్విమ్స్ వరకు రావాల్సి వస్తోంది. పడకల్లో ఉన్న రోగులకు రాత్రివేళ అవసరమైన మందుల కోసం వచ్చి.. వెళ్లేందుకు ఇబ్బందులు తప్పడం లేదు.

శ్రీపద్మావతి ఆసుపత్రి ముందు జనరిక్ పేరిట మందుల దుకాణాన్ని పులివెందులకు చెందిన వ్యక్తికి అప్పటి ప్రభుత్వం కట్టబెట్టింది. కాలపరిమితి పూర్తయ్యాక తితిదే టెండర్లు ఆహ్వానించింది. వరుసగా నాలుగుసార్లు టెండర్లు నిర్వహించినా ఎవరినీ ఎంపిక చేయలేదు. ఆఖరు టెండర్‌లో మొదటి బిడ్డర్‌కు కేటాయించకుండా జాప్యం చేశారు. ఇదంతా పులివెందుల వ్యక్తికి మేలు చేసేందుకు జాప్యం చేస్తున్నారనే ఆరోపణలు వచ్చాయి. ఇదే సమయంలో తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు స్పందించి స్విమ్స్ ఆధ్వర్యంలో స్వయంగా మందులు దుకాణాలు నిర్వహించాలని ఆదేశించారు. దీనివల్ల రోగులకు మంచి మందులు అందుబాటులో ఉంచడంతోపాటు.. ఆదాయ సముపార్జన, కొందరికి ఉద్యోగ అవకాశాలు కల్పించవచ్చని భావించారు.

**అవస్థలు తప్పవా?**

స్విమ్స్ ఇదివరకు రెండుసార్లు స్వయంగా మందుల దుకాణాలు నిర్వహించింది. ఆ అనుభవంతో గుత్తగా మందులు కొనుగోలు చేస్తే కొంతవరకు ధర తగ్గే అవకాశం ఉంది. వైద్యులు సూచించిన మందులు ఉంచడంతో రోగులకు మేలు జరుగుతుంది. ఇలా చేయాలంటే కొనుగోలు.. అమ్మకాల విధివిధానాలు రూపొందించాల్సి ఉంది. అదే సమయంలో దుకాణం ఏర్పాటుకు అవసరమైన లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకోవాలి. ఇవన్నీ జరగాలంటే నెలరోజులు పట్టే అవకాశం ఉంది. నెలరోజుల కిందటే తితిదే ఛైర్మన్ ఏర్పాట్లు చేసుకోమని చెప్పినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం వెనుక విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దానికితోడు గతంలో అమ్ముడుపోని మందులు వెనక్కు ఇవ్వడం.. కాలంచెల్లిన మందుల విషయంలో కొంత ఇబ్బంది పడినట్లు సమాచారం. ప్రస్తుతం విధివిధానాలు లేకుండా ముందుకెళితే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవనే భయంతో జాప్యం చేస్తున్నారనే భావన వ్యక్తమవుతోంది.

# చేసిందే పని.. అవినీతి గని!

విశాఖపట్నం: వైకాపా ప్రభుత్వ హయాంలో 'జగనన్న కాలనీ'ల పేరుతో రాక్రీట్ సంస్థ చేపట్టిన ఇళ్ల నిర్మాణంలో అవినీతికి పాల్పడినట్లు గృహనిర్మాణ శాఖ తేల్చింది. అవి ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. వైకాపాకు చెందిన మాజీ ఎమ్మెల్యే సంబంధీకులకు చెందిన ఆ సంస్థ జిల్లాలో పలు మండలాల్లో ఇష్టానుసారంగా చేసిన పనులపై 'విజిలెన్స్' దృష్టిసారించింది. నాడు అధికారాన్ని అడ్డుపెట్టుకొని వారు చేసిందే పనిగా సాగింది. ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో ఎక్కడ పనులు అక్కడే ఆపేసి,



యంత్రాలను వదిలేశారు. ఆనందపురం మండలంలో పొక్లయిన్లు, ఇతర వాహనాలను అలానే ఉంచేశారు. అక్కడే సిమెంటు బస్తాలు, ఇనుప చువ్వలు వదిలేశారు. అవన్నీ ఎండకు ఎండి వానకు తడవడంతో అప్పట్లో పాడైపోయాయి. చేసిన అక్రమాలు ఎక్కడ బయటపడతాయోనని నాడు జాగ్రత్తపడినా విచారణలో వెలుగులోకి వచ్చాయి. **20 వేలు కేటాయిస్తే..** జిల్లాలోని లేఅవుట్లలో లక్షకుపైగా ఇళ్ల కోసం గృహ నిర్మాణశాఖ మ్యాపింగ్ చేసింది. వాటిల్లో రాక్రీట్ ఇన్‌ఫ్రాకు కొన్ని లేఅవుట్లలో 20 వేల ఇళ్లప్పగించారు. నిర్మాణాలు చేపట్టినా నాణ్యత లోపంగానే ఉన్నాయి. సబ్బవరం మండలం పైడివాడఅగ్రహారం లో రాక్రీట్ సంస్థ నిర్మాణాలు చిన్నపాటి వర్షానికే పునాదులతో సహా కొట్టుకు పోయాయి. కొన్ని చోట్ల గోడలకు బీటలు వచ్చాయి. నడుపూరు, గంగవరం, నంగినారపాడులో చేపట్టిన నిర్మాణాలు అసంపూర్తిగా ఉండిపోయాయి. ఈ లేఅవుట్‌ల నుంచి రూ. 2 కోట్ల వరకూ రికవరీకి ప్రతిపాదించినట్లు సమాచారం.

# ఆటిజం బాధితులకు ఆసరా



హిందూపురం : జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న భవిత కేంద్రాలకు వచ్చే దివ్యాంగుల్లో అచేతన స్థితిలో ఉన్నవారిని గుర్తించి వారి భవిష్యత్తు కొంతైనా మార్పు రావాలన్న ఆలోచనతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా నిలుస్తున్నాయి. అలాంటి వారికోసం ఆటిజం పేరుతో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు చేపట్టాయి. ఇప్పటికే ప్రక్రియ చివరి దశకు చేరుకోగా త్వరలోనే ప్రారంభించడానికి ఏర్పాట్లు జరుగుతున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు.

ఆటిజం అంటే.. భవిత కేంద్రాలకు వచ్చే వారిలో బుద్ధిమాంద్యతతో పాటు వివిధ రకాల వైకల్యం ఉన్న వారిని చిరువయసులోనే గుర్తించి 18 ఏళ్లు వచ్చే సమయానికి వారిలో వీలైనంత మార్పు తీసుకురావడమే ప్రధాన లక్ష్యంగా ఏర్పాటుచేస్తున్న కేంద్రాలు.

**జిల్లాలో ఎక్కెడెక్కడంటే**

ప్రధానమంత్రి స్కూల్‌ఆఫ్ రైజింగ్ (పీఎంశ్రీ) పథకంలో ఎంపికైన ఆరు పాఠశాలలను గుర్తించారు. హిందూపురం మండలం కే.బసవన పల్లి, కదిరి, మడకశిరలో బాలికల పాఠశాలలు, పెనుకొండ ప్రభుత్వ పాఠశాల, కొత్తచెరువు ఆదర్శ ప్రాథమిక పాఠశాల, ధర్మవరం పురపాలిక. ఇవి భవిత కేంద్రాలకు సమాంతరంగా కొనసాగుతాయి.

**రెండు గదులతో..**

ప్రతికేంద్రంలో ప్రత్యేకంగా రెండు గదులు నిర్మించి అక్కడ ఎంపిక చేసిన ఇద్దరు ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో మెరుగైన వైద్యచికిత్సలతో పాటు స్పీచ్‌థెరపీ, ఫిజియోథెరపీ, సైకాలజీ నిపుణులతో ప్రత్యేక బోధన అందించడం. జిల్లాలో ఆరు పీఎంశ్రీ పాఠశాలల్లో ఆటిజం కేంద్రాలు ఏర్పాటుకు గుర్తించాం. ఇప్పటికే ఏర్పాట్లు పూర్తిచేస్తూ, సౌకర్యాలు కల్పనకు చర్యలు చేపట్టాం, త్వరలోనే సేవలు అందుబాటులోకి రానున్నాయి.

పుల్లన్న, సహిత విద్య జిల్లా సమన్వయకర్త

జిల్లా – శ్రీసత్యసాయి
భవిత కేంద్రాలు: 32
విద్యార్థులు: 3,251
ఆటిజం పిల్లల కేంద్రాలు: 06
ఒక్కో కేంద్రం ఏర్పాటుకు
నిధులు: రూ. 27.75లక్షలు

# గాడితప్పిన సాగునీటి కాలువల పర్యవేక్షణ



గుంతకల్లు : హెచ్చెల్సీ సర్కిల్ గుంతకల్లు డివిజన్ పరిధిలోని కాలువలకు సంబంధించిన రోడ్లు పాడైపోయాయి. వీటికి తాత్కాలిక మరమ్మతులు చేసి చేతులు దులుపుకొంటున్నారు. రోడ్లు సక్రమంగా లేక పోవడంతో డివిజన్‌లో పని చేసే ఇంజినీర్లు, సిబ్బంది కాలువను, ఆయకట్టును పర్యవేక్షించడానికి అక్కడికి వెళ్లేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఫలితంగా కాలువల పర్యవేక్షణ దారితప్పింది. దీంతో నీటి సరఫరాను సక్రమంగా అమలు చేయక పోతుండటంతో ఆయకట్టు రైతులు నష్టపోతున్నారు.

**గుత్తి ఉపకాలువ రోడ్డూ అంతే**

గుత్తి ఉపకాలువకు సంబంధించి గుంతకల్లు నుంచి గుంతకల్లు కొట్టాల వారు రోడ్డు పూర్తిగా దెబ్బతినింది. వాహనాలు వెళ్లలేవు. ఇక గుత్తి బైపాస్ కాలువను ఏర్పాటు చేసి 20 ఏళ్లవుతున్నా ఇప్పటికీ కెనాల్ రోడ్డు నిర్మించలేదు. ఫలితంగా సిబ్బంది కాలువను పరిశీలించడానికి కాలువ మీదుగా వెళ్లే అవకాశం లేకుండా పోతోంది. కాలువ నిర్మాణ సమయంలోనే రోడ్డు వేయాల్సింది.. అలా చేయకపోడంతో ఆయకట్టు పర్యవేక్షణ నామమత్రాంగా ఉంటోంది. గుంతకల్లు బ్రాంచ్ కాలువ, గుత్తి ఉపకాలువ కింద దాదాపు 20 వేల ఎకరాల ఆయకట్టు ఉండటం గమనార్హం. **నాలుగు మండలాల గుండా కాలువ** డివిజన్ పరిధిలోని గుంతకల్లు బ్రాంచ్ కాలువ పొడవు 58 కి.మీ.లు. ఈ కాలువ ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు, గుంతకల్లు మండలాల గుండా వెళుతోంది. కాలువకు, రోడ్డుకు చెందిన నిర్మాణాలు చాలాచోట్ల నేలమట్టమయ్యాయి. కొన్ని చోట్ల వంతెనల రక్షణగోడలు కూలిపోయాయి. రోడ్డుమీదుగా వాహనాల్లో వెళ్లేవారికి ప్రమాదం పొంచి ఉంది. గుంతలకు మట్టి తోలినా ప్రయోజనం ఉండటం లేదు. వర్షాకాలంలో గుంతల్లోకి నీరు చేరుతోంది. బురద దారిలో వాహన రాకపోకలకు కష్టంగా ఉంటోంది. తాత్కాలిక మరమ్మతుల పేరుతో నిధులు వృథా చేస్తున్నారు.

**ప్రణాళికలు తయారు చేస్తున్నాం – వెంకటరమణ, ఈఈ, గుంతకల్లు డివిజన్**

కాలువల పక్క దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయాలని నిర్ణయించాం. అవసరమైన ప్రణాళిక తయారు చేస్తున్నాం. నివేదికను ప్రభుత్వానికి అందజేస్తాం. గుంతకల్లు బ్రాంచ్‌కాలువకు కొంత వరకు మరమ్మతులు చేశాం. ఇంకా పూర్తిస్థాయిలో పనులు చేయాల్సి ఉంది. దీంతో పాటు గుత్తి బైపాస్ కాలువకు ఆయకట్టు రోడ్డును నిర్మించడానికి చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం నిధులను విడుదల చేసిన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

# మూడేళ్ల కష్టాలకు ముగింపు



గోరంట్ల: జిల్లాలు ఏర్పడ్డాయని అందరూ మూడేళ్ల క్రితం సంతోష పడితే గోరంట్ల, అమడగూరు మండల ప్రజలు మాత్రం మానసిక వేదనకు గురయ్యారు. ఎందకంటారా నాడు ఏ నియోజకవర్గంలో ఉన్న మండలాలను అదే రెవెన్యూ డివిజన్‌లో ఉండేవి. అలాంటిది పెనుకొండలోని గోరంట్లను, కదిరిలో ఉన్న అమడగూరును పుట్టపర్తిలో కలపడంతో ఆ మండలాల ప్రజలు మూడేళ్లు నరకయాతన పడ్డారు.

**ఇబ్బందులు పడ్డ గోరంట్ల రైతులు**

ముఖ్యంగా గోరంట్ల మండలం బూదిలి, వడిగేపల్లి, పాలసముద్రం రెవెన్యూ గ్రామాల పరిధిలోని భూములను పారిశ్రామికవాడల ఏర్పాటుకు తీసుకున్నారు. ఆ సమయంలో పరిహారం పంపిణీ విషయంలో చాలా సమస్యలు తలెత్తాయి. అవన్నీ ఇప్పటికీ పూర్తిస్థాయిలో పరిష్కారం కాలేదు. అప్పటివరకు పెనుకొండ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఉన్న దస్త్రాలు డివిజన్ మార్పుతో పుట్టపర్తికి చేరినట్లు అధికారులు చెబుతూ వస్తున్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు రెండు కార్యాలయాల్లోనూ పరిష్కారం లభించక రెండుచోట్లకు తిరగడం తమవంతైందని వాపోయారు. ఈ క్రమంలో మళ్లీ డివిజన్ పెనుకొండకు మార్పు జరిగితే తమ భూపంపిణీ సమస్యలు పరిష్కారం అవుతాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**కూటమి ప్రభుత్వం నిర్ణయంతో మహర్దశ**

ఒక నియోజకవర్గ పరిధిలోని మండలాలన్నీ ఒకే రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉండాలన్న ప్రభుత్వ నిర్ణయంతో శ్రీసత్యసాయి జిల్లాలో రెండు మండలాల పరిధి మారబోతోంది.

**పుట్టపర్తిలోకి అమడగూరు**

పుట్టపర్తి నియోజకవర్గంలోని అమడగూరు మండలం కదిరి రెవెన్యూ డివిజన్ ఏర్పడినప్పటి నుంచి అక్కడే ఉంది. అయితే తాజా నిర్ణయంతో పుట్టపర్తి డివిజన్ పరిధిలోకి రానుంది. ఇప్పటికే పోలీసు డివిజన్ కూడా ఒకనియోజకవర్గ పరిధిలో ఉన్న నిబంధనతో కదిరి నుంచి పుట్టపర్తికి మారింది.

**పరిష్కారంపై ఆశాభావం**

–చంద్రానాయక్, బీఎన్‌తండా, గోరంట్ల మండలం

గోరంట్ల మండలాన్ని పెనుకొండ నుంచి పుట్టపర్తి రెవెన్యూ డివిజన్‌కి మార్చడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. 2008లో ప్రత్యేక ఆర్థిక మండలి కోసం ప్రభుత్వం సేకరించిన పొలాల సమయంలో నాభూమి పోయింది. అప్పట్లో నాపేరు చంద్రానాయక్ బదులుగా చంద్రాబాయి అని చెక్కులో రాశారు. ఆ సమస్య నేటికి పరిష్కారం కాక పెనుకొండ, పుట్టపర్తికి తిరుగుతున్నా. కనీసం ఇప్పుడైనా సమస్య పరిష్కారం అవుతుందని ఆనందంగా ఉంది.

# అధి'కార్లు.. చూడండి'!!

సింహాచలం : సింహాచలం అప్పన్న స్వామిని దర్శించుకోవడం కన్నా వాహనాల పార్కింగ్ చోటు వెతుక్కోవడానికే అధిక సమయం పడుతోందని భక్తులు వాపోతున్నారు. ఇక్కడికి వచ్చే భక్తుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. సొంత వాహనాల్లో వచ్చే వారు గణనీయంగా ఉంటున్నారు. సింహగిరికి వచ్చే ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలకు సరైన పార్కింగ్ ప్రదేశాలు లేకపోవడంతో ఇబ్బంది తప్పడం లేదు.

అరకొర వసతులు: అప్పన్న కొండకు నిత్యం వందలాది వాహనాలు వస్తుంటాయి. శని, ఆదివారాలు, సెలవు రోజుల్లో సుమారు 1,500 వరకు నాలుగు చక్రాలు, 3 వేల వరకు ద్విచక్రవాహనాలు వస్తున్నాయి. కానీ, 250 కార్లు, 500 ద్విచక్ర వాహనాల పార్కింగ్‌కు మాత్రమే సింహగిరిపై స్థలం అందుబాటులో ఉంది. రద్దీ రోజుల్లో భక్తుల దర్శనానికి కనీసం రెండు గంటల సమయం పడుతోంది. అనంతరం పార్కింగ్ నుంచి వాహనాలను బయటకు తీసుకురావడం భక్తులకు కష్టతరంగా మారుతోంది. ప్రముఖులెవరైనా వస్తే రాజగోపురం వరకు వాహనాలను తీసుకెళ్తున్నారు.

**వాహనాలు నిలిపేదిక్కడ..**

రాజగోపురం ఎదురుగా



జోడుభద్రాలు ప్రాంగణం
గజపతి సత్రం మార్గం
వసతి గృహాల ప్రాంతం
హిల్‌టాప్ రహదారి బీ పాదాలమ్మ గుడి ప్రాంగణం ద్విచక్ర వాహనాలకు లోవతోట బీ అన్నదానం భవనం సమీపంలో.

ఇవి నిండిపోతే వైకుంఠవాసుల మెట్ట మార్గం, హిల్‌టాప్ రహదారి కొండపైకి వాహనాలు మళ్లిస్తున్నారు. కొన్నిసార్లు ఘాట్రోడ్డుకు ఇరువైపులా భక్తులు పార్కింగ్ చేస్తున్నారు. దీంతో తరచూ సింహగిరిపై ట్రాఫిక్ సమస్యలొస్తున్నాయి.

ముందస్తు ప్రణాళికతో ఉపశమనం..: అప్పన్న కొండకు వచ్చే భక్తుల సంఖ్యకు అనుగుణంగా రాబోయే ముప్పై ఏళ్ల అవసరాలకు తగినట్లు పార్కింగ్ ప్రాంగణాలను అభివృద్ధి చేయకుంటే అవస్థలు తీవ్రమవుతాయని నిపుణులు చెబుతున్నారు. సింహగిరిపై ఉన్న ఖాళీ ప్రదేశాలను సద్వినియోగం చేసుకోవడం లేదని విమర్శలున్నాయి. తొలుత పార్కింగ్ ప్రదేశాలను నిర్మించి ఇతర నిర్మాణాలపై దృష్టి సారించి ఉంటే ప్రయోజనకరంగా ఉండేదన్న సూచనలొస్తున్నాయి.

# అదిగో జాగా.. వేసెయ్ పాగా!

అనకాపల్లి : జిల్లాలో ఎక్కడ సెంటు స్థలం కనిపించినా అక్రమార్కులు వాలిపోతున్నారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ)కి చెందిన ఖాళీ స్థలాల్లోనూ పాగా వేస్తున్నారు. రహదారి పక్కన సెంటు స్థలం రూ. లక్షల్లో పలుకుతుండటంతో ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. జాతీయరహదారి అభివృద్ధి, విస్తరణ సమయంలో భూములు, స్థలాలు కోల్పోయి.. పరిహారం పొందిన వారే మళ్లీ ఆయా స్థలాలను ఆక్రమించుకుని నిర్మాణాలు చేస్తున్నారు. తొలుత తాత్కాలికంగా షెడ్లు, పాకలు వేసి.. తర్వాత కొంతకాలానికి శాశ్వత నిర్మాణాలు చేస్తున్నారు.

జిల్లాలో 68 కి.మీ. పొడవునా జాతీయ రహదారి ఉంది. పలు ప్రాంతాల్లో ఎన్‌హెచ్‌ఏఐకు ఖాళీ స్థలాలున్నాయి. వీటిపై పర్యవేక్షణ కరవవడంతో కబ్జాలకు గురవుతున్నాయి. రోడ్డు పరిధిలో సెంటు స్థలం కూడా రూ. 15 లక్షలకు పైనే పలుకుతోంది. దీంతో ఆక్రమణలు యథేచ్ఛగా జరుగుతున్నాయి.

అనకాపల్లి నుంచి సబ్బవరం నడుమ రేబాక పంచాయతీలో సర్వే నం. 10–2, 41–3లోని భూములు ఆక్రమణకు గురయ్యాయి. రేబాక, కాపుశెట్టిపాలెం, పొడుపులమ్మ తల్లి ఆలయం ప్రాంతాల్లో గతంలో హైవే కోసం భూములు కోల్పోయిన వారికి ఎన్‌హెచ్‌ఏఐ నుంచి పరిహారం లభించింది. రహదారి నిర్మాణానికి వినియోగించగా పక్కన కొంత స్థలం మిగిలింది. గతంలో ఎవరైతే పరిహారం పొందారో.. వారే ఇప్పుడు ఆయా స్థలాలను ఆక్రమించేస్తున్నారు. ఇక్కడే హైఓల్టేజీ విద్యుత్తు లైన్లు, భూగర్భ పైపులైన్లు ఉన్నాయి. ఆక్రమణదారులు అవేవీ పట్టించుకోవడం లేదు.

అనకాపల్లి పట్టణ పరిధిలోని డబుల్ ట్రంపెట్ అండర్ బ్రిడ్జిని ఆనుకొని ఒక ప్లైవుడ్ దుకాణం ఏర్పాటు చేశారు. అలాగే మరోపక్క టింబర్ డిపో పెట్టారు. వాస్తవానికి అండర్ బ్రిడ్జి పక్కన కనీసం పది మీటర్ల



స్థలం వదలాలి. కానీ.. ప్లైవుడ్ తయారీ సముదాయాన్ని నిర్మించేశారు. ఆక్రమణలపై ఫిర్యాదులు అందడంతో ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చారు. కానీ ఇప్పటికీ చర్యలు చేపట్టలేదు.

అనకాపల్లి నుంచి గాజువాక వైపు వెళ్లే రహదారిలో కొప్పాక, సిరసపల్లి, మారేడు పూడి, సాలాపువానిపాలెం, లంకెలపాలెం వద్ద జాతీయ రహదారి వెంబడి ఆక్రమిత స్థలాల్లో దుకాణ నిర్మాణాలు చేపట్టారు. ఇవి ఇంకా విస్తరిస్తున్నారు. కొత్తూరు కాలేజీ జంక్షన్ నుంచి ఎస్.రాయవరం, నక్కపల్లి వద్దా ప్రభుత్వ జాగాలు కబ్జాకు గురవుతున్నాయి.

నోటీసులు ఇస్తున్నాంజాతీయ రహదారికి ఆనుకుని అక్రమంగా చేపడుతున్న నిర్మాణాలు, షెడ్లను గుర్తిస్తున్నాం. ఆయా యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నాం. ఇచ్చిన గడువులోగా స్థలాలను ఖాళీ చేయకపోతే చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.

– ప్రభాత్ రంజన్, ఎన్‌హెచ్‌ఏఐ పీడీ, విశాఖపట్నం

# బ్రో.. ఆడేద్దామా..!

తిరుపతి : ఏర్పేడు, న్యూస్‌టుడే: నిత్యం పుస్తకాలతో కుస్తీపడుతూ సాంకేతిక పరిశోధనలపై దృష్టి సారించే ఐఐటీ విద్యార్థుల్లో మానసికోల్లాసం కలిగించేందుకు ఆటల పోటీలు నిర్వహించనున్నారు. ఇందుకు తిరుపతి, హైదరాబాద్, మద్రాస్ ఐఐటీలు సంయుక్త వేదికలు కానున్నాయి. ఈ నేపథ్యంలో దేశంలోని 23 ఐఐటీల విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి.. వారిలోని ఛాంపియన్‌లను ప్రకటించనున్నారు. ఒక్కో ఐఐటీ నుంచి 230 మంది క్రీడాకారులు బరిలోకి దిగనున్నారు. ఈ నేపథ్యంలో సుమారు ఐదు వేల మందితో క్రీడాపోటీలను వైభవంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా క్రీడలను విభజించి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడులోని ఐఐటీల్లో నిర్వహించేందుకు శ్రీకారం



చుట్టారు. దీనిపై ఇప్పటికే అన్ని ఐఐటీలకు మార్గనిర్దేశకాలు జారీ చేశారు.

**ఎప్పటి నుంచి అంటే..**

డిసెంబర్ 14 నుంచి తొమ్మిది రోజులు.

ఎక్కడెక్కడ ఏయే క్రీడలు

తిరుపతి: చెస్, వెయిట్ లిఫ్టింగ్, టెన్నిస్.

హైదరాబాద్: మహిళలు, పురుషుల విభాగాల్లో అథ్లెటిక్, వాలీబాల్, పురుషుల విభాగంలో క్రికెట్, ఫుట్‌బాల్, హాకీ.

మద్రాస్: మహిళలు, పురుషుల విభాగంలో బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, టేబుల్ టెన్నిస్.

# ‘ముఖం’ చూపెట్టి.. విధులు ఎగ్గొట్టి

కర్నూలు : గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ గాడితప్పుతోంది. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో.. ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఒక్కో సచివాలయంలో 10- 8 మంది ఉద్యోగులు ఉండాలి.. కానీ ఏ సచివాలయంలో చూసినా ఇద్దరో, ముగ్గురో అందుబాటులో ఉంటున్నారు. సర్వేల పేరుచెప్పి బయటికి వెళ్లిపోతు న్నారు. మరికొందరు ముఖహాజరు విధానాన్ని దుర్వినియోగం చేస్తూ.. విధులకు డుమ్మా కొడుతున్నారు. సచివాలయ పరిధిలోకి వచ్చి చరవాణి ద్వారా ముఖ హాజరు వేసుకుని.. ఉడాయిస్తున్నారు. మరికొందరు ఇళ్ల నుంచే హాజరు వేసుకుంటుండగా.. కొందరైతే తోటి సిబ్బందికి వీడియోకాల్ చేసి ఆ చిత్రం ఆధారంగా ముఖ హాజరు నమోదు చేసుకుంటూ విధులకు ఎగనామం పెడుతుండటం గమనార్హం. అటు సర్వేలు పూర్తి చేయక.. ఇటు సచివాలయంలో అందుబాటులో లేకుండా తప్పించుకు తిరుగుతున్నా పట్టించుకునే వారు కరవయ్యారని ప్రజలు విమర్శిస్తున్నారు.



**మధ్యాహ్నం నుంచి విధులకు దుమ్మా**ఉమ్మడి కర్నూలు జిల్లాలో 1,188 గ్రామ, వార్డు సచివాలయాలుం డగా.. 9,423 మంది ఉద్యోగులు విధులు నిర్వర్తిన్నారు. వీరిలో బుధవారం ఉదయం 10.30 గంటల్లోపు 5,670 మంది ముఖహాజరు వేశారు. సాయంత్రం 5 గంటల తర్వాత 2,695 మంది అంటే ఉదయం హాజరు వేసిన వారిలో సగం మంది కంటే తక్కువగానే 48 శాతం వరకు హాజరు వేశారు.

**పురోగతి లేని సర్వేలు**

సర్వేల పేరు చెప్పి బయటికి వెళ్తున్నా అవీ సక్రమంగా చేస్తున్నారా అంటే అదీ లేదు. ఆగస్టు నెల నుంచి కౌశలం సర్వే చేపడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 2 లక్షల మందిని సర్వే చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 1.52 లక్షల మంది వివరాలే సేకరించారు.

హౌస్‌హోల్డ్ ఈ-కేవైసీ (కుటుంబంలో పౌరులకు ఈ.కేవైసీ) సర్వే సైతం సక్రమంగా సాగడం లేదు. జిల్లాలో 2.60 లక్షల మందికి గాను 25,770 మందికి మాత్రమే ఈకేవైసీ పూర్తిచేశారు. 90.13 శాతం పెండింగ్‌లో ఉంది.మ్యాండేటరీ బయోమెట్రిక్ అప్‌డేషన్‌ను 2.08 లక్షల మందికి చేయాల్సి ఉండగా.. 52,256 మందికి (25.12 శాతం) చేశారు.

5 నుంచి 17 ఏళ్లలోపు పిల్లలకు చేపట్టిన బయోమెట్రిక్ అప్డేషన్ కర్నూలు జిల్లాలో 99.23, 97.58 శాతం పెండింగ్‌లో ఉంది.

నిత్యం పాఠశాలలు, కళాశాలలను తనిఖీలు చేయాల్సి ఉండగా నామమాత్రంగానే సాగుతోంది.

సచివాలయాలు : 672

మొత్తం ఉద్యోగులు : 5,045 మంది

ఉదయం హాజరు వేసిన వారు : 3,030 మంది

సాయంత్రం హాజరు వేసిన వారు : 1,223

సెలవులో ఉన్న వారు : 191

పదోన్నతిపై వెళ్లిన వారు 75 మంది

# నియంత్రికల్లో నిలువు దోపిడీ

నంద్యాల : విద్యుత్తు నియంత్రికల బిగింపులో సంబంధిత శాఖ అధికారులు మాయ చేస్తున్నారు. వినియోగదారుల అవసరం, అవగాహన లేమి విద్యుత్తు శాఖ అధికారులకు కాసులు కురిపిస్తోంది. కొత్తవి బిగించకుండా.. ఉమ్మడి జిల్లాలో గోదాములో మూలన పడి ఉన్న వాటికి పాతవి తీసుకొచ్చి అమర్చారు. ఇందులో విద్యుత్తు శాఖకు చెందిన కొందరు ఉద్యోగుల పాత్ర ఉన్నట్లు తెలుస్తోంది. కొన్నిచోట్ల వినియోగదారుడిని ఏమార్చి వీటిని ఏర్పాటు చేయగా మరికొన్ని చోట్ల వినియోగదారుని అంగీకారంతోనే బిగించారు. విద్యుత్తు శాఖ లెక్కల్లో మాత్రం కొత్తవి బిగించినట్లే పద్దులు రాసుకొన్నారు.

రూ.20 కోట్ల వరకు పక్కదారినంద్యాలలో ఓ వాణిజ్య ప్రాంతంలో 25 కేవీ నియంత్రిక కోసం వినియోగదారుడు దరఖాస్తు చేస్తే పాతది ఏర్పాటు చేయడంతో గందరగోళం నెలకొంది. వినియోగదారుడు అధికారులతో వాగ్వాదానికి దిగగా పాతది తొలగించి కొత్తది ఏర్పాటు చేశారు. ఇలా రూ.4.25 కోట్ల విలువ చేసే 25 కేవీ నియంత్రికలు, రూ.16 కోట్ల విలువ చేసే 16 కేవీ నియంత్రికలు దారి మళ్లాయనే ఆరోపణలు ఉన్నాయి.

ఆ వివరాలు ఎక్కడానియంత్రికను ఎక్కడైనా బిగిస్తే ఆ వివరాలు మొత్తం ఆన్‌లైన్‌లో నమోదు అవుతాయి. నియంత్రిక సంఖ్య, తేదీ, ఇతర వివరాలు ఉంటాయి. ఒకవేళ పాత నంబరు ఇస్తే ఆ వివరాలు బయటకు వస్తాయి. కానీ ఉమ్మడి జిల్లాలో పాతవి ఎక్కడ బిగించారో వివరాలే లేవు.

# పోలీసుల జాగాకే దిక్కులేదు



గుత్తి : మా స్థలాలను ఇతరులు ఆక్రమించారు, తిరిగి అప్పగించి న్యాయం చేయాలంటూ బాధితులు పోలీసులను వేడుకోవడం పరిపాటి. గుత్తి పట్టణంలో పరిస్థితి భిన్నంగా ఉంది. తమ శాఖకు చెందిన విలువైన స్థలం కబ్జాకు గురైందని, సర్వే చేయించి హద్దులు చూపి, ఇప్పించాలంటూ పోలీసులు రెవెన్యూ అధికారులకు వినతి చేశారు. ఆక్రమణలను గుర్తించిన పోలీసులు రెవెన్యూ శాఖను సంప్రదించగా, అధికారులు ఎటూ తేల్చడం లేదు. కారణం ఆ స్థలాలను ఇచ్చింది, తిరిగి ఆక్రమణదారులకు ఇంటి పట్టాలుగా మంజూరు చేసిందీ రెవెన్యూ శాఖ కావడమే. **గుత్తి ఆర్‌ఎస్‌లోనూ..:** గుత్తి ఆర్‌ఎస్‌లోనూ ప్రభుత్వం రైల్వే పోలీసుల క్వార్టర్ల కోసం 50 ఏళ్ల కిందట బండిమోటు వీధిలో సుమారు 50 సెంట్లు స్థలం కేటాయించింది. అక్కడ పోలీసులకు క్వార్టర్లు నిర్మించడంతో పాటు తాగునీటి కోసం ఓ బావిని తవ్వించింది. కొన్నాళ్లకు ఆ స్థలంలో నిర్మించిన క్వార్టర్లు శిథిలమై కూలిపోయాయి. ఇదే అదనుగా కొందరు స్వార్థపరులు ఆ స్థలంపై కన్నేశారు. రూ.2కోట్ల విలువచేసే స్థలాన్ని ఆక్రమించి ఇళు నిర్మించుకున్నారు. ఇక్కడ స్థలం ఉన్న విషయం జీఆర్పీ పోలీసులకు తెలియదు. వాటికి పట్టాలు కూడా లేవు. ఇలా విలువైన స్థలాలు ఆక్రమణలకు గురవుతుండటం గమనార్హం.

**40 ఏళ్ల క్రితం..**గుత్తిలోని సర్వే నంబర్ 496లో 40 ఏళ్ల క్రితం అప్పటి రెవెన్యూ అధికారులు పోలీసు క్వార్టర్స్ కోసం నాలుగు ఎకరాల స్థలాన్ని కేటాయించారు. అందులో 2 ఎకరాల్లో పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ క్వార్టర్లు నిర్మించింది. మిగిలిన 2 ఎకరాల స్థలాన్ని ఆక్రమించుకున్న వారికి రెవెన్యూ శాఖ ఇంటి పట్టాలిచ్చేసింది. ఈ తతంగం తెలియని పోలీసులు ఇటీవల తమ స్థలాన్ని సర్వే చేయించగా, రెండెకరాలు ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు. ఇప్పుడు పోలీసులు తమ స్థలంలో పెట్రోలు బంకు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీన్ని ఆ స్థలంలో ఇళ్ల నిర్మించుకున్న ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. తమకు రెవెన్యూ అధికారులు పట్టాలిచ్చారని, అందుకే ఇళ్లను నిర్మించుకున్నామని, పన్నులూ కడుతున్నామని, ఆక్రమణ అని ఎలా అంటారని ప్రశ్నించారు. తమకు న్యాయం చేయాలంటూ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంను కలిసి విన్నవించారు. ఈ నేపథ్యంలో పోలీసులు ప్రజల నుంచి పట్టాల ప్రతులు తీసుకొని అవి అసలువా? లేక నకిలివా? తేల్చాలని రెవెన్యూ అధికారులకు నివేదించారు. ప్రస్తుతం పోలీసులు, ప్రజల మధ్య స్థల వివాదం రాజుకుంటోంది. ఇక్కడ సెంటు రూ.5లక్షలు ధర పలుకుతుండగా, రెండెకరాల స్థలం విలువ రూ.10కోట్లు ఉంది.

**రెవెన్యూ అధికారులే తేల్చాలి**

గుత్తి పట్టణంలో మా శాఖ స్థలం ఆక్రమణ అంశాన్ని రెవెన్యూ అధికారులే తేల్చాలి. ఇప్పటికే మేము విషయాన్ని వివరిస్తూ రెవెన్యూ అధికారులకు లేఖ రాశాం. మాకు కేటాయించిన స్థలంలో ఇతరులకు పట్టాలు మంజూరు చేయడం వల్లే సమస్య తలెత్తింది. అక్కడ ఇళ్లు నిర్మించుకున్న ప్రజల నుంచి ఇళ్ల పట్టాల ప్రతులను సేకరించి రెవెన్యూ అధికారులకు ఇచ్చాం. రామారావు, సీఐ, గుత్తి

# వాగు దాటాలంటే రూ.6 కోట్లు కావాలి!



ముదిగుబ్బ : ముదిగుబ్బ మండలంలోని మద్దిలేరు వాగు పారితే రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఒకటి కాదు, రెండు కాదు పదుల సంఖ్యలో గ్రామస్థులు వాగు దాటలేక ఎక్కడికక్కడ నిలిచిపోతున్నారు. అత్యవసరమైనా, ఆసుపత్రికెళ్లాలన్నా నరకయాతన పడాల్సి వస్తోంది. ముదిగుబ్బ నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న దొరిగల్లుకి దొరిగల్లు క్వార్టర్స్‌కు మధ్య మద్దిలేరు వాగు ఉంది. ఈ వాగుపై నిర్మించిన కల్వర్టు పూర్తిగా పల్లపు ప్రాంతం. యోగివేమన జలాశయం గేట్లు ఎత్తి మద్దిలేరు వాగు ద్వారా నీరు విడుదల చేస్తే కల్వర్టుపై 4 నుంచి 5 అడుగుల ఎత్తులో వరద ప్రవహిస్తుంది. దీంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి.

**ప్రతిపాదనలు సరే.. నిధులేవీ?**

మద్దిలేరు వాగుపై నిర్మించిన కల్వర్టు నీటి ఉద్ధృతికి దెబ్బతిని, పలుచోట్ల విరిగిపోవడంతో మరమ్మతులు చేశారు.

దొరిగల్లు, క్వార్టర్స్‌కు మధ్యలో రూ.6 కోట్ల అంచనాతో హైలెవెల్ వంతెన నిర్మాణానికి ఆర్‌అండ్‌బీ అధికారులు ఏటా ప్రతిపాదనలు పంపుతున్నారు. నిధులు మంజూరు కాకపోవడంతో వంతెన నిర్మాణానికి నోచుకోలేదు.జలాశయం సామర్థ్యం నిండి గేట్లు ఎత్తితే ఈ మార్గంలో చెక్‌పోస్టు పెట్టి రాకపోకలు నిలిపివేస్తున్నారు. దీంతో పులివెందుల నుంచి ముదిగుబ్బ మీదుగా వెళ్లే లారీలు, ఇతర వాహనాలన్నీ కదిరి, తలుపుల మీదుగా బెంగళూరుకు ప్రయాణం చేయాల్సి వస్తోంది. ముదిగుబ్బ నుంచి వెళ్లే వాహనాలు మరో 30 కిలోమీటర్లు చుట్టేసుకుని అదేమార్గంలో వెళ్లాల్సి వస్తుంది.


దొరిగల్లు గ్రామస్థులు వాగు ప్రవహించినప్పుడు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న ముదిగుబ్బకి రావాలంటే రాళ్లఅనంతపురం క్రాస్ మీదుగా లేదా టీఎన్‌పాళ్యం మీదుగా 15 కి.మీ. చుట్టేసుకుని రావాలి.

నిధులు రావాల్సి ఉంది

దొరిగల్లు దగ్గర హైలెవెల్ వంతెన నిర్మాణానికి రూ.6 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైతే రాకపోకలకు ఇబ్బంది లేకుండా వంతెన నిర్మిస్తాం.

వన్నూరుస్వామి, ఆర్‌అండ్‌బీ ఏఈ

# సాగు మిశ్రమం.. నిత్య ఆదాయం



కదిరి : వ్యవసాయంలో లాభనష్టాలు సర్వసాధారణం. ఎక్కువ విస్తీర్ణంలో ఒకే పంట సాగు చేసి గిట్టుబాటులో తేడా వస్తే జరిగే నష్టం అంతాఇంతా కాదు.. దీని నివారణకు రెడ్స్ సంస్థ మిశ్రమ పంటలను సాగు చేయిస్తోంది. అందుకు ఆకుకూరలు, కూరగాయల సాగుతో మహిళా రైతులను ప్రోత్సహిస్తోంది. లాభదాయక పంటలకు విత్తనాన్ని ఉచితంగా అందజేస్తోంది. సాగుకు సేంద్రియ పద్ధతిని జోడిస్తోంది. నీటి వనరుల పొదుపును పాటించేలా సదుపాయం కల్పిస్తోంది. తద్వారా తక్కువ విస్తీర్ణంలో పంటల సాగుతో నష్టాల్లేని, ఏనీ టైం మనీతో ప్రశాంత జీవనం సాగిస్తున్నట్లు మహిళా రైతు కుటుంబాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి.

**ఉచితంగా 24 రకాల విత్తనాలు** రెడ్స్ సంస్థ సహకారంతో సేంద్రియ, సుస్థిర సేద్యం వైపు మహిళా రైతులు అడుగులు వేస్తున్నారు. ఈ ఏడాది 70 ఎకరాల్లో సాగు లక్ష్యంగా కదిరి పరిసర గ్రామాలైన ఎగువ, దిగువపల్లి, దొన్నికోట, గూడమేకలపల్లి, మసకవంకపల్లిలో సాగు చేస్తున్నారు. వీరికి ఆకు, మొక్క, తీగ, కందజాతి (టమాట, వంగ, మిరప సాగుకు మొక్కలు, మెంతి, పలకలాగు, సిర్రాకు, తోటకూర, బెండ, బీర, కాకర, క్యారెట్, మిల్లంగి) వంటి 24 రకాల విత్తనాలు పొందారు. ఒక్కో రైతుకు ఎకరాలోపు విస్తీర్ణానికి సుమారు రూ.3 వేలు విలువైన కూరగాయల మొక్కలు, విత్తనాలను సంస్థ ఉచితంగా సమకూర్చింది. దీంతో సుమారు 450 మంది మహిళా రైతులు ప్రకృతి సేద్యం చేస్తున్నారు.

**నష్టాల్లేని నిలకడైన రాబడి**

సేంద్రియ ఎరువులు, చీడపీడల నివారణకు కషాయాల వాడకంతో ఖర్చు తక్కువ. అంతేగాకుండా తక్కువ విస్తీర్ణంలో మిశ్రమ సాగుతో ఒక పంట దెబ్బతిన్నా, ధర తగ్గినా మరో పంటతో నిలకడగా ఆదాయం. అందులోనూ నిరంతరాయంగా రాబడి వస్తూనే ఉంటుంది. ఇలా ఏడాది పొడవునా సంపాదన ఆగకుండా కుటుంబానికి ఇబ్బంది లేకుండా జీవనం సాగుతుందని రైతులు చెబుతున్నారు.

**సంతోషంగా ఉంది**

రెండు నెలల కిందట 20 సెంట్లలో ఆకుకూరలు, కూరగాయలు సాగు చేశా. ప్రస్తుతం టమాట, గోరుచిక్కుడు, బెండ, మిరప కోతకు వచ్చింది. రూ.5 వేలు మొదటి ఆదాయం లభించింది. మిగిలిన పంటలతో మరో మూన్నెళ్లు దిగుబడులు వస్తాయి. నిరంతరం ఏదోక దిగుబడితో ఆదాయం వస్తుందన్న ధీమా. పెట్టుబడి లేకుండా సొంత కష్టంతో ఆదాయం సమకూరటం సంతోషంగా ఉంది.

లక్ష్మీదేవి, గోపేపల్లి

# జనవరికే మార్కాపురం జిల్లా షురూ!

ఒంగోలు : మార్కాపురం జిల్లా ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం అడుగులేస్తోంది. జనవరి నాటికి సాకారమయ్యేవిధంగా కసరత్తు చేస్తోంది. ఇప్పటికే సమావేశమైన మంత్రులు నియోజకవర్గాలు, మండలాల మార్పులు, చేర్పులపై సమాలోచనలు జరుపుతున్నట్లు తెలిసింది. జిల్లా ఏర్పాటు విషయమై తొలుత మంత్రి మండలి ఆమోదం తెలిపిన అనంతరం ప్రజల నుంచి అభ్యంతరాల స్వీకరించి పరిశీలించనుంది. మంత్రి మండలి క్యాబినెట్‌లో ఆమోదం అనంతరం కార్యాలయాలు, సిబ్బంది సర్దుబాటుపై దృష్టిసారించనుంది. ఇప్పటికే కందుకూరు, అద్దంకి నియోజకవర్గాల్లోని మండలాలలను ప్రకాశం



జిల్లాలో కలిపేందుకు సానుకూలంగా ఉన్నారు.

అయితే దర్శి నియోజకవర్గంలో ఒకటి, రెండు మండలాలు ఒంగోలుకు దగ్గరగా ఉన్నందున ఇటు కలపాలని కొందరు అభ్యంతరాలు లేవనెత్తారు. ఇప్పటికే శ్రీశైలం మండలాన్ని మార్కాపురం జిల్లాలో కలపాలనే విషయమై వివాదం రేగడంతో మండలాల మార్పులు, చేర్పులు విషయాన్ని పక్కన పెట్టినట్లు సీనియర్ నాయకుడు ఒకరు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు జనవరి నాటికి మార్కాపురం జిల్లా ఏర్పాటు చేసి తీరుతామని మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి స్పష్టం చేశారు.

# పొగనారు... ధరల జోరు!

చీమకుర్తి: వాతావరణం అనుకూలించడంతో పొగనాట్లు ఊపందుకున్నాయి. మరోవైపు... మొంథా ప్రభావంతో నారుమళ్లు దెబ్బతినడంతో ఒక్కసారిగా నారుకు భారీగా డిమాండ్ ఏర్పడింది. తుపానుకు ముందు మూట ధర రూ.1200 నుంచి రూ.1500 ఉండగా... ప్రస్తుతం రూ.మూడు వేలకు పైగా పలుకుతుండడం గమనార్హం.

**కొట్టుకుపోయిన నారుమళ్లు**

ఒంగోలు ఒకటో వేలం కేంద్రం పరిధిలో ఉన్న చీమకుర్తి, సంతనూతలపాడు, ఒంగోలు గ్రామీణం మండలాల్లో ఏటా 15 వేల నుంచి 20 వేల ఎకరాల్లో పొగాకు సాగు చేస్తుంటారు. సాధారణంగా అక్టోబర్ పదో తేదీ నుంచి నాట్లు ప్రారంభమవుతాయి. ఈ ఏడాది సైతం రైతులు దుక్కులు దున్ని పొలాలను సిద్ధం చేశారు. కొంతమేర నాట్లు సైతం వేశారు. ఇంతలో భారీ వర్షాలు ముంచెత్తడంతో వేసిన నాట్లతో పాటు... మూసీ పరీవాహకంలోని మర్రిచెట్లపాలెం, అకర్లపూడి,



పెరిదేపి, చౌడారం తదితర ప్రాంతాల్లోని నారుమళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. కొందరు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సమీపంలోని దొమ్మేరు నుంచి నారు తెస్తుంటారు. అక్కడా ఇదే పరిస్థితి నెలకొంది.

**ఆదిలోనే అదనపు భారం**

గత వారం రోజులుగా ఎండలు కాస్తుండడంతో రైతులు ముమ్మరంగా నాట్లు వేస్తున్నారు. తగినంత నారు అందుబాటులో లేక ఒక్క సారిగా డిమాండ్ పెరిగింది. తుపానుకు ముందు, తరువాత ధరలను పరిశీలిస్తే రెట్టింపయ్యాయి. ఎకరాకు మూడు మూటల నారు పడుతుంది. పెరిగిన ధరల ప్రకారం రూ.6 వేలకు పైగా అదనంగా ఖర్చవుతోంది. బ్యారన్ పరంగా చూస్తే ఎంత తక్కువగా లెక్కించినా నారుకే రూ.50 వేలు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. ఈ ఏడాది పొగాకు ధరలు ఆశించిన స్థాయిలో లేవు. ఇంకా ఇరవై శాతం అమ్మకాలు జరగాల్సి ఉండడంతో... పెట్టుబడి ఖర్చులకు ఇబ్బంది పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఇదిగో ‘జాతీయ’హారం

ఏలూరు: జిల్లా మీదుగా వెళ్లనున్న పలు జాతీయ రహదారుల నిర్మాణానికి మార్గం సుగమవుతోంది. ఇప్పటికే అవసరమైన భూములు గుర్తించి సేకరించినా కొన్ని సర్వే నంబర్లలో భూ వివాదాలు తలెత్తాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో పనులు నిలిచిపోయాయి. కుటుంబ వివాదాలతో కొందరి నుంచి భూములను సేకరించలేకపోయారు..కొందరేమో ప్రతిపాదిత పరిహారం కన్నా ఎక్కువ చెల్లించాలని కోర్టుల్లో కేసులు వేశారు. ఇవన్నీ ప్రస్తుతం పరిష్కారమయ్యాయి. ఒకటి రెండు చోట్ల మాత్రమే చిన్న చిన్న వివాదాలు ఉన్నాయి. వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించి ఈఏడాది చివరికల్లా జిల్లాలో రహదారుల నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఎన్‌హెచ్ అధికారులకు లక్ష్యాన్ని నిర్దేశించారు. ప్రారంభం కాని చోట్ల వెంటనే మొదలు పెట్టాలని సూచించారు.

ఎన్‌హెచ్ 365 బీజీ : ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే

రహదారి నిర్మాణానికి 1151.66 ఎకరాలు అవసరం కాగా భూసేకరణ చేసి ఎన్‌హెచ్ అధికారులకు అప్పగించారు. గుత్తేదారు పనులు చేస్తున్నారు. అవి తుది దశలో ఉన్నాయి. అయితే దీని పరిధిలో కొందరు రైతులకు పరిహారం చెల్లింపు విషయంలో సమస్యలు రావటంతో వాటిని పరిష్కరించారు. కోర్టు వివాదాలు పరిష్కారమయ్యాయి. ఈఏడాది డిసెంబరు నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

చింతలపూడి, టి.నరసాపురం, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం 27

ఎన్‌హెచ్ 216 హెచ్ : పెడన- లక్ష్మీపురం

దీని నిర్మాణానికి 397.48 ఎకరాలు అవసరం. భూమిని గుర్తించి ఎన్‌హెచ్ అధికారులకు 3ఎ ప్రతిపాదనలు పంపారు. దాన్ని అనుసరించి గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయాలి.మండలం : నూజివీడు

ఎన్ని గ్రామాల మీదుగా 9

అమరావతి ఓఆర్‌ఆర్

1375.79 ఎకరాల భూమి అవసరం. ఇప్పటికే 3ఎ ప్రతిపాదనలు అమరావతిలోని ఎన్‌హెచ్ అధికారులకు పంపారు.

ఆరిగిపల్లి 11ఎన్‌హెచ్ 165 : పామర్రు-ఆకివీడు

198.2 ఎకరాల భూమి సేకరించి ఎన్‌హెచ్ అధికారులకు అప్పగించారు. రహదారి పనులు పురోగతిలో ఉన్నాయి. కైకలూరు వద్ద ఆర్వోబీ ఒకటి పెండింగ్‌లో ఉంది. దీనిపై కోర్టు వివాదం ఉంది. గత నెల 17న కౌంటర్ దాఖలు చేశారు. దీన్ని పూర్తి చేయించి పనులు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ఎన్‌హెచ్ అధికారులను ఆదేశించారు.

# చిక్కీ విప్పి చూడ చక్కెరుండు!

పుట్టపర్తి: మేం చేస్తూనే ఉంటాం.. మీరు చూస్తూనే ఉండండి అన్నట్లుంది మధ్యాహ్న భోజన పథకం సరకులు సరఫరా చేసే గుత్తేదారుల తీరు. పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్న లక్ష్యంతో మధ్యాహ్న భోజనం పథకం కింద ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా.. క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలు ఉండటం లేదు. ప్రధానంగా కోడిగుడ్లు, చిక్కీలు సరఫరాలో అవకతవకలు జరుగుతున్నాయి. కోడిగుడ్లను రెండు ఏజెన్సీలు, చిక్కీలను మరో ఏజెన్సీ సరఫరా చేస్తున్నాయి. వారానికోసారి కాకుండా.. నెలలో రెండుసార్లు ఇస్తున్నాయి. దీంతో ఎక్కువ రోజులు నిల్వ ఉంచి విద్యార్థులకు అందజేయాల్సి వస్తోంది. ఫలితంగా కోడిగుడ్లు పాడవుతుండగా చిక్కీలు దుర్వాసన వస్తున్నాయి.

**కాలం చెల్లిపోయి..**

చెన్నేకొత్తపల్లి ఉన్నత పాఠశాలలో కాలం చెల్లిన చిక్కీలు నిల్వ ఉన్నాయి. ఈ ఏడాది ఆగస్టు ఏడో తేదీకి ముగిసినట్లు చిక్కీ కవర్‌పై ముద్రించి ఉంది. కాలం చెల్లి మూడు నెలలు కావస్తున్నా గదిలోనే ఉంచారు. ఎంఈఓ 2 దృష్టికి తీసుకుపోగా పాఠశాలను సందర్శించి విచారిస్తామన్నారు. అగళి మండలం దొక్కలపల్లి, గ్యారగొండ్లపల్లి, నరసంబూది ప్రాథమిక పాఠశాలల్లో బుధవారం కోడిగుడ్లు, చిక్కీలు



ఇవ్వలేదు. ఈనెలలో దొక్కలపల్లిలో ఒక్కసారి కూడా ఇవ్వలేదని విద్యార్థులు చెబుతున్నారు.

కదిరి మండలం కొండమనాయునిపాల్యం జడ్పీ ఉన్నత పాఠశాలలో పరిశీలించగా 79 మందికిగాను 71 మంది హాజరయ్యారు. ఇక్కడ కొన్ని కోడిగుడ్లు పాడైపోవడం కనిపించింది. వాస్తవానికి కోడిగుడ్లు 45 నుంచి 55 గ్రాములుండాలి. కొన్ని తక్కువ బరువు ఉండటంతో ఉడికించిన తర్వాత విద్యార్థులు తినడానికి అనువుగా ఉండటం లేదు.

**జిగటగా అవుతాయంట..**

వాస్తవానికి చిక్కీలను బెల్లంతో తయారు చేయాలి. అయితే చక్కెర కలుపుతున్నారు. అలా చేయకపోతే జిగటగా అవుతాయని, కొంత శాతం చక్కెర కలుపుతున్నామని నిర్వాహకులు చెబుతున్నట్లు అధికారులు అంటున్నారు. ఎంత శాతం కలుపుతున్నారో తనిఖీ చేస్తేనే తెలుస్తుంది.

**గుత్తేదారులకు నోటీసులిస్తాం**

గుత్తేదార్లు కోడిగుడ్లు, చిక్కీలను నెలకు రెండుసార్లే సరఫరా చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. విద్యార్థులకు పంపిణీ చేయని రోజులకు బిల్లులు ఇవ్వం. కొన్ని బడుల్లో గుడ్లు పాడైపోవడం, చిక్కీల్లో చక్కెర ఉండటం, వాసన వస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాం. సంబంధిత గుత్తేదారులకు నోటీసులిచ్చి చర్యలు తీసుకుంటాం.

వినయ్‌మోహన్, ఏడీ

జిల్లా: శ్రీసత్యసాయి

ఎండీఎం పాఠశాలలు: 1,983

మొత్తం విద్యార్థులు: 1,16,520

# పేదల.. 'జాగా'రణ

తిరుపతి : రేణిగుంట మండల కేంద్రంలోని దాదాపు మూడువేల మందికి వైకాపా హయాంలో ఇంటి పట్టాలు ఇచ్చారు. ఎన్నికలకు ముందు ఈ మండలంలోని పాగలిలో స్థలాలు ఇస్తామని చెప్పినా ఎక్కడెక్కడ ఎవరెవరికి కేటాయించారో స్పష్టం చేయలేదు. దాంతో లబ్ధిదారులు అప్పట్లోనే ధర్నాకు దిగారు. ఎన్నికల్లో లబ్ధి పొందడానికే ఈ విధంగా చేశారని దుయ్యబట్టారు.

తమకు ఇళ్ల స్థలాలు చూపండంటూ లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాల్లో పెద్దఎత్తున వినతిపత్రాలు ఇస్తున్నారు. వైకాపా ప్రభుత్వంలో ఆ పార్టీ నేతలు క్షేత్రస్థాయిలో స్థలాలు చూపకుండానే పట్టాలు పంపిణీ చేసి మమ అనిపించారు. కూటమి ప్రభుత్వం స్పందించి ఇలాంటివారికి మేలుచేస్తే ప్రయోజనం ఉంటుంది.

**రూ.లక్ష వరకు వసూలు**

దరఖాస్తుదారుల్లో కొందరి నుంచి వైకాపా నేతలు రూ.లక్ష వరకు తీసుకుని స్థలాలు చూపించారు. శ్రీకాళహస్తి పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీ ఉదంతమే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ.

చిత్తూరులో అప్పట్లో ఓ తహసీల్దారు డబ్బులు తీసుకుని పట్టాలు ఇచ్చారే తప్ప స్థలం చూపలేదు. ఇందులో నేతలకూ వాటాలు అందాయి. లంచం ఇవ్వని పేదలకు రిక్తహస్తమే ఎదురైంది. కనీసం ఓ చిన్న గూడు లేనివారెందరో నేటికీ ఉన్నారు.



తిరుపతి, శ్రీకాళహస్తి, చిత్తూరులో అధికం

జగన్ ప్రభుత్వ హయాంలో 2020 డిసెంబరులో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో లబ్ధిదారులకు ఇంటి పట్టాలు ఇచ్చారు. పట్టణ ప్రాంతాల్లో సెంటు, గ్రామాల్లో సెంటున్నర స్థలం మాత్రమే కేటాయించారు. అదీ కొండలు, గుట్టల్లో చూపారు. దీంతో పునాదులు వేసుకోవడానికే రూ.2 లక్షల వరకు ఖర్చవుతుందని గృహ నిర్మాణాలకు వెనకడుగు వేశారు. వీరు కాకుండా ఇంకా ఎవరైనా మిగిలి ఉన్నా ఎప్పటికప్పుడు స్థలాలు చూపిస్తామని ప్రకటించారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఎన్నికల గడువు సమీపిస్తున్న తరుణంలో తిరుపతి, శ్రీకాళహస్తి, చిత్తూరు నియోజకవర్గాల్లో స్థానిక నాయకులు అధికంగా అర్జీలు తీసుకున్నారు.

**ఉన్న వాటిలోనైనా కేటాయిస్తే..**

ఇప్పటికీ కొన్ని కాలనీల్లో ఇంటి స్థలాలు ఖాళీగా ఉన్నాయి. రెండు జిల్లాల్లో కలిపి దాదాపు ఎనిమిది వేల మందికి సర్దుబాటు చేయవచ్చు. ఏ మండలంలోని తహసీల్దారు అక్కడ కేటాయిస్తే కొంతవరకు పేదలకు అవస్థలు తప్పుతాయి. తిరుపతి నియోజకవర్గంలోని అర్హులకు శ్రీకాళహస్తి, చంద్రగిరిలో స్థలాలు చూపించాలి. ఇప్పటికైనా ఆ దిశగా చర్యలు తీసుకుంటే పేదల సొంతింటి కల సాకారమవుతుంది.

**ఓట్లు దండుకునేందుకు వైకాపా మాయ**

'నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమంలో అర్హులందరికీ దరఖాస్తు చేసుకున్న 90 రోజుల్లో ఇంటి స్థలాలు కేటాయిస్తామని వైకాపా ప్రభుత్వం ఘనంగా ప్రకటించింది. సార్వత్రిక ఎన్నికలకు ముందు వరకూ అర్జీలు స్వీకరించింది. ఓట్లు దండుకోవడానికి 'ఇవిగో ఇంటి పట్టాలు' అంటూ కొందరికి ఆర్భాటంగా పంపిణీ చేశారు. ఏ ప్రాంతంలో స్థలాలు కేటాయించారని అడిగితే సమాధానం కరవైంది.

# ప్రవాహవేగం.. పడితే పోతుంది ప్రాణం!



ఆత్మకూరు : లైనింగ్ పనులు చేపట్టాక హంద్రీనీవా కాలువలో పరిస్థితి మారింది. ప్రస్తుతం నీటి రాకతో ప్రవాహ ఉద్ధృతి బాగా పెరిగింది. పనులు చేపట్టక ముందు దిగేందుకు, పైకి ఎక్కేందుకు వీలుండేది. ప్రాణాలు పోయేంత అంతటి ప్రమాదస్థితి ఉండేది కాదు. లైనింగ్ పనులు పూర్తయ్యాక ఆ అవకాశం లేదు. పొరబాటున నీటిలో పడితే ప్రాణాలను దక్కించుకోవడం కష్టంగా మారింది.

**ఆచూకీ గుర్తించడం కష్టమే..**

కళ్యాణదుర్గం–అనంతపురం జాతీయ రహదారి పంపనూరు వద్ద హంద్రీనీవా కాలువ వెళుతుంది. అదే ప్రదేశంలో ప్రయాణికులు నీటి కోసం లేదా స్నానం చేసేందుకు కాలువలోకి దిగి ప్రాణాలను కోల్పోతున్నారు. అత్యవసర సమయంలో కాలువలో నుంచి పైకి ఎక్కేందుకు ఏర్పాటు చేసిన మెట్లకు తగిలి ప్రమాదం బారిన పడుతున్నారు.

పంపనూరు తండాకు చెందిన లక్ష్మీనారాయణ నాయక్ హంద్రీనీవా కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రవాహానికి కొట్టుకుపోయి మృతి చెందాడు. మృతదేహాన్ని గుర్తించేందుకు మూడురోజులు పట్టింది. కురుగుంటకు చెందిన నారాయణస్వామి అంత్యక్రియలకు వెళ్లి స్నానానికి కాలువలో దిగి ప్రాణాలు కోల్పోయాడు. తర్వాత 40 కిలోమీటర్ల దూరాన మృతదేహాన్ని గుర్తించారు.

**సుడిగుండాలనూ దాటాలి..**

కాలువలో పడిన వారు ఈత వచ్చిన వారైతే నీటి వేగానికి కేవలం పైన ఉండేలా చూసుకుంటే 4 కి.మీ దాటాక పైకి వచ్చే వీలుంది. అయితే వంతెనలు ఉన్న ప్రాంతంలో సుడిగుండాలు మరింత ప్రమాదకరంగా ఉన్నాయి.

కాలువ వేగం, లోతుపై అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి అప్రమత్తం చేయాల్సి ఉంది. అపుడే ప్రజల ప్రాణాలు కాపాడే వీలుంటుంది.

**2100 క్యూసెక్కుల వరకు..**

కాలువ పక్కనే వాహనాలు నిలిపేందుకు అక్కడక్కడా స్థలం ఉంది. లారీ చోదకులు, అంత్యక్రియలకు వెళ్లి వచ్చినవారు లోతుపై అవగాహన లేకుండానే కాలువ వద్దకు వెళ్లి స్నానం చేస్తున్నారు.

గతంలో ప్రవాహం 1200 క్యూసెక్కులు మేర ఉండేది. నేడు 2100 క్యూసెక్కుల వరకూ ప్రవాహం మించుతోంది. కాలువలో పడిన వెంటనే వేగంగా ముందుకు వెళ్లిపోతారు. ఎదురీదాలన్నా ప్రయాసే.

# వైకాపా పాపం.. పట్టణ వాసులకు శాపం



మడకశిర : వైకాపా పాలనా వైఫల్యాలు పట్టణవాసులకు శాపంలా మారాయి. శుద్ధమైన తాగునీరు ఇప్పటికీ అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇందుకు నాన్ అమృత్ పథకం పనులే నిదర్శనం. తెదేపా ప్రభుత్వం 9 ఏళ్ల క్రితం మంజూరు చేసిన తాగునీటి పథకం ఇప్పటికీ పూర్తి కాలేదు. శుద్ధి చేసిన నీరు ఇళ్లకే వస్తాయని ఎంతో ఆశతో ఎదురుచూసిన ప్రజలకు నిరాశే మిగిలింది. మడకశిర చెరువులోని నీటిని శుద్ధి చేసి అక్కడి నుంచి కొండపై పెద్ద ట్యాంకు ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రస్తుతం ఈ పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వంలో అయినా పనులు పూర్తవుతాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**ప్రాజెక్టును గాలికి వదిలేశారు**


మడకశిర నగర పంచాయతీ పరిధిలోని 6200 ఇళ్లకు ఇంటింటికి కొళాయి ఏర్పాటు చేసి స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేసేందుకు లక్ష్యంగా 2016లో రూ.64కోట్లు ఏఐఐబీ నిధులతో నాన్ అమృత్ పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందులో ఓవర్ హెడ్ ట్యాంకులు ఓ ఫిల్టరేషన్ ప్లాంటు మడకశిర చెరువు కొండపై నుంచి పైప్‌లైన్లు, పంపుహౌస్‌లు, మోటార్లు, 64 కిలోమీటర్ల మేర అంతర్గత పైప్‌లైన్లు నిర్మాణం చేపట్టాల్సి ఉంది. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్లక్ష్యం చేయడంతో ఇప్పటికీ ఈ పథకం పూర్తి కాకపోవడంతో ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందించే లక్ష్యం నీరు గారింది.

**చేతులెత్తేసిన గుత్తేదారు**

ఇటువంటి పరిస్థితుల్లో తనకు గిట్టుబాటు కాదని, పనులు కొనసాగించలేమని మెగా కంపెనీ గుత్తేదారు చేతులెత్తేశారు. ఇప్పటికి దాదాపు 40శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు చేయాలంటే ప్రస్తుతం ఉన్న ధరల ఆధారంగా ఎక్కువ నిధులు అవసరం అవుతాయని అంచనా వేస్తున్నారు. వీటి కోసం మరోసారి టెండర్లు పిలవాల్సి వస్తోంది. అధికారులు ప్రతిపాదనలు పంపినా సాంకేతిక చిక్కుల కారణంగా ముందడుగు పడటం లేదు.

**టెండర్లు పిలిచాం** ప్రస్తుతం జరిగిన పనులకు సంబంధించి గుత్తేదారుకు ఎంతవరకు పని జరిగిందో అందుకు నిధులు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే కొత్తగా టెండర్లు పిలిచి రాష్ట్ర కమిటీకి వెళ్లింది. నిధులు సరిపోకపోవడంతో ఇప్పుడు కొత్తగా రూ.81 కోట్లతో అంచనా వేశాం. త్వరితగతిన పనులు ప్రారంభించే అవకాశం ఉంది. మురళీధర్, ఏఈ, మడకశిర

# ఇనాం భూముల్లో కబ్జాపర్వం



అనంతపురం : గత వైకాపా పాలనలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఆ పార్టీ నాయకులు సాగించిన కబ్జాపర్వం ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తోంది. కూడేరు మండలం ఉదిరిపికొండలో ఇనాం భూములు వైకాపా నాయకుల కబంధ హస్తాల్లోకి వెళ్లిపోయాయి. జాతీయ రహదారికి ఆనుకుని రూ.కోట్లు విలువైన భూమిని మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి మరికొందరితో కలిసి ఆక్రమించారు. తప్పుడు పత్రాలు సృష్టించి కుటుంబసభ్యుల పేరుతో నమోదు చేశారు. గత ప్రభుత్వంలో గుట్టుగా సాగిన వ్యవహారం అంతర్గత విభేదాలతో బయటపడింది. ఉదిరిపికొండ రెవెన్యూ పరిధిలోని 486 సర్వే నంబరులో 24.46 ఎకరాలు, 489లో 4.71 ఎకరాల భూమిని అప్పట్లో చేతివృత్తిపై ఆధారపడిన కమ్మర సామాజికవర్గానికి చెందిన కుటుంబానికి ఇనాంగా అందించారు. గ్రామ డైగ్లాట్‌లోనూ అలాగే నమోదు చేశారు. కొన్ని దశాబ్దాలుగా భూమి వారి ఆధీనంలోనే ఉంది. కుటుంబ విభజన అనంతరం కొందరు ఇతర ప్రాంతాలకు వెళ్లి స్థిరపడ్డారు. ఖాళీగా ఉన్న భూమిపై అదే గ్రామానికి చెందిన బైరెడ్డి కుటుంబం కన్ను పడింది. ఇనాందారుల వారసులను బెదిరించి 486 సర్వే నంబరులోని భూమిని స్వాధీనం చేసుకున్నారు. విధిలేని పరిస్థితుల్లో ఇనాందారులు సర్వే నంబరు 489లోని 4.71 ఎకరాలకు పరిమితమయ్యారు. ఆ భూమికి మాత్రం రైత్వారీ పట్టా పొంది సాగు చేసుకుంటున్నారు.

**రైత్వారీ పట్టాలేకుండానే..**

రాజకీయ పలుకుబడి ఉపయోగించి వీఆర్వోల ద్వారా 486 సర్వే నంబరుపై రికార్డుల్లో తమ పేర్లు ఎక్కించుకున్నారు. వాటిని ఆధారంగా చూపి అడంగల్, 1బీ పత్రాల్లో నమోదు చేయించుకున్నారు. భార్య, మరదలి పేరిట 8.15 ఎకరాలు, మిగిలిన భూమిని బంధువుల పేరుతో నమోదు చేశారు. నిబంధలన మేరకు ఇనాందారుల భూమిని కొనుగోలు చేసి ఉండి.. సెటిల్‌మెంట్ అధికారి ద్వారా రైత్వారీ పట్టా పొందితేనే హక్కులు వస్తాయి. రామచంద్రారెడ్డి కుటుంబం భూమి కొనుగోలు చేసినట్లు రికార్డుల్లో లేదు. సదరు సర్వేనంబరుపై రైత్వారీ పట్టా ఇవ్వలేదని సెటిల్‌మెంట్ అధికారి కార్యాలయ అధికారులు చెబుతున్నారు.

**రూ.25 కోట్ల పైమాటే..**

కబ్జా చేసిన 24 ఎకరాల భూమి అనంతపురం–బళ్లారి జాతీయ రహదారికి ఆనుకుని ఉంది. బహిరంగ మార్కెట్‌లో ఎకరా రూ.కోటిపైనే పలుకుతోంది. ఈ లెక్కన విలువ రూ.25 కోట్ల పైమాటే. ఈ భూమిలో ఇప్పటికే కొంతభాగం విక్రయించారు. మరికొంత బ్యాంకుల్లో తనఖా పెట్టి రుణాలు పొందారు. ఇనాం భూముల పరాధీనంపై కూడేరు ఇన్‌ఛార్జి తహసీల్దార్ మహబూబ్‌బాషాను వివరణ కోరగా విషయం తమ దృష్టికి రావడంతో విచారణ చేపట్టాం. రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యులకు ఇప్పటికే నోటీసులు ఇచ్చామని పేర్కొన్నారు.

# పాలన.. ప్రక్షాళన

చిత్తూరు : పల్లె పాలనలో కూటమి ప్రభుత్వం ప్రక్షాళన చేపట్టింది.. క్లస్టర్ వ్యవస్థతోపాటు గ్రేడ్–4, 5 పంచాయతీలు రద్దుచేసి గ్రేడ్–3కే పరిమితం చేసింది.. గ్రామ సచివాలయ వ్యవస్థను వాటికి అనుసంధానం చేసి.. స్వతంత్ర పాలనా యూనిట్లుగా పంచాయతీలను ప్రకటించి సంస్కరణల అమలుకు శ్రీకారం చుట్టింది.

**విభజన ఇలా.**

పదివేల జనాభా లేదా ఏడాదికి రూ.కోటి ఆపై ఆదాయం ఉన్న కాణిపాకం, గంగవరం, కార్వేటినగరం, వీకోట పంచాయతీలను రూర్బన్ పంచాయతీలుగా ఎంపిక చేశారు. నాలుగువేల నుంచి పదివేల మంది జనాభా, ఏడాదికి రూ.50 లక్షలు ఆపై ఆదాయం లేదా మండల కేంద్రంగా ఉన్న 61 గ్రేడ్–1 పంచాయతీలు ఎంపిక చేశారు.

214 పంచాయతీలను గ్రేడ్–2గా, 417 పంచాయతీలను గ్రేడ్–3గా ఎంపిక చేశారు.



**ఉద్యోగోన్నతులు సైతం..**

– సుధాకర్‌రావు, డీపీవో, చిత్తూరు

గ్రేడ్–4, 5 కార్యదర్శులకు గ్రేడ్–3, 2 పంచాయతీ అభివృద్ధి అధికారులు(పీడీవో)గా ఉద్యోగోన్నతి కల్పించనున్నారు. క్లస్టర్ వ్యవస్థలు రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పంచాయతీరాజ్ కమిషనరేట్ నుంచి ఆదేశాలు రాగానే నూతన విధానం అమల్లోకి వస్తుంది. జిల్లాలో గ్రామ పంచాయతీలు : 696

రూర్బన్ పంచాయతీలు : 4 గ్రేడ్–1 పంచాయతీలు: 61 గ్రేడ్–2: 214 గ్రేడ్–3: 417

# గుట్కా.. గుట్టలుగా

పుత్తూరు : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గుట్కా క్రయవిక్రయాలు చాపకింద నీరులా సాగుతున్నాయి. ప్రతి దుకాణంలో అమ్మకాలు.. కర్ణాటక నుంచి జిల్లాలోకి యథేచ్ఛగా సరఫరా అవుతున్నా.. అధికారులు నామమాత్రం తనిఖీలు నిర్వహించి చెక్‌పోస్టులు దాటిస్తూ రూ.లక్షలు దండుకుంటున్నారు. పలమనేరు, కుప్పం, పుంగనూరు ప్రాంతాల్లోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల నుంచి జిల్లాలోకి చేర్చుతున్నారు.

**శిక్షలు లేక..**

నోటి క్యాన్సర్లు వస్తున్నాయని దేశవ్యాప్తంగా గుట్కాలు నిషేధించారు. తయారీపై నిషేధం ఉన్నా జిల్లాలో నిత్యం లక్షల సంఖ్యలో ప్యాకెట్లు మార్కెట్‌లోకి చేరుతుండటం గమనార్హం. పట్టుబడిన నిందితులకు శిక్షలు పడిన దాఖలాలు లేకపోవడంతో యథేచ్ఛగా విక్రయాలు జరుగుతున్నాయి.

**కొన్ని పరిశీలిస్తే..** గతంలో పలమనేరులో రూ.కోటి విలువైన ప్యాకెట్లు నిల్వచేసిన గోదాంను అధికారులు తనిఖీ చేసి వాటిని స్వాధీనం చేసుకున్నారు. పుత్తూరు, నగరిలో రూ.5 లక్షల విలువైన సరకును



పట్టుకుని ఓ వ్యక్తిని అరెస్టు చేశారు.

రేణిగుంటలో రూ.2 లక్షల సరకు దొరికింది

సత్యవేడులో ఓ ఇంట్లో ఏ సంచిలో చూసినా అవే ప్యాకెట్లు ఉండటంతో పోలీసులు విస్తుపోయారు.

సగటున రూ.75 లక్షల వ్యాపారం

హెూల్‌సేల్ వ్యాపారులు బీడీ, సిగరెట్లు విక్రయించే వీధివ్యాపారుల ద్వారా చిన్న దుకాణాలకు గుట్కా సరఫరా చేస్తున్నారు. అతను ప్యాకెట్ రూ.5–10లకు విక్రయిస్తే క్షేత్రస్థాయిలో రూ.20 వరకు విక్రయిస్తున్నారు. పుత్తూరు, నగరి, సత్యవేడు, శ్రీకాళహస్తి, తిరుపతి వంటి ప్రాంతాల్లో రూ.లక్షల్లో వ్యాపారం సాగుతోంది. సగటున జిల్లాలో రూ.75 లక్షల వ్యాపారం ఉన్నట్లు అంచనా.

**చర్యలు తీసుకోవాలి**– డా.చంద్రశేఖర్, సూపరింటెండెంట్, పుత్తూరు

గుట్కా, పాన్‌మసాలాతో నోటి క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది. పిల్లలు సైతం వీటికి అలవాటు పడుతున్నారు. నిషేధిత ఉత్పత్తుల విక్రయాలపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి.

# ముద్ర పడితేనే ముద్ద..!

పుంగనూరు : రేషన్‌కార్డుదారులు నిత్యావసర సరకులు చౌకదుకాణాల ద్వారా పొందడానికి ఈ–కేవైసీ చేయించుకోవాలి. కార్డులో ఎంతమంది ఉంటే అందరూ వేలిముద్ర వేయాలి. ఈ విషయాన్ని రేషన్ డీలర్లు ఎంతగా ప్రచారం చేసినా వినియోగదారులు పట్టించుకోవడం లేదు. వేలిముద్ర వేస్తేనే ఐదు వేళ్లు లోపలికి వెళ్లే పరిస్థితి నెలకొంది.

రేషన్ పొందకుండా 8–12% మంది

ప్రతి నెలా 8 నుంచి 12 శాతం కార్డుదారులు రేషన్ సరకులు తీసుకోవడం లేదని గణాంకాలు చెబుతున్నాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం రేషన్‌కార్డులు పొంది సరకులు తీసుకోనివారు, డీలర్లు సక్రమంగా సరకులు ఇవ్వక తీసుకోలేని లబ్ధిదారులు, బోగస్ రేషన్‌కార్డులు, స్థానికేతరులు ఉన్నట్లు గుర్తించారు.

ఐదేళ్లకోసారి నవీకరణ

ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు రేషన్‌కార్డు కొలమానం. ఐదేళ్లకోసారి కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు అందులో వివరాలు నవీకరించాల్సి ఉంటుంది. చిన్నపిల్లలను చేర్చడం, చనిపోయినవారి పేర్లు తొలగించడం చేయాలి. అప్పుడే పథకాలకు ఎంత మంది అర్హులనే విషయాలు తెలుస్తాయి. ఇళ్ల స్థలాలు, పింఛన్లు మంజూరు కావాలంటే రేషన్‌కార్డే ప్రధానం. ఈ మధ్య చేపట్టిన ఈ–కేవైసీ కార్యక్రమంలో జిల్లాలో 74,955 మంది వేలిముద్ర వేయకపోవడంతో వీరు రేషన్ బియ్యానికి నోచుకోలేదు.

చర్యలు తీసుకుంటాం

– శంకరన్, డీఎస్వో, చిత్తూరు

జిల్లాలో ఇప్పటివరకు ఈకేవైసీ కాని లబ్ధిదారులు వెంటనే చేసుకోవాలి. కార్డులో ఉన్న ప్రతి ఒక్కరికి ఈ–కేవైసీ తప్పనిసరి. ఈ ప్రక్రియను వెంటనే పూర్తిచేయడానికి చర్యలు తీసుకుంటాం.

జిల్లా గణాంకాలిలా..

రేషన్‌కార్డులు 5,43,224

కార్డుల్లోని సభ్యులు 16,94,463

ఈ–కేవైసీ పూర్తయినవారు 15,71,016

పెండింగ్ 74,955

చురకలు



## పవన్ హీరోయిన్ హాఫ్ షోల్డర్ ఫ్రాక్ కిరాక్

పవన్ కల్యాణ్ సరసన తీన్ మార్ చిత్రంలో నటించింది కృతి కర్బంద. ఆ తర్వాత సుమంత్ బోణిలో నటించింది. ఈ రెండు అవకాశాలు తనకు ఏ విధంగాను కలిసి రాలేదు. అవి రెండూ ఫ్లాపులుగా మిగలడంతో ఆ తర్వాత బాలీవుడ్ లో కెరీర్ కోసం ప్రయత్నించింది. కానీ అక్కడ కూడా అంతంత మాత్రమే. అక్షయ్ హౌస్ ఫుల్ 4 లాంటి క్రేజీ మూవీలో నటించింది. అక్షయ్-పూజ.. తుషార్-కృతి సనోన్ .. బాబీ డియోల్- కృతి కర్బంద జంటల మధ్య పునర్జన్మల కథ తో తెరకెక్కిన ఈ చిత్రం అడల్ట్ కంటెంట్ కారణంగా, విమర్శల పాలైంది. అయినా బాక్సాఫీస్ వద్ద బాగానే వసూలు చేసింది. ప్రస్తుతం రిస్కీ రోమియో అనే చిత్రంలో నటిస్తోంది. కానీ ఈ సినిమా గురించిన సరైన వివరాలు వెల్లడి కాలేదు. కృతి ఇటీవల పూర్తిగా తన భర్త, కుటుంబంతో గడిపేందుకే ఎక్కువగా ప్రాధాన్యతనిస్తోంది. ఇటీవల ఈత కొలను వద్ద తన భర్త పుల్కిత్ సామ్రాట్ తో పాటు కనిపించింది. ప్రతిసారి భర్తతో కలిసి వెకేషన్స్ ప్లాన్ చేయడంలోను కృతి బిజీగా ఉంది. పుల్కిత్ ని సల్మాన్ ఖాన్ స్వయంగా హీరోగా పరిచయం చేయగా.. ఆరంభం రోహిరాతో డేటింగ్ చేశాడు. పాత గాళ్ ఫ్రెండ్ కి బ్రేకప్ చెప్పి తర్వాత కృతితో ప్రేమాయణం ప్రారంభించాడు. అదే సమయంలో కృతి కెరీర్ పరంగా ఎదిగేందుకు



ప్రయత్నిస్తూ, వాన్ అనే తమిళ చిత్రం సహా హిందీలో థైస్..14 పెరే అనే రెండు చిత్రాలతో బిజీ అయింది. కానీ ఇవేవీ తన భవిష్యత్ కి ఉపయోగపడలేదు. కృతి కర్బంద ఇతర వ్యాపకాలను పరిశీలిస్తే, ఇటీవల గ్లోబల్ స్పా కవర్ స్టార్ గా మారింది. దానికి సంబంధించిన ఫోటోషూట్ కూడా రివీలైంది. ఇప్పుడు అడపాదడపా తన కొత్త లుక్ కి సంబంధించిన ఫోటోగ్రాఫ్స్ ని కృతి ఇన్ స్టాలో షేర్ చేస్తుంటే అవన్నీ వైరల్ గా మారతున్నాయి. తాజాగా హాఫ్ షోల్డర్ ఫ్రాక్ లో కృతి అందాల ఎలివేషన్ యువతరంలో గుబులు పెంచుతోంది. మెరూన్ కలర్ ఫ్రాక్ ధరించిన కృతి, వీ లుక్ లో తన అందాలను ఎలివేట్ చేసింది. ఇక ఆ మెడలో లైట్ వెయిట్ పెండెంట్ ఎంతో అందంగా కనిపిస్తోంది. కృతి తనకు ఎలాంటి సినిమాల్లో నటించాలనుంది? అనేది ప్రశ్నిస్తే, దేవదాస్ రీమేక్ లో నటిస్తానని సమాధానమిచ్చింది. ఆదర్శవంతమైన రోజు సెలవు ఎలా ఉంటుందో కూడా కృతి వివరించింది. ఆశ్చర్యకరంగా ఆరోజు తన భర్త పుల్కిత్ సామ్రాట్ తనతో ఉండాలని చెప్పింది. నేను అతడితో పాడిల్ - పికిల్ ఆడటం ఇష్టపడతాను.. అని తెలిపింది. ఒక క్లాసిక్ సినిమా రీమేక్‌లో నటించే అవకాశం ఎప్పుడైనా లభిస్తే, రొమాంటిక్ డ్రామా దేవదాస్ ని ఎంపిక చేసుకుంది.

## డైరెక్టర్ కోసం హీరో వెయిటింగ్ !

అన్నీ అనుకున్నట్లు జరిగితే ఎల్ సీ యూ నుంచి ఖైదీ 2 ఇప్పటికే మొదలవ్వాలి. కానీ కార్తీ వేర్వేరు సినిమాలతో బిజీగా ఉండగా, లోకేష్ కనగరాజ్ తన పనుల్లో తాను బిజీగా ఉన్నాడు. మరి ఈ డిలేకి కారణం ఏంటి? అంటే? కొన్నాళ్ల పాటు డైరెక్షన్ పక్కన బెట్టి హీరోగా లక్ చెక్ చేసుకోవడమే. కూలీ రిలీజ్ అనంతరం లోకేష్ కనగరాజ్ హీరోగా మ్యాకప్ వేసుకున్న సంగతి తెలిసిందే. అరుణ్ మాథేశ్వర్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నాడు. లోకేష్ మార్క్ క్రైమ్ థ్రిల్లర్ కావడం..హీరో ఛాన్స్ అనే సరికి లోకేష్ కూడా వెయిటింగ్ ఎందుకనుకున్నాడో? ఏమో గానీ మారు మాట్లాడకుండా పట్టాలెక్కించాడు ప్రాజెక్ట్. డీసీ అనే టైటిల్ తో తెరకెక్కుతోన్న చిత్రమిది. మరి ఈ సినిమా రిలీజ్ ఎప్పుడు అంటే వచ్చే ఏడాది సమ్మర్ వరకూ రిలీజ్ కాదు. మరి ఖైదీ2 మొదలయ్యేది ఎప్పుడు? అంటే రిలీజ్ తర్వాతేనని తెలుస్తోంది. దీంతో లోకేష్ కోసం కార్తీ వెయిట్ చేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ప్రస్తుతం కార్తీ హీరోగా మార్షల్ అనే సినిమాలో నటిస్తున్నాడు. ఈ సినిమా తప్ప మరే సినిమా షూటింగ్ దశలో లేదు.



కార్తీ నటించిన వా వాతయార్ ఇప్పటికే రిలీజ్ కు రెడీ గా ఉంది. డిసెంబర్ లో ఆ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. కార్తీ నటిస్తోన్న మరో చిత్రం సర్దార్ 2 కూడా షూటింగ్ పూర్తి చేసుకుంది.

**కార్తీకి ఇదో కొత్త ఎక్స్ పీరియన్స్:** ప్రస్తుతం ఆ ప్రాజెక్ట్ పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. ఈ సినిమా వచ్చే ఏడాది ఆరంభంలో రిలీజ్ అవుతుంది. ఈ రెండు సినిమాలకు సంబంధించి కార్తీ కేవలం ప్రచార కార్యక్రమాల్లో మాత్రమే పూర్తి చేయాల్సి ఉంది. ఆ రెండు రిలీజ్ అయితే వాటి నుంచి పూర్తిగా రిలీవ్ అవుతాడు. మార్షల్ కూడా మరో రెండు..మూడు నెలల్లో షూటింగ్ పూర్తవుతుందని సమాచారం. ఆ తర్వాత ఖైదీ 2 మొదలయ్యే వరకూ కార్తీకి వెయిటింగ్ తప్పదు. ఆ వెయిటింగ్ లోకేష్ వల్లే. ఇలా డైరెక్టర్ కోసం హీరో వెయిట్ చేయడం అన్నది కార్తీ అనుభవంలో ఇదే తొలిసారి కావొచ్చు.

**కొత్త కథలు వినే ఛాన్సుంది:** సాధారణంగా హీరోల కోసం డైరెక్టర్లు వెయిట్ చేస్తుంటారు. కానీ లోకేష్-కార్తీ మధ్య సన్నివేశం అందుకు భిన్నంగా కనిపిస్తుంది. మరి ఈ గ్యాప్ లో కార్తీ ఏం చేస్తాడు? అంటే కొత్త కథలు వినడానికి అవకాశం ఉంది. మార్షల్ కూడా నత్తనడకన షూటింగ్ జరుతుంది. దీంతో కార్తీ కి సమయం ఎక్కువగానే దొరుకుతుంది. షూటింగ్ ఉంటే చేయడం లేదంటే కథలు వినడంపైనే దృష్టి పెడుతున్నట్లు తెలుస్తోంది.




## 'వారణాసి' టైటిల్ లో న్యూ ట్విస్ట్




టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు లీడ్ రోల్ లో దర్శకధీరుడు రాజమౌళి.. వారణాసి మూవీ రూపొందిస్తున్న సంగతి తెలిసిందే. ఫారెస్ట్ బ్యాక్ డ్రాప్ లో గ్లోబల్ అడ్వెంచర్ డ్రామాగా తెరకెక్కుతున్న ఆ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే పలు షెడ్యూళ్లు కంప్లీట్ చేసిన జక్కన్న.. ఇప్పుడు కీలక సీన్స్ ను చిత్రీకరిస్తున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో ముందు చాలా సైలెంట్ గా పనికానిచ్చిన జక్కన్న.. కొన్ని రోజులుగా వరుస అప్డేట్స్ ఇస్తున్నారు. మూవీలోని లీడ్ రోల్స్ లుక్స్ తో పాటు రీసెంట్ గా భారీ ఈవెంట్ ద్వారా టైటిల్ ను రివీల్ చేశారు. ముందు నుంచి అనుకున్నట్లుగానే వారణాసి పేరును ప్రకటించారు. కానీ అప్పుడే అసలు చర్చ మొదలైంది. ఎందుకంటే వారణాసి టైటిల్ ను ఇప్పటికే మరో టాలీవుడ్ నిర్మాణ సంస్థ రామభక్త హనుమ క్రియేషన్స్ బ్యానర్ రిజిస్టర్ చేసుకుంది. యంగ్ హీరో ఆది సాయి కుమార్ తో రఫ్ మూవీని తెరకెక్కించిన డైరెక్టర్ సీ. హెచ్ సుబ్బారెడ్డి.. ఆ సినిమాను తీస్తున్నారు. దీంతో అదే పేరుతో రాజమౌళి ఎలా రిలీజ్ చేస్తారోనని అంతా డిస్కస్ చేసుకుంటున్నారు. అయితే ఆయన.. వారణాసి టైటిల్ పై చిన్న అక్షరాలతో ఇంగ్లీష్ లో ఎస్ ఎస్ రాజమౌళి స్ అని వేశారు. దీంతో SS RAJAMOULI;S వారణాసి అనే టైటిల్ తో రిలీజ్ చేస్తారని కొందరు అంచనా వేశారు. ఇప్పుడు అదే నిజమని తెలుస్తోంది. తెలుగు టైటిల్ హక్కుల విషయంలో అలా గందరగోళం నెలకొనగా.. ఆ సందిగ్ధత తొలగినట్టుగా కనిపిస్తోంది. తెలుగులో రాజమౌళి వారణాసి అనే టైటిల్ తో సినిమాను విడుదల చేయనున్నారని సమాచారం. పాన్ వరల్డ్ రేంజ్ లో మిగతా భాషల్లో వారణాసి టైటిల్ తో సినిమాను రిలీజ్ చేయబోతున్నారని తెలుస్తోంది. త్వరలో ఆ విషయంపై సోషల్ మీడియాలో అధికారిక ప్రకటన కూడా ఇవ్వనున్నారని సమాచారం. తద్వారా తెలుగులో టైటిల్ పై ఎలాంటి ఇష్యూ రాకుండా రాజమౌళి ప్లాన్ చేసినట్లు సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ఇక సినిమా విషయానికొస్తే.. మహేష్ బాబు పవర్ ఫుల్ రోల్ రుద్రగా కనిపించనున్నారు. ప్రతినాయకుడిగా మాలీవుడ్ స్టార్ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ కుంభ పాత్రలో నటిస్తున్నారు. ప్రియాంక చోప్రా మందాకినిగా యాక్ట్ చేస్తున్నారు. ఆస్కార్ విన్నింగ్ మ్యూజిక్ డైరెక్టర్ సంగీతాన్ని అందిస్తున్నారు. దుర్గా ఆర్ట్స్ బ్యానర్ పై కేఎల్ నారాయణ భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. 2027 వేసవిలో మూవీని రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## మాస్ రాజా.. మళ్లీ హిట్ రూట్లోనే డబుల్ ప్లాన్



మాస్ మహారాజా రవితేజ ఎనర్జీకి తిరుగులేదు కానీ, బాక్సాఫీస్ లెక్కలు మాత్రం ఈ మధ్య అనుకూలంగా ఉండటం లేదు. వరుస పెట్టి సినిమాలు చేస్తున్నా, విజయాలు మాత్రం అందని ద్రాక్షలా మారాయి. ముఖ్యంగా ఈ మధ్య కాలంలో వచ్చిన 'మిస్టర్ బచ్చన్', 'మాస్ జాతర' ఫలితాలు రవితేజ మార్కెట్ ను గట్టిగానే దెబ్బతీశాయి. కనీసం ఓపెనింగ్స్ కూడా రాబట్టలేకపోవడం ఫ్యాన్స్ ను కలవరపెడుతోంది. దీంతో ఇప్పుడు రవితేజ ప్రయోగాలు పక్కన పెట్టి, ఒక పక్కా సేఫ్ ప్రాజెక్ట్ కోసం చూస్తున్నట్లు అర్థమవుతోంది. గత కొంతకాలంగా రవితేజ కెరీర్ గ్రాఫ్ గమనిస్తే, సోలో హీరోగా ఆయనకు వచ్చిన సాలిడ్ బ్లాక్ బస్టర్ కేవలం 'ధమాకా' మాత్రమే. మధ్యలో 'వాల్తేరు వీరయ్య' లాంటి మెగా హిట్ ఉన్నా, అది మల్టీస్టారర్ కాబట్టి క్రెడిట్ చిరంజీవికి కూడా వెళ్తుంది. ఇక రావణాసుర'టైగర్ నాగేశ్వరరావు, ఈగల్ వంటివన్నీ బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచినవే. అందుకే ఇప్పుడు మళ్ళీ తనకు కలిసొచ్చిన మ్యాజిక్ ను రిపీట్ చేయడానికి రవితేజ సిద్ధమవుతున్నాడు. లేటెస్ట్ గా ఇండస్ట్రీలో వినిపిస్తున్న వార్త ఫ్యాన్స్ లో కొత్త జోష్ నింపుతోంది. రవితేజకు 'ధమాకా' వంటి హిట్ ఇచ్చిన పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థ, ఇటీవల ఫిల్మ్ ఛాంబర్ లో "డబుల్ ధమాకా" అనే ఇంట్రెస్టింగ్ టైటిల్ ను రిజిస్టర్ చేయించిందట. ఈ టైటిల్ చూడగానే ఇది పక్కా రవితేజ కోసమే అని, మళ్ళీ ఆ హిట్ సెంటిమెంట్ ను వాడుకోబోతున్నారని ఇండస్ట్రీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఈ ప్రాజెక్ట్ కోసం పాత సక్సెస్ ఫుల్ కాంబినేషన్ ను రంగంలోకి దింపుతున్నట్లు టాక్. దర్శకుడు త్రినాథ రావు నక్కిన దర్శకత్వంలో, రవితేజ శ్రీలీల జోడీ మరోసారి సందడి చేసే అవకాశం ఉందని టాక్. గతంలో వీరిద్దరి కెమిస్ట్రీ, శ్రీలీల ఎనర్జిటిక్ డ్యాన్సులు సినిమా విజయానికి ప్రధాన కారణంగా నిలిచాయి. ఇప్పుడు 'డబుల్' అంటూ వస్తున్నారంటే, ఎంటర్టైన్మెంట్ డోస్ కూడా డబుల్ ఉండేలా ప్లాన్ చేస్తున్నారని తెలుస్తోంది. రవితేజ ఇటీవల మాస్ ఎంటర్టైనర్స్ తీసినా కూడా ఫ్లాప్స్ అవుతున్నట్లు మాస్ జాతర నిరూపించింది. అలాగని ఫ్యాన్స్ అవి కోరినట్లు కాదు. రెగ్యులర్ కంటెంట్ తో కాకుండా కాస్త కొత్తగా ఉండాలని కోరుకుంటున్నారు. ఇక ఇప్పుడు మళ్లీ సీరియస్ రోల్స్ కంటే, రవితేజ మార్క్ కామెడీ, మాస్ మేనరిజమ్స్ ఉంటేనే సినిమా సేఫ్ జోన్ లో ఉంటుందని మేకర్స్ గ్రహించినట్లున్నారు. వరుస డిజాస్టర్ల తర్వాత రవితేజ తీసుకున్న ఈ నిర్ణయం ఆయన కెరీర్ కు చాలా కీలకం కానుంది. హిట్ ఇచ్చిన బ్యానర్, కలిసొచ్చిన డైరెక్టర్, లక్కీ హీరోయిన్.. ఈ కాంబో కనుక సెట్ అయితే రవితేజ బౌన్స్ బ్యాక్ అవ్వడం ఖాయం. మరి కాంబినేషన్ పై అఫీషియల్ క్లారిటీ ఎప్పుడు వస్తుందో చూడాలి.

## ఎలాంటి హడావిడి లేకుండా బుట్టబొమ్మ బర్త్ డే పార్టీ

అనిఖా సురేంద్రన్ గురించి కొత్తగా పరిచయం అక్కర్లేదు. మలయాళ నటి అయిన అయిన అనిఖా బాల నటిగానే కెరీర్ ను స్టార్ట్ చేసింది. 2010లో మలయాళ సినిమా కదా తుడారున్నుతో నటిగా పరిచయమైన అనిఖా ఆ తర్వాత యెన్నై అరిందాల్, విశ్వాసం లాంటి సినిమాల్లో నటించి తన యాక్టింగ్ తో అందరినీ మెప్పించింది. 2013లో 5 సుందరికల్ సినిమాలో తన పాత్రకు బెస్ట్ చైల్డ్ ఆర్టిస్ట్ గా కేరళ రాష్ట్ర చలన చిత్ర అవార్డును గెలుచుకున్న అనిఖా తర్వాత కేవలం మలయాళంలోనే కాకుండా తమిళ, తెలుగు సినిమాల్లో కూడా నటిస్తోంది.

**21 ఏళ్లు పూర్తి చేసుకున్న బుట్టబొమ్మ...** తెలుగులో బుట్టబొమ్మ అనే సినిమాను చేసిన అనిఖా రీసెంట్ గా 21 ఏళ్లు పూర్తి చేసుకుంది. అయితే తన బర్త్ డే పార్టీని అనిఖా భారీగా కాకుండా తన ఇంట్లోనే ఫ్రెండ్స్ తో కలిసి చాలా సాదాసీదాగా సెలబ్రేట్ చేసుకుంది. ఈ పార్టీలో అందరూ ఎలాంటి హడావిడి లేకుండా చాలా సరదాగాగా



కనిపించారు. మామూలుగా సెలబ్రిటీలు ఎవరైనా తమ పుట్టినరోజులను చాలా గ్రాండ గా సెలబ్రేట్ చేసుకుంటారు. కానీ అనిఖా మాత్రం అందరికీ భిన్నంగా చాలా సైలెంట్ గా చేసుకుంది. బర్త్ డే పార్టీ ఫోటోలను అనిఖా సోషల్ మీడియాలో షేర్ చేయగా ఆ ఫోటోల్లో బుట్టబొమ్మ బ్లాక్ డ్రెస్ లో కేక్ పక్కన నిలబడి ఎంతో అందంగా కనిపించింది. అంతేకాదు, ఎలాంటి హంగూ ఆర్భాటాలు లేకుండా జరిగిన పార్టీ కావడంతో ఆ ఫోటోలు కూడా చాలా నేచురల్ గా అనిపిస్తున్నాయని నెటిజన్లు ఆ ఫోటోలకు కామెంట్స్ చేస్తున్నారు.

**2025లో కలిసి రాని లక్...** ఇక కెరీర్ పరంగా చూసుకుంటే అనిఖా సురేంద్రన్ ఈ ఇయర్ అనుకున్న రిజల్ట్ ను అందుకోలేకపోయింది. ఆల్రెడీ ఈ ఇయర్ అనిఖా నుంచి రెండు సినిమాలొచ్చాయి. నిలవకు ఎన్ మేల్ ఎన్నడి కోబమ్, ఇంద్ర అనే తమిళ సినిమాలు రిలీజవగా, ఆ రెండు సినిమాలూ ఆశించిన ఫలితాల్ని అందుకోలేకపోయాయి. మరి అనిఖాను సక్సెస్ దారిలోకి ఏ సినిమా తీసుకొస్తుందో చూడాలి.

## 2026 లో లేడీ సూపర్ స్టార్ లైనప్ ఇలా!

లేడీ సూపర్ స్టార్ నయనతార 2025 లో టెస్ట్ అనే ఒకే ఒక్క చిత్రంతో ప్రేక్షకుల్ని అలరించింది. గత ఏడాది కూడా బియోండ్ ది ఫెయిరీ టేల్ అనే చిత్రంతోనే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఇలా రెండేళ్ల కాలంలో కేవలం రెండు సినిమాలతోనే థియేటర్లోకి వచ్చింది. దీంతో వెండి తెరపై నయన్ కనిపించి చాలా గ్యాప్ వచ్చినట్లు అభిమానులు భావిస్తున్నారు. కానీ కొత్త ఏడాదిలో మాత్రం 2024-25 లెక్కలన్నింటిని సరిచేయబోతుంది.

అమ్మడు 2026లో వరుస సినిమాలతో అలరించడం ఖాయం. మనాన్ ఘాటీ సిన్స్ 1960 షూటింగ్ ఇప్పటికే పూర్తి చేసింది.

**ఆన్ సెట్స్ లో బిజీ బిజీగా:** ప్రస్తుతం ఆ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. వచ్చే ఏడాది ఆరంభంలోనే ఆసినిమా రిలీజ్ కానుంది. అలాగే తమిళ్, మలయాళంలో తెరకెక్కిన డియర్ స్టూడెంట్స్ అనే చిత్రం కూడా విడుదలవుతుంది. ఆసినిమా కూడా చిత్రీకరణ ముగించుకుని నిర్మాణానంతర పనుల్లో ఉంది. జనవరిలో సంక్రాంతి కానుకగా రిలీజ్ అవుతున్న మన శంకర వరప్రసాద్ గారు చిత్రంతోనూ అలరించనుంది. ఇందులో అమ్మడు మెగాస్టార్ చిరంజీవికి జోడీగా నటిస్తోన్న సంగతి తెలిసిందే. అలాగే టాక్సిక్ అనే పాన్ ఇండియా చిత్రంలోనూ కీలక పాత్ర పోషిస్తోంది. యశ్ హీరోగా నటిస్తోన్న చిత్రమిది.

**నయన్ నామ సంవత్సరం...** సమ్మర్ కానుకగా చిత్రం రిలీజ్ కానుంది. పేట్రియేట్ అనే మలయాళం చిత్రంలోనూ నటిస్తోంది. అలాగే తమిళ్



లో మూకుత్తి అమ్మన్ 2 , హాయ్,రఖియే అనే మరో మూడు చిత్రాల్లోనూ నటిస్తోంది. ఈ మూడు షూటింగ్ దశలో ఉన్నాయి. వీటిలో రెండు చిత్రాలు 2026 మిడ్ లో, మరో సినిమా ఏడాది ముగింపులో రిలీజ్ కానున్నాయి. తాజాగా నటసింహ బాలకృష్ణ 111వ చిత్రంలోనూ హీరోయిన్ గా ఎంపికైన సంగతి తెలిసిందే. బాలయ్య తో కలిసి నాల్గవ సారి నటిస్తోంది. మొత్తంగా 2026 లో అమ్మడు తొమ్మిది రిలీజ్ లతో ప్రేక్షకుల్ని అలరించడం ఖాయం. చాలా కాలం త ర్వాత నయన్ ఒకే సారి ఇన్ని సినిమాలతో రావడం ఇదే.

**2026 లో ఫుల్ జోష్ తో:** సక్సస్ తో నిలదొక్కుకున్న సమయంలో ఒకే ఏడాది ఆరేడు సినిమాలతో ప్రేక్షకుల మధ్యలో ఉండేది. కాల క్రమంలో అమ్మడు సినిమాల సంఖ్య తగ్గించింది. దీంతో రిలీజ్ లు తగ్గాయి. లేడీ ఓరియేంటెడ్ చిత్రాల్లో నటించాలి అన్న ఆసక్తి కారణంగా చాలా సమయాన్ని వృద్దా చేసింది. కొన్ని కథలు నచ్చినా సరైన దర్శకులు సెట్ కాకపో వడం..మరికొన్ని నచ్చక పోవడంతో పట్టాలెక్కడంలో జాప్యం చోటు చేసుకుంది. కొత్త ఏడాదిలో మాత్రం వరుస రిలజ్ లతో అభిమానుల్లో మళ్లీ జోష్ నింపనుంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536